బుధవారం
21•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 283
• పేజీలు : 16 + (20/16) + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

తెలుగు తప్పనిసరి

ప్రభుత్వ, ప్రైవేటు తేడాలేదు.. అన్ని బడులలో అమ్మభాష

ఒక సబ్జెక్టుగా తప్పనిసరి.. జీవితంలో ఉపయోగపడే అంశాలు బోధించాలి.. నైతిక విలువలను, దేశభక్తిని పెంపొందించాలి

అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం.. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం చేస్తామని వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలుగుభాష తప్పనిసరి అమలుపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. అమ్మభాషకు పట్టం కట్టేందుకు నడుంబిగించారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు అన్నిటిలో తెలుగు బోధన అమలు దిశగా చర్యలు చేపట్టారు. 2018-19 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషను తప్పనిసరిగా ఒక సబ్జెక్టుగా బోధించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ విధానం అమలుకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టం తెస్తున్నట్టు వెల్లడించారు. మాతృభాష బోధన అమలుకు సంబంధించి తమిళనాడులోని విధానాన్ని అధ్యయనం చేసివచ్చిన అధికారులతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రగతిభవన్‌లో సమావేశమయ్యారు. తెలుగును ఒక సబ్జెక్టుగా బోధించడంపై రూపొందించాల్సిన విధివిధానాల గురించి చర్చించారు. 'మాతృభాష అయిన తెలుగును రక్షించుకోవడం, మన సంస్కృతిని కాపాడుకోవడం లక్ష్యంగా తెలంగాణలోని అన్ని విద్యాసంస్థల్లో తెలుగును సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించాం. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇంగ్లిష్ మీడియంలో చదువడం అందరికీ అనివార్యమవుతున్నది. పిల్లల భవిష్యత్తును కూడా దెబ్బతీయవద్దు. అదేక్రమంలో తెలుగు కనుమరుగు కావద్దు. అందుకే ఇంగ్లిష్ మీడియంలో చదివే విద్యార్థులు కూడా తెలుగు భాష నేర్చుకోవాలనే నిబంధన పెడుతున్నాం. మొదట ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరి చేయాలని భావించాం. అయితే ఇంటర్మీడియట్ (10+2) బోధనా విధానం అన్ని విద్యాసంస్థల్లో ఒకే మాదిరిగా లేదు. ఇంటర్మీడియట్‌లో

మిగతా 2వ పేజీలో



మారుతున్న పరిస్థితుల్లో ఆంగ్ల మాధ్యమంలో చదువడం అనివార్యమవుతున్నది. పిల్లల భవిష్యత్తును కూడా దెబ్బతీయవద్దు. అదేక్రమంలో తెలుగు కనుమరుగు కావద్దు.

– ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

కేంద్రం అప్పు 82 లక్షల కోట్లు



- అప్పులు చేయని ఒక్క బీజేపీ పాలిత రాష్ట్రముందా?
- తెలంగాణలోని పథకాలు ఎక్కడన్నా అమలవుతున్నయా?
- కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి మనమే శాపాలు పెట్టడం సరికాదు
- నిర్మాణాత్మక విమర్శలు చేస్తే కచ్చితంగా స్వీకరిస్తం
- శాసనసభలో బీజేపీ సభ్యుల విమర్శలపై ఘాటుగా స్పందించిన సీఎం కేసీఆర్

2



కేసీఆర్ కిట్ తరహాలో మధ్యప్రదేశ్‌లో పథకం

ప్రసవానంతరం 12 వేలు నగదు • బాలింత, బిడ్డలకు కానుకలు

మధ్యప్రదేశ్ సీఎం ప్రకటన • రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ పథకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ

రాష్ట్రంలో విశేష ప్రజాదరణ చూరగొనడమే కాకుండా, ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల శాతాన్ని పెంచుతున్న కేసీఆర్ కిట్స్ పథకం మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ప్రేరణగా నిలిచింది. ఇదే తరహా పథకాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఇటీవల తన జన్మదినోత్సవం సందర్భంగా ప్రకటించారు. పేద మహిళలకు ప్రసవానంతరం రూ.12వేల రూపాయల నగదు ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో ఇస్తున్న కేసీఆర్ కిట్‌లో అందిస్తున్న చీరె, సబ్బులు, బేబీ ఆయిల్, మదర్ ఆయిల్, దోమతెర లాంటివి కూడా ఇవ్వనున్నారని సమాచారం. 'గతంలో మహిళ ప్రసవిస్తే తల్లిదండ్రులు, సోదరులు మిఠాయిలు, చీరె, ఇతర వస్తువులు తీసుకొచ్చేవారు. ఇప్పుడు రాష్ట్రంలోని మహిళలకు సోదరుడిగా అండగా నిలుస్తా. ఆ బాధ్యత నేను తీసుకుంటున్నా. అందుకే రాష్ట్రంలో ప్రసవించిన ప్రతి మహిళకు రూ.12 వేలను అందించాలని నిర్ణయించాం' అని

మిగతా 2వ పేజీలో

ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో

ఆగస్టునాటికి జేబీఎస్, ఎంజీబీఎస్ వద్ద పనులుపూర్తి: అసెంబ్లీలో మంత్రి కేటీఆర్

రెండోదశపై నగర ఎమ్మెల్యేల అభిప్రాయాలు స్వీకరిస్తామని వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైటెక్‌సిటీవాసులకు, పాతబస్తీవాసులకు కూడా మెట్రోరైలు ప్రయాణ సౌలభ్యాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు స్పష్టంచేశారు. నాగోల్, హైటెక్‌సిటీ, ఫలక్‌నుమా నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రోను విస్తరిస్తామని వివరించారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో మెట్రో పనులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానమిచ్చారు. మెట్రో ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.14,133 కోట్లు, కాగా ఇప్పటివరకు రూ. 2,296 కోట్లు ఖర్చు చేశామన్నారు.. కేంద్రం రూ.1,458 కోట్లు ఇవ్వాల్సి ఉండగా..1,200 కోట్లు ఇచ్చిందని వివరించారు. జేబీఎస్, ఎంజీబీఎస్ వద్ద మెట్రో పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఆగస్టు వరకు పూర్తవుతాయని తెలిపారు. మెట్రో

మిగతా 2వ పేజీలో



అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

ప్రజల మనసు గెలిచాం

దేశం గర్వపడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాం

- మాది తెలంగాణ అని గర్వంగా చెప్పుకొంటున్నాం
- అభివృద్ధిని చూసి అబ్బురపడుతున్న అన్ని రాష్ట్రాలు
- తెలంగాణలో ఇతర ఏ పార్టీకీ పుట్టగతులుండవు
- నిధుల విషయంలో కేంద్రం మొండిచేయి
- బీజేపీ రాష్ట్ర నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- బడ్జెట్‌పై చర్చకు శాసనసభలో ఆర్థికమంత్రి ఈటల సమాధానం



శాసనసభలో మాట్లాడుతున్న మంత్రి ఈటల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'తెలంగాణలో నాడు బొంబాయి, బొగ్గుబాయి బతుకులే ఉండేవి. అన్నివర్గాల ప్రజలూ కష్టాలు పడేవారు. కానీ తెలంగాణ రాష్ట్రం అవతరించాక, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో వినూత్న రీతిలో అభివృద్ధిలో దూసుకెళుతున్నాం. ఇక్కడి ప్రజల కష్టాలు, కన్నీరు తెలిసిన ప్రభుత్వం వారికి ఉపశమనం కలిగించేలా, భవిష్యత్ సమస్యలకూ పరిష్కారం చూపేలా పథకాలను ప్రారంభించింది. ప్రస్తుతం తెలంగాణ పేరు చెప్తే అన్నిరాష్ట్రాలూ ప్రత్యేక గౌరవం ఇస్తున్నాయి. మూడున్నరేండ్ల కాలంలో తెలంగాణ ప్రజలందరి హృదయాలను గెలుచుకున్నాం.. నాది తెలంగాణ అని గర్వంగా చెప్పేస్థాయికి తీసుకొచ్చాం..' అని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు మంగళవారం శాసనసభలో ఆయన సమాధానమిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం మానవీయకోణంలో ప్రజల కష్టాలను దూరం చేసేలా పథకాలు రూపొందించిందని తెలిపారు. ఈ ఏడాదిలోగా అన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. మిషన్ కాకతీయ, భగీరథ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్లు వంటి రాష్ట్ర ప్రభుత్వ పథకాలను చూసి అన్ని రాష్ట్రాలు అబ్బురపడుతున్నాయని అన్నారు. కొత్తరాష్ట్రమైన తెలంగాణకు నిధులు ఇచ్చే విషయంలో కేంద్రం మొండివైఖరి అవలంబిస్తున్నదని చెప్తూ రాష్ట్ర బీజేపీ నాయకులు ఇక్కడ విమర్శలు చేసేకంటే కేంద్రంపై ఒత్తిడిచేసి నిధులు రాబట్టాలని సూచించారు. బడ్జెట్‌పై మంత్రి ఈటల వివరణ ఆయన మాటల్లోనే..

మానవీయకోణంలో పథకాలు

తెలంగాణలో అమలుచేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలను ఆకర్షిస్తున్నాయి. కేసీఆర్ కిట్స్ పథకాన్ని మధ్యప్రదేశ్‌లో అమలుచేసేందుకు సిద్ధమయ్యారు. రైతులను ఆదుకునేందుకు ఇన్సూరెన్స్ పథకం, పెట్టుబడి పథకం, పేద మహిళలకు అండగా కల్యాణలక్ష్మి,

మిగతా 11వ పేజీలో

పార్కింగ్ ఫీజుల దందాకు చెక్

ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం

మొదటి 30 నిమిషాలు ఉచితం

షాపింగ్ బిల్లులుంటే గంటవరకు

పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నగర, పట్టణవాసులకు శుభవార్త. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో పార్కింగ్ దందాకు రాష్ట్ర ప్రభుత్వం కళ్లెం వేసింది. షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలు, మల్టిప్లెక్సుల్లో పార్కింగ్ ఫీజులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర పురపాలకశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు ఏప్రిల్ 1 నుంచి అమలవుతాయని స్పష్టంచేసింది. పట్టణాల్లో చాలా షాపింగ్‌మాల్స్, మల్టిప్లెక్సులు, ఇతర వాణిజ్య సముదాయాల్లో సమయాన్ని, వాహనాన్ని బట్టి కనిష్ఠంగా రూ.20 నుంచి పార్కింగ్ ఫీజులు వసూలు

మిగతా 2వ పేజీలో

ఈత నేర్పండి.. పిల్లలు జాగ్రత్త!

- అశ్రద్ధ, అవగాహనారాహిత్యం, ఏమరుపాటుతో అనర్థాలు
- పెద్దల పర్యవేక్షణా లోపం చిన్నారులకు శాపం
- పండుగలు, సెలవు రోజుల్లో ఎక్కువ మరణాలు

15



మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

గవర్నర్‌తో సీఎం కేసీఆర్ భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. గంటన్నరపాటు జరిగిన భేటీలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తీరుతోపాటు రాష్ట్రంలో పలు సంక్షేమ, అభివృద్ధికార్యక్రమాల అమలుపై సీఎం గవర్నర్‌కు వివరించినట్టు తెలిసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద పేదల వివాహాలకిచ్చే ఆర్థికసాయాన్ని పెంచిన విషయంతోపాటు, సంక్షేమ కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయింపుల తీరును వివరించారు. దేశంలో ఫెడరల్‌ఫ్రంట్ ఏర్పాటు దిశలో జరుగుతున్న ప్రయత్నాలు, పశ్చిమబెంగాల్ సీఎం మమతబెనర్జీతో భేటీ తదితర అంశాలు కూడా వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద అందజేస్తున్న ఆర్థికసహాయాన్ని పెంచడాన్ని హర్షిస్తూ మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కవిత. చిత్రంలో ఆమె తండ్రి రెడ్యానాయక్ కూడా ఉన్నారు.



మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన హైదరాబాద్ లా అండ్ ఆర్డర్ అడిషనల్ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్

కేసీఆర్ కిట్ తరహాలో మధ్యప్రదేశ్‌లో పథకం

మొదటిపేజీ తరువాయి...

చౌహాన్ తెలిపారు. ఇలా మనరాష్ట్ర పథకాలు ఇతర ప్రాంతాల్లో స్ఫూర్తి కలిగించిన సంఘటన ఇదే మొదటిది కాదు. ఇప్పటికే మనరాష్ట్రంలో అమలు చేస్తున్న వినూత్న పథకాలపై దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు ఆసక్తిని చూపాయి. స్ఫూర్తిని పొందాయి. ఆదర్శంగా తీసుకున్నాయి. ఇంటింటికీ నల్లానీళ్లపై అప్పటి ఉత్తరప్రదేశ్ సీఎం అఖిలేశ్ యాదవ్ ఆసక్తిగా అడిగిమరీ తెలుసుకున్నారు. అలాగే టీఎస్ఐపాస్ లాంటి వినూత్నమైన పాలసీ ద్వారా జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షిస్తుండటంతో.. ఇతర రాష్ట్రాలన్నీ మన పాలసీని అధ్యయనం చేస్తున్నాయి. మిషన్ కాకతీయ లాంటి జల వనరుల పునరుజ్జీవన పథకాన్ని అంతర్జాతీయ స్థాయిలో అందరూ ప్రస్తుతించారు. అధ్యయనం చేశారు. చాలారాష్ట్రాలు అలాంటి పథకాన్ని అమలు చేయాలనే సంకల్పంతో ఉన్నాయి. ఇక మనరాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, హెల్త్ స్కీం లాంటివి దేశవ్యాప్తంగా అమలు చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వంకూడా మన ఆరోగ్య పథకాలను అధ్యయనం చేసింది. త్వరలో హెల్త్‌స్కీంను ప్రకటించే అవకాశంకూడా ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం.. ముఖ్యంగా సీఎం కేసీఆర్ వినూత్నంగా ఆలోచించి.. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను పెంచాలనే ఉద్దేశంతో.. ప్రసవించిన ప్రతి మహిళకు మగబిడ్డ అయితే రూ. 12 వేలు (మూడు విడతలుగా), ఆడపిల్ల పుడితే రూ.13 వేల నగదుసాయంతోపాటు.. రూ.2వేల విలువైన కేసీఆర్ కిట్లకు శ్రీకారం చుట్టారు. 2017 జూన్ 3 నుంచి ప్రారంభించిన ఈ పథకంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మహిళలు ప్రసవాల కోసం ప్రభుత్వ దవాఖానలకు రావడం పెరిగింది. గతంలో ప్రభుత్వ దవాఖానల్లో 30% ప్రసవాలు జరుగగా.. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రసవాలు 50 శాతానికి పెరిగాయి. ప్రతి ప్రసవానికి ఇచ్చే ఆర్థికసాయంతోపాటు.. రూ.2 వేల విలువైన కేసీఆర్ కిట్ పట్లకూడా మహిళలు సంతోషాన్ని వ్యక్తంచేస్తున్నారు. ఈ కిట్‌లో దోమతెర, సబ్బులు, బేబీఆయిల్, మదర్‌ఆయిల్, గిలక తదితర 16 వస్తువులను అందిస్తున్నారు. మారుమూల గ్రామాల్లోని బాలింతలకు, వారికి పుట్టిన పిల్లలకు సాధారణంగా కావాల్సిన వస్తువులు అందుతుండటంతో వారిలో ఆనందం రెట్టింపవుతున్నది.

పార్కింగ్ ఫీజుల దందాకు చెక్

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నారు. ఇది అన్ని వర్గాల వారికి భారంగా పరిణమించింది. ప్రజల నుంచి చాలా ఫిర్యాదులు రావడం, ప్రభుత్వం సైతం పార్కింగ్ ఫీజు వసూలుపై తొలి నుంచి విముఖత చూపడంతో తాజా నిబంధనలు వెలువడ్డాయని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. తాజా ఆదేశాల ప్రకారం వాహనాన్ని నిలిపిన మొదటి 30 నిమిషాల వరకు ఎలాంటి పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదు. షాపింగ్ బిల్లు చూపిస్తే.. గంట వరకు పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదు. షాపింగ్ బిల్లు లేదా సినిమా టికెట్ ధర పార్కింగ్ ఫీజు కంటే అధికంగా ఉంటే.. ఆ తర్వాత సమయానికి కూడా పార్కింగ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

కేంద్రం అప్పు 82 లక్షల కోట్లు

- దేశ జీడీపీలో ఇది 49.5 శాతం
- తెలంగాణ జీడీపీలో అప్పులది 21 శాతమే
- అప్పులు చేయని బీజేపీ పాలిత రాష్ట్రముందా?
- తెలంగాణ పథకాలు ఏ రాష్ట్రంలోనైనా అమలవుతున్నాయా?
- కొత్త రాష్ట్రానికి మనమే శాపాలు పెట్టడం సరికాదు
- శాసనసభలో బీజేపీ సభ్యుల విమర్శలపై ఘాటుగా స్పందించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అప్పుల గురించి గురివింద నీతులను చెప్పే బీజేపీ నేతలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఘాటుగా సమాధానమిచ్చారు. అటు కేంద్రంలోని, ఇటు రాష్ట్రాల్లోని బీజేపీ సర్కార్లు అప్పులు చేయకుండానే పాలన సాగిస్తున్నాయా? అని సూటిగా ప్రశ్నించారు. దేశంలో ఉన్న 21 బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా అప్పు తీసుకోకుండా ఉన్నరా? అప్పులు చేయకుండానే ఆ రాష్ట్రాలు పరిపాలన కొనసాగిస్తున్నయా? అని నిలదీశారు. శాసనసభలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గతంలోనే తాను అప్పుల విషయమై అనేక మార్లు స్పష్టతనిచ్చానని, అయినా కొందరు సభ్యులు పదేపదే అప్పులను ప్రస్తావించడంపై సీఎం విస్మయం వ్యక్తంచేశారు. 'మా పరిమితికి లోబడి అప్పులు చేస్తున్నాం. అప్పులు తీసుకోవడమనేది బడ్జెట్‌లో భాగం' అని స్పష్టంచేశారు. దేశ జీడీపీ రూ.167 లక్షల కోట్లయితే.. కేంద్రంలోని బీజేపీ సర్కారు రూ.82 లక్షల కోట్ల అప్పు ఎందుకు తీసుకున్నదని సీఎం అడిగారు. అంటే జీడీపీలో 49.5 శాతం అప్పులు తీసుకున్నదని చెప్పారు. గత మూడేండ్ల లెక్కల్ని పరిశీలిస్తే.. 2016-17లో రూ.5,35,618 కోట్లు, 2017-18లో రూ.5,94,849 కోట్లు, 2018-19లో రూ.6,24,276 కోట్లు అప్పుగా తీసుకున్నదని వివరించారు. ఈ ఏడాది కేంద్రం చెల్లిస్తున్న అప్పులు రూ.8.76 లక్షల కోట్లు అని, ఇవన్నీ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పిన లెక్కలేనని సీఎం అన్నారు. తెలంగాణ రాష్ట్రం జీడీపీలో 21 శాతం మాత్రమే అప్పులు తీసుకుందని సీఎం నొక్కిచెప్పారు. ఇందులోనూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉదయ్ పథకానికి సంబంధించి డిస్కంలకు చెల్లించిన రూ.9 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నెత్తిమీద వేసిందని అన్నారు. దీనిని మినహాయిస్తే జీడీపీలో అప్పుల వాటా కేవలం 19 శాతం మాత్రమేనని తెలిపారు. అప్పుల గురించి 1950 దశకంలో కమ్యూనిస్టులు చెప్పే మాటలు కూడా చాలా గమ్మత్తుగా ఉండేవని సీఎం కేసీఆర్ అన్నారు. మనమే కాదు.. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అప్పులు తీసుకుంటాయని అంటూ, అమెరికా జీడీపీ 14 ట్రిలియన్ డాలర్లయితే అప్పులు అంతకంటే ఎక్కువనే ఉన్నాయని, జపాన్ తన జీడీపీ కంటే 250 శాతం అధికంగా అప్పులు తీసుకున్నదని ఉదహరించారు. మరి ఆ దేశాలు బుద్ధి తక్కువ దేశాలా? అని సీఎం ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో పది సంవత్సరాల్లో 23 జిల్లాలకు కలిపి క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ రూ.1.19 లక్షల కోట్లయితే.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ నాలుగేండ్లలో కేవలం పదిజిల్లాల క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ రూ. 1.17 లక్షల కోట్లుగా ఉందని చెప్పారు. ఇవన్నీ చూడకుండా.. ఏం జరిగిందో తెలుసుకోకుండా.. రొడ్డకొట్టుడు ఉపన్యాసం చెప్తే ఎట్ల? అని సీఎం నిలదీశారు.



ఇన్ని పథకాలు ఏ రాష్ట్రంలోనైనా ఉన్నయా?

తెలంగాణలో అమలవుతున్నన్ని పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలోనైనా ఉన్నయా? అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. 'అసలు తెలంగాణ ప్రభుత్వం ఏం చేయనట్టు చెప్పడం ఎంతవరకు సమంజసం? మేం కట్టిన సాగునీటి ప్రాజెక్టులు కనిపిస్తలేవా? మిషన్ భగీరథ అంటే దాన్ని వక్రంగా చూడటం. రాష్ట్రంలో ఇన్ని గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసినం. ఏ ఒక్క బీజేపీ పాలిత రాష్ట్రంలోనైనా ఇన్ని హాస్టళ్లు ఉన్నయా? మధ్యప్రదేశ్ సీఎం ఈ ఎన్నికల సంవత్సరంలో మనం అమలు చేస్తున్న కేసీఆర్ కిట్ పథకాన్ని పూర్తిగా అక్కడ 'సుజన్‌సే.. విసర్జన్ తక్' అనే పేరుతో అమలు చేయబోతున్నరు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనైనా అమలవుతున్నయా? పోల్చి చూద్దామా? ఏ రాష్ట్ర ఆదాయం, పరిస్థితులకు అనుగుణంగా అక్కడ పథకాలు చేపడుతరు. అదృష్టంకొద్దీ తెలంగాణకు మంచి ఆదాయం ఉన్నది. ఇప్పుడు 22 శాతంగా ఉన్న వృద్ధి రేటుకు వచ్చే సంవత్సరం మరో 15-16 శాతం జత కానున్నది. కల్యాణలక్ష్మి కింద రూ.1,01,116 ఇస్తామని ఇదే సభలో ప్రకటించిన. తెలంగాణకు మంచి ఆదాయం ఉందనే ధైర్యంతోనే కదా ఈ ప్రకటన చేసింది? ఉద్యమ సమయంలో చెప్పినట్టు.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే మంచి జీతాలు మన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నం. దేశంలోనే తెలంగాణ ఉద్యోగులు వెల్‌పేడ్ ఎంప్లాయిస్‌గా ఉన్నరు. పీఆర్సీ వేస్తం.. ఇంటరిమ్ రిలీఫ్ ఇస్తం.. దానికి ఇంక టైం ఉన్నది. బడ్జెట్‌లో కేటాయింపులు చేసినం' అని సీఎం అన్నారు.

విమర్శలకు హద్దూ పద్దూ ఉండాలి..

ప్రతిపక్షాలు చేసే విమర్శలకు హద్దూపద్దూ ఉండాలని సీఎం కేసీఆర్ చురకలు అంటించారు. 'ఇది కొత్త రాష్ట్రం.. నిజంగా ఏదైనా పొరపాటు జరిగితే, తప్పు ఉంటే విమర్శించండి. కచ్చితంగా మేం సరిదిద్దుకుంటం. హైదరాబాద్‌లో రోడ్లు బాగా లేవన్నరు. మంచిదే. కచ్చితంగా మున్సిపల్ శాఖ ఆ పని చేయాలి. రోడ్లను బాగు చేయాలి. ఇలాంటి నిర్మాణాత్మక విమర్శలు చేస్తే బాగుంటది. కానీ మన రాష్ట్రానికి మనమే శాపాలు పెట్టుకోవడం మంచిది కాదు. దేశంలోనే 22 శాతం వృద్ధిరేటుతో తెలంగాణ నెంబర్‌వన్‌గా ఉంది. ఇప్పుడు ఇసుక మీద ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో పదిశాతం కూడా గత ప్రభుత్వాల హయాంలో రాలేదు. అయినా ఇసుక మాఫియా అని మాట్లాడుతరు. రైతులకు రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేసినం. అయినా రైతులకు మేమేం చేయలేదంటే ఎట్ల? రాష్ట్రంలో 38 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినం. ఒకరిద్దరికి ఏదైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురమ్మని చెప్పినం. కాంగ్రెస్ నాయకులు ఒక పేపర్ ఇచ్చినరు. అండ్ల అన్నీ శుద్ధతప్పులే. ఇప్పుడు బీజేపీ సభ్యులు చెప్తున్నట్టు.. ఏ జిల్లాలోనైనా సమస్య ఉంటే చెప్పండి. ఇన్ని వేల కోట్ల రుణాలు మాఫీ చేసినోళ్లం.. రూ.50-100 కోట్లు ఇవ్వమా? ఆ చెడ్డపేరు మేం ఎందుకు తెచ్చుకుంటం. బీజేపీ సభ్యులు ఏం సమస్య ఉందో ఆ వివరాలివ్వండి. వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులు కూర్చుని 3-4 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తరు' అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

తెలుగు తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి...

తెలుగును అమలుచేయడం కాస్త ఇబ్బందిగా మారుతుంది. తమిళనాడు, పంజాబ్ తదితర రాష్ట్రాలలో మాతృభాష బోధన అమలును పరిశీలించిన అనంతరం మొదటిదశలో పదో తరగతి వరకు తెలంగాణలో తెలుగును తప్పనిసరిగా సబ్జెక్టుగా బోధించాలని నిర్ణయించాం' అని సీఎం కేసీఆర్ ప్రకటించారు. తరగతులవారీగా తెలుగులో బోధించాల్సిన అంశాలకు సంబంధించి సిలబస్ రూపొందించాల్సిందిగా తెలుగు యూనివర్సిటీ, సాహిత్య అకాడమీలను కోరారు. భాషను కాపాడుకోవడంతోపాటు, మాతృభాష ద్వారా జీవితంలో ఉపయోగపడే విషయాలను విద్యార్థులకు బోధించాలని చెప్పారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, దేశభక్తిని పెంచే అంశాలుండాలని వివరించారు. తెలుగు చదివే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉండడం కోసం అసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కూడా తప్పనిసరిగా ఒక తెలుగు పండిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను సీఎం ఆదేశించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కే తారకరామారావు, జూపల్లి కృష్ణారావు, పద్మారావు, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి, తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, ఎస్సీఈఆర్టీ అధికారి సువర్ణ వినాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాతృభాష బోధన అమలుపై మంగళవారం ప్రగతిభవన్‌లో మంత్రులు, అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కే తారకరామారావు, జూపల్లి కృష్ణారావు, పద్మారావు, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి, తెలుగు యూనివర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, ముఖ్య కార్యదర్శులు రంజీవ్ ఆర్. ఆచార్య, బుర్రా వెంకటేశం, నర్సింగ్‌రావు , జీ కిషన్ కూడా ఉన్నారు.

సీఎం కేసీఆర్ నిర్ణయం హర్షణీయం

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు తప్పనిసరిగా ఒక బోధనాంశంగా ఉండాలని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మాతృభాష అమలుపై రూపొందించిన చట్టాలను సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాతే సీఎం కేసీఆర్ పదో తరగతి వరకే తప్పనిసరి తెలుగును అమలు చేయడంపై తుది నిర్ణయం తీసుకున్నారని అన్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.23 గంటలకు

సూర్యాస్తమయం: 6.23 గంటలకు

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం చతుర్థి మధ్యాహ్నం 3.30 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: భరణి రాత్రి 7.02 వరకు తదుపరి కృత్తిక, అమృతఘడియలు: మధ్యాహ్నం 2.23 నుంచి 3.59 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.23 నుంచి 1.53 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.59 నుంచి మధ్యాహ్నం 12.47 వరకు, వర్జ్యం: లేదు.

లోకం పోకడ



పిల్లల్లో డిజిటల్ విద్యపట్ల అవగాహన కల్పించమన్నది ఇలా కాదు!

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాలపై మార్గదర్శకాలు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాలు, సెలవుల మంజూరు, క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన మార్గదర్శకాలను వివరిస్తూ.. మంగళవారం మహిళాభివృద్ధి, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు గౌరవ వేతనం లేకుండా 180 రోజులు వైద్యపరమైన సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం వైద్యుడి ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సూచించింది. వ్యక్తిగత కారణాలతో 90 రోజులు వేతనం లేకుండా సెలవు పెట్టడానికి అవకాశం కల్పిస్తూ మంగళవారం మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం జగదీశ్‌రావు ఉత్తర్వులు జారీచేశారు.


నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యామ్నాయ స్థలాలు

నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో ప్రాథమిక పాఠశాలల ఆవరణలో నిర్మించాల్సిన అంగన్‌వాడీ భవనాలకు ప్రత్యామ్నాయ స్థలాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. సంగారెడ్డి జిల్లాలో 16, నల్లగొండలో 32 అంగన్‌వాడీ భవనాలను నిర్మించనుంది. వీటిని ప్రాథమిక పాఠశాలల ఆవరణలో నిర్మించాలని తొలుత ప్రభుత్వం భావించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాథమిక పాఠశాలల్లో అనుకూలమైన స్థలం లేని కారణంగా ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని మహిళాభివృద్ధి, శిశు, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం జగదీశ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

రిజర్వేషన్ల కోసం మా పోరాటం

- అవిశ్వాసానికి మా ఆందోళన అడ్డుకాదు
- తెలుగు ప్రజలకు ఉపయోగపడే సూచనలు చేస్తాం: ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం నుంచి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో వెనకబడినవర్గాల రిజర్వేషన్ల అంశంపై పోరాడుతున్నామని డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. అవిశ్వాసానికి టీఆర్ఎస్ ఎంపీలు అడ్డుపడుతున్నారంటూ అనవసర ఆరోపణలు చేయడం సరికాదని ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, వైసీపీ ఎంపీ వరప్రసాద్ తమ ఆందోళనపై మాట్లాడటం సరికాదన్నారు. ఆందోళన వెనుక బీజేపీ ఉన్నదని, బీజేపీ ప్రోత్సాహంతోనే అవిశ్వాస సమయంలో టీఆర్ఎస్, ఏఐఏడీఎంకే ఎంపీలు ఆందోళన చేస్తున్నారని వ్యాఖ్యానించడంపై ఎంపీ వినోద్ మండిపడ్డారు. రిజర్వేషన్ల అంశంపై సమావేశాల ప్రారంభం నుంచీ ఆందోళన చేస్తున్నామని, అవిశ్వాసం అనేది నిన్న కాక మొన్న తెరపైకి వచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణలో 50 నుంచి 62 శాతానికి రిజర్వేషన్లను పెంచేందుకు ఆందోళన చేస్తున్నామన్నారు. అవిశ్వాసంపై మద్దతు లెక్కించేందుకు తమ ఆందోళన అసలే అడ్డుకాదని.. మద్దతు లెక్కించాలనుకుంటే చాలా అవకాశాలున్నాయన్నారు. స్పీకర్ కుర్చీ సభ్యుల కుర్చీల కంటే చాలా ఎత్తులో ఉంటుందని, స్పీకర్ తలుచుకుంటే అవిశ్వాసానికి మద్దతు లెక్కింపు కష్టమేమీ కాదని వివరించారు. రిజర్వేషన్ల అంశంపై ఆందోళన చేస్తున్నా ఆర్థికబిల్లును ఆమోదించుకున్నారన్నారు. అవిశ్వాసం చర్చకు వస్తే రాష్ట్రానికి రావాల్సిన అన్నిఅంశాలను లేవనెత్తుతామని చెప్పారు. రాజీనామాల అంశంపై అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరి సభలో మాట్లాడారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రజల మనోభావాలను అగౌరవపరిచేలా మాటలు మాట్లాడటం సరికాదన్నారు. రిజర్వేషన్ల అంశంపై సభలో టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన కొనసాగుతుందని ఎంపీ వినోద్ పేర్కొన్నారు.



మంగళవారం ఢిల్లీలో కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన టీఆర్ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, బీబీపాటిల్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, సీతారాంనాయక్, నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బాల్క సుమన్

టీజీబీ పరిధిలోకి అన్ని జిల్లాలు తీసుకొరావాలి

ఏపీజీవీబీ పరిధిలో ఉన్న జిల్లాలను తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలోకి తీసుకొరావాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి ఎంపీ వినోద్‌కుమార్ లేఖరాశారు. రాష్ట్రం విభజన తర్వాత ఏపీజీవీబీ రెండు రాష్ట్రాల్లో లావాదేవీలు నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని దక్కన్ గ్రామీణ బ్యాంకు.. విభజన తర్వాత తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారిందని.. ప్రస్తుతం ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతాల్లో లావాదేవీలు నిర్వహిస్తున్నదని వివరించారు. ఏపీజీవీబీ పరిధిలోని వరంగల్, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని ఖాతాలను తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ విషయమై గతంలో వినతిపత్రం ఇచ్చామని, కేంద్రం ప్రభుత్వం కూడా జీవో ఇచ్చినా ఇంకా అమలు చేయడం లేదన్నారు.

కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన ఎంపీలు

రిజర్వేషన్ల అంశాన్ని త్వరగా తేల్చాలని, రాష్ట్ర విభజన హామీలు అమలుచేయాలని టీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను మంగళవారం ఢిల్లీలో కలిసి విజ్ఞప్తిచేశారు. పార్లమెంట్‌లో రిజర్వేషన్ల అంశంపై మాత్రమే టీఆర్ఎస్ పట్టుపడుతుందని, అవిశ్వాస తీర్మానంతో ఎలాంటి సంబంధం లేదని ఎంపీ వినోద్‌కుమార్ తేల్చిచెప్పారు.

ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో

మొదటిపేజీ తరువాయి...

మార్గాల్లో రహదారుల విస్తరణ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రక్రియలో ప్రార్థనామందిరాలకు నష్టం జరుగకుండా చూసేందుకు ప్రత్యేక ఇంజినీరింగ్ నైపుణ్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. కొన్నిచోట్ల రోడ్ల వెడల్పు 200 అడుగుల మేర విస్తరిస్తున్నామని, సుల్తాన్‌బజార్ ఏరియాలో 66 అగుడుల వరకు విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. పాతబస్తీలో ప్రాజెక్టు పనులను వందకు వంద శాతం పూర్తిచేస్తామని చెప్పారు. మెట్రో 2వ దశపై నగర ఎమ్మెల్యేలందరి అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగుతామని చెప్పారు.

పార్కింగ్ స్థలాల గుర్తింపునకు స్మార్ట్ యాప్: కేటీఆర్

హైదరాబాద్‌లో పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్నామని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. పార్కింగ్ సమస్యపై సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మల్టీలెవల్ పార్కింగ్‌ను పరిశీలిస్తున్నామని చెప్పారు. పార్కింగ్ స్థలాల గుర్తింపునకు స్మార్ట్ యాప్‌ను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో పార్కింగ్ ప్రాంతాలను పెంచడానికి ప్రతిపాదనలు చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో 54 పార్కింగ్ స్థలాల ద్వారా రూ.96 లక్షల ఆదాయం వస్తున్నదని.. అయితే ఈ పార్కింగ్ స్థలాలను కూడా ఫ్రీ పార్కింగ్‌గా మార్చేశామని మంత్రి వెల్లడించారు. పార్కింగ్ విధానం రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఉన్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు 22 సైట్లను కేటాయిస్తున్నామని చెప్పారు. సాయంత్రం వేళల్లో ప్రభుత్వ స్థలాలను పార్కింగ్ కోసం వినియోగించుకోవాలనే సూచనను అమలుచేస్తామన్నారు. ట్రక్ పార్కింగ్ అంశాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్లు అద్భుతం

- ఇతర రాష్ర్టాలకు ఆదర్శంగా నిలుస్తాయి
- ప్రశంసలు కురిపించిన కేరళ పాత్రికేయుల బృందం

హైదరాబాద్ సిటీబ్యూరో/మల్లాపూర్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకం అద్భుతంగా ఉన్నదని కేరళ రాష్ట్రంలోని కొట్టాయం జిల్లాకు చెందిన జర్నలిస్టుల బృందం ప్రశంసించింది. నిరుపేదలకు ఉచితంగా ఇచ్చేందుకు చేపట్టిన ఇటువంటి పథకం దేశంలో మరెక్కడా అమలవుతున్న దాఖలాలు లేవని, ఇతర రాష్ర్టాలకు ఆదర్శంగా నిలుస్తున్నదని పేర్కొన్నది. కొట్టాయంకు చెందిన వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన 57 మంది పాత్రికేయ బృందం రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పరిశీలించేందుకు మూడురోజుల పర్యటనలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు నాచారంలోని సింగంచెరువు తండాలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలించారు. సువిశాలమైన గదులు, మౌలిక సదుపాయాలతో ప్రైవేటు అపార్ట్‌మెంట్లకు ఏమాత్రం తీసిపోకుండా పూర్తి ప్రభుత్వ ఖర్చుతో నిర్మించి.. ప్రజలకు ఉచితంగా ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. 580 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండుపడక గదులు, రెండు టాయిలెట్లు, ఒక కిచెన్, ఒక హాలుతో కూడిన ఈ ఇండ్లు పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ఉన్నాయని వారు ప్రశంసించారు. డబుల్ బెడ్‌రూమ్ గృహనిర్మాణ పథకం కింద గ్రేటర్ పరిధిలో ఈ ఏడాది రూ.8,542 కోట్లతో లక్ష ఇండ్లను నిర్మిస్తున్నట్టు పాత్రికేయుల బృందానికి.. జీహెచ్‌ఎంసీ అధికారులు వివరించారు. కొట్టాయం జిల్లా సమాచార అధికారి శ్రీనిథామస్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సానుజార్జ్, కార్యదర్శి సునీల్ నేతృత్వంలో ఈ బృందం చార్మినార్ పాదచారుల ప్రాజెక్టు పనుల పురోగతిని కూడా పరిశీలించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి బీ రాజమౌళి, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ యాదగిరిరావు, హౌసింగ్ ఈఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాచారంలోని సింగం చెరువు తండాలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న కేరళ జర్నలిస్టుల బృందం

రైల్వే అప్రెంటిస్‌లకు 20% రిజర్వేషన్లు

రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వివిధ రైల్వే సంస్థల్లో పనిచేస్తున్న రైల్వే యాక్ట్ అప్రెంటిస్‌లకు ఉద్యోగ నియామకాల్లో 20 శాతం రిజర్వేషన్లను కచ్చితంగా అమలుచేస్తామని రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ముంబైలో విద్యార్థులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో రైల్వే మంత్రి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ రైల్వే భారీ స్థాయిలో రైల్వే ఉద్యోగాలను భర్తీ చేసే ప్రక్రియలో నిమగ్నమై ఉన్నది. ఈ నియామకాలన్నీ సుప్రీంకోర్టు మార్గదర్శక సూత్రాల, చట్టాలకు లోబడి న్యాయపరంగా, పారదర్శకంగా సాగుతాయని రైల్వే మంత్రి తెలిపారు. అప్రెంటిస్‌షిప్ యాక్ట్ కింద ఇప్పటికీ వివిధ రైల్వే సంస్థల్లో అప్రెంటిస్ కోర్సు పూర్తిచేసుకున్న వారికి సెక్షన్ 22(1) ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. రైల్వే ఉద్యోగాల కోసం దరఖాస్తులను చేసుకోవడానికి ఈ నెల 31 చివరితేదని పేర్కొన్నారు.



జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కే రాములుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హైదరాబాద్ కలెక్టర్ యోగితారాణా

తెలంగాణ పోలీసులు భేష్

- అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్స్ ఇవ్వొద్దు
- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కే రాములు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కేసుల విచారణ, నేరస్థుల పట్టివేతలో తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు కే రాములు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలోనూ చొరవచూపాలని, బాధిత కుటుంబాలకు భరోసా కల్పించాలని సూచించారు. మంగళవారం దిల్‌ఖుషా అతిథిగృహంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల స్థితిగతులపై జిల్లా అధికారులతో సమీక్షించారు. అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరికాదని.. నిందితులపై ఛార్జిషీట్లు దాఖలుచేసి, నేరస్థులకు శిక్ష పడేలా చూడాలని కోరారు. ఎఫ్‌ఐఆర్ నమోదుచేసిన వెంటనే అట్రాసిటీ బాధితులకు ఎక్స్‌గ్రేషియా మంజూరుచేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. చట్టాన్ని అమలుచేయడంలో సమానత్వాన్ని పాటించాలని కోరారు.

ఆరు మాసాల్లో రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా..

గత ఆరునెలల్లో ఎస్సీ అట్రాసిటీ బాధిత కుటుంబాలకు రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియాను మంజూరుచేసినట్టు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ యోగితా రాణా తెలిపారు. 2014 నుంచి ఇప్పటి వరకు 53 కేసుల్లో రూ. 53.41 లక్షలను ఎక్స్‌గ్రేషియాను మంజూరుచేశామన్నారు. ఫాస్ట్‌ట్రాక్ పద్ధతిలో అట్రాసిటీ కేసులను పరిశీలిస్తున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ పోలీస్ కమిషనర్ శిఖాగోయల్, నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్, అడిషనల్ సీపీ డీఎస్ చౌహాన్, జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్ శ్రీవత్స కోట, ఎస్సీల అభివృద్ధిశాఖ డీడీ హన్మంత్‌నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ఇతర విద్యార్థులకు అవకాశం

బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 204 మైనార్టీ గురుకుల పాఠశాలల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించనున్నారు. అంతేకాకుండా బీసీల్లో ఉన్న మెహతరు, దూదేకుల, బీసీ ఈలో ఉన్న సామాజిక వర్గాలకు కూడా మైనార్టీ గురుకులాల్లో సీట్లు లభిస్తాయని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు వెల్లడించారు. మొత్తం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు బౌద్ధులకు, సిక్కులకు, క్రిస్టియన్లకు, జైనులకు, పార్శీలకు కలిపి మొత్తం 25 శాతానికి పైగా సీట్లు లభించే అవకాశం ఉన్నదని తెలిపారు. మైనార్టీ గురకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్ని క్యాటగిరీల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మైనార్టీ గురుకుల పాఠశాలల్లో రిజర్వేషన్ల శాతం, సంఖ్య

క్యాటగిరీ	రిజర్వేషన్‌శాతం	సంఖ్య
ముస్లింలు	64	51
క్రిస్టియన్లు	7	5
జైనులు	1	1
పార్శీలు	1	1
బౌద్ధులు	1	1
సిక్కులు	1	1
ఎస్సీలు	6	5
ఎస్టీలు	4	3
బీసీలు	12	10
ఓసీలు	3	2
మొత్తం	**100**	**80**

మెడికల్ పీజీ సీట్ల భర్తీపై స్పష్టత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత వైద్య మండలి నిబంధనల ప్రకారం పీజీ మెడికల్ సీట్ల భర్తీపై స్పష్టతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండు ఉత్తర్వులు జారీచేసింది. నేషనల్ పూల్‌లో 50 శాతం సీట్లుపోను మిగతా 50 శాతం సీట్లు స్థానికులకే ఉంటాయి. రూరల్, ట్రైబల్ ఏరియాల్లో పనిచేసినవాళ్లకు వెయిటేజి మార్కుల మీద కూడా ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఈ మేరకు జీవోలు 21, 22లను తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి మంగళవారం జారీచేశారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయించిన ఈ నిబంధనలకు అనుగుణంగానే పీజీ సీట్ల భర్తీ జరుగుతుందని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు డిగ్రీలో అవకాశం

- లాటరల్ ప్రవేశాలు కల్పిస్తూ దోస్త్ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులకు దోస్త్ అధికారులు మరో అవకాశం ఇవ్వనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డిగ్రీ కాలేజీల్లో కూడా లాటరల్ ఎంట్రీ (డిగ్రీ ద్వితీయ సంవత్సరం) లకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం దోస్త్-2018 కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి మీడియాతో మాట్లాడుతూ ఈ నిర్ణయాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయనున్నామన్నారు. గత మూడేండ్ల నుంచి వరుసగా 25 శాతం కంటే తక్కువ ప్రవేశాలు నమోదైన ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు అఫిలియేషన్ ఇవ్వాలా? లేదా? అన్న అంశంపై యూనివర్సిటీలు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదన్నారు. ఏప్రిల్ 20లోగా డిగ్రీ కళాశాలల జాబితాలను దోస్త్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని వీసీలను ఆదేశించినట్టు పేర్కొన్నారు. మొబైల్ ద్వారా దోస్త్ అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకొనే సదుపాయాన్ని కూడా విద్యార్థులకు కల్పించనున్నామని వివరించారు.

పాలకుర్తిలో ప్రత్యేక వ్యవసాయ మార్కెట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జనగామ జిల్లా పాలకుర్తిలో ప్రత్యేక వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మార్కెటింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ పరిధిలో కొడగండ్ల మండలంలోని 9 గ్రామాలు, పాలకుర్తి మండలంలోని 21 గ్రామాలు, దేవరుప్పల మండలంలోని 13 గ్రామాలు ఉండేవి. పాలకుర్తిమండలంలోని 21 గ్రామాలను విభజించి ప్రత్యేకంగా పాలకుర్తికి వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ.27.12 కోట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2017-18లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.27.12 కోట్లు విడుదల చేస్తూ వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాజ్యసభ విజయానికి 30 ఓట్లు

- 29 ఓట్ల కంటే తక్కువ వస్తే పరిగణనలోకి రెండో ప్రాధాన్య ఓట్లు
- ఎన్నికైన ఎమ్మెల్యేలకు మాత్రమే ఓటుహక్కు
- విప్ వర్తించదు.. ఓపెన్ బ్యాలెట్‌తోనే ఎన్నికలు
- రాష్ట్రంలో రాజ్యసభ బరిలో నలుగురు.. టీఆర్‌ఎస్‌కే గెలుపు ఖాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రం నుంచి ఈనెల 23న మూడు రాజ్యసభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో ఒక్కొక్క అభ్యర్థి విజయానికి సుమారు 30 ఓట్లు (29.76) అవసరమని కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) వెల్లడించింది. అసెంబ్లీలోని మొత్తం సభ్యుల సంఖ్య ఆధారంగా రూపొందించిన ఫార్ములా మేరకు ఈ ఓట్లను నిర్ధారించింది. ఎన్నికైన ఎమ్మెల్యేలకు మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. దీని ప్రకారం తెలంగాణ అసెంబ్లీలో మొత్తం 119 మంది ఎమ్మెల్యేలు ఓటు వేసేందుకు అర్హులవుతారు. ఒక్కో రాజ్యసభ సభ్యుడి విజయానికి ఓట్ల విలువను లెక్కగట్టాలంటే మొత్తం 119 ఓటర్లను 100 గుణించగా వచ్చిన 11,900 మొత్తాన్ని ప్రస్తుతం జరుగుతున్న మూడు రాజ్యసభ స్థానాలకు ఒకటి కలిపి (అంటే 4) భాగిస్తారు. అలా వచ్చిన మొత్తం సంఖ్య (2975)కు ఒకటి కలిపితే వచ్చే సంఖ్య 2976.. అసెంబ్లీ సభ్యుల ఓట్లుగా పరిగణిస్తారు. వీటిని విభజిస్తే ఒక్కో అభ్యర్థి విజయానికి కావలసిన ఓట్ల సంఖ్య 29.76గా వస్తుంది. అంటే ఒక్కో అభ్యర్థి గెలువడానికి కనీసం 30 ఓట్లు పొందాల్సి ఉంటుంది. తొలి ప్రాధాన్య ఓట్లలో 30 ఓట్లు వచ్చిన వారు నేరుగా ఎన్నికవుతారు. లేకుంటే (29 ఓట్లు.. అంతకంటే తక్కువగా వస్తే).. రెండో ప్రాధాన్యఓటును లెక్కించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న పార్టీల బలాబలాలను పరిగణనలోకి తీసుకొంటే అధికారపార్టీకి చెందిన ముగ్గురు అభ్యర్థులు గెలువడం ఖాయమైపోయింది. ప్రస్తుతం రాష్ట్రం నుంచి జరుగుతున్న మూడు రాజ్యసభ స్థానాలకు తెలంగాణ రాష్ట్ర సమితి పక్షాన జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, బండ ప్రకాశ్ పోటీలో ఉన్నారు. కాంగ్రెస్‌అభ్యర్థిగా బలరాం నాయక్ పోటీ చేస్తున్నారు.

పార్టీ విప్‌లు ఉండవు

రాజ్యసభ ఎన్నికలు ఓపెన్ బ్యాలెట్ పద్ధతిలో జరుగుతాయి. అలాగే పార్టీలు తమ సభ్యులకు విప్ జారీచేసే అధికారం ఉండదని ఎన్నికల అధికారులు చెప్తున్నారు. పోలింగ్ కేంద్రంలో పార్టీల వారీగా కూర్చునే ఏజెంట్లకు ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎవరికి ఓటువేస్తున్నారో చూపించాలని అడిగే అధికారం ఉంటుంది. ఒకవేళ పార్టీ సూచించిన అభ్యర్థికి కాకుండా వేరే పార్టీ అభ్యర్థికి ఓటువేసిన ఎమ్మెల్యేలపై, ఓటింగ్‌కు రానటువంటి సభ్యులపై సదరు పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. ఇలాంటి ఎమ్మెల్యేలకు పార్టీల ఫిరాయింపు చట్టం వర్తించదని చెప్తున్నారు.

ఆ మూడుకు మూడు టీఆర్‌ఎస్‌కే

ప్రస్తుతం జరుగుతున్న మూడు రాజ్యసభ స్థానాల్లో అధికారపార్టీ టీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమైపోయింది. ప్రస్తుతం శాసనసభలోని పార్టీ బలాబలాల ఈ మూడు స్థానాలు కూడా టీఆర్‌ఎస్ ఖాతాలోకే వెళ్లనున్నాయి. ఏడుగురు సభ్యులు కలిగిన మజ్లిస్ పార్టీ ఇప్పటికే ఈ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఒక్కో అభ్యర్థి విజయానికి 30ఓట్లు చొప్పున ముగ్గురు అభ్యర్థులు గెలువాలంటే మొత్తం 90 ఓట్లు అవసరమవుతాయి. టీఆర్‌ఎస్‌కు ఆ బలం ఉండటంతో తొలి ప్రాధాన్య ఓటుతోనే టీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలువనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బరి లో దిగిన బలరాంనాయక్‌కు ఇప్పటికే చాలినంత బలం లేకపోగా ఉన్నవాళ్లలో ఇద్దరు సభ్యుల మద్ధతు తగ్గింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించిన తీరుతో ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని స్పీకర్ రద్దుచేశారు. దీంతో సభలో కాంగ్రెస్ బలం మరింత తగ్గి అభ్యర్థి విజయం అసాధ్యమైంది. కాంగ్రెస్ సభ్యులతోపాటు, బీజేపీ, టీడీపీ, సీపీఎం సభ్యులందరు కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసినా కూడా తొలి ప్రాధాన్యతలో బలరాం నాయక్‌కు 30 ఓట్లు వచ్చే అవకాశం లేదు.

టీఆర్‌ఎస్ మాక్ పోలింగ్

తెలంగాణ రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు మంగళవారం సాయంత్రం తెలంగాణభవన్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల మాక్ పోలింగ్‌లో ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఓటు వేశారు. ఇందుకోసం నమూనా బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్‌ను రూపొందించారు. ఓటు ఎలా వేయాలనే దానిపై ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఎమ్మెల్యేలకు వివరించారు. ఎలాంటి అయోమయానికి గురికావాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇంగ్లిషు నంబర్ 1ను వేయాలని సూచించారు. బుధ, గురువారాల్లో అసెంబ్లీ అవరణలోని టీఆర్‌ఎస్ శాసనసభ పక్ష కార్యాలయంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను బడుగుల లింగయ్య యాదవ్‌కు, వరంగల్, ఖమ్మం, మెదక్, హైదరాబాద్ జిల్లాలోని కొందరిని బండ ప్రకాశ్‌కు కేటాయించారు. ఒక్కో అభ్యర్థికి 32 మంది ఎమ్మెల్యేలను కేటాయించారు. ఒకరికి మాత్రం 33మంది ఎమ్మెల్యేలను కేటాయించారు. ఒక్కో అభ్యర్థికి సంబంధించి ఇద్దరు మంత్రులకు ప్రధానంగా బాధ్యతలు అప్పగించారు. జోగినిపల్లి సంతోష్‌కుమార్ ఎన్నికను సమన్వయం చేయడానికి రాష్ట్ర మంత్రు లు కేటీఆర్, ఈటల రాజేందర్, బండ ప్రకాశ్‌కు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బడుగుల లింగయ్య యాదవ్‌కు మంత్రులు టీ హరీశ్‌రావు, జీ జగదీశ్‌రెడ్డిలకు బాధ్యతలు అప్పగించారు.



మాక్‌పోలింగ్‌లో ఓటువేస్తున్న మంత్రి ఈటల రాజేందర్



మంగళ వారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న మంత్రి కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యేలకు అభివాదం చేస్తున్న టీఆర్‌ఎస్ రాజ్యసభ అభ్యర్థి జోగినిపల్లి సంతోష్‌కుమార్

ఏర్పాట్లు పరిశీలించిన సీఈసీ

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్ మంగళవారం అసెంబ్లీలో రాజ్యసభ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు ఈ నెల 23వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికలకు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు రిటర్నింగ్ అధికారిగా, డిప్యూటీ సెక్రటరీ దుర్గా ప్రసాద్ సహాయ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల పరిశీలకుడు రజత్‌కుమార్ మంగళవారం అధికారులతో కలిసి అసెంబ్లీకి వచ్చారు. అసెంబ్లీ కార్యదర్శి చాంబర్లో కార్యదర్శి, ఎన్నికల సిబ్బందితో సమావేశమై ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం అసెంబ్లీ కమిటీ హాల్ నంబర్-1లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్, ఓట్ల లెక్కింపు కోసం చేపడుతున్న ఏర్పాట్లు, భద్రతా చర్యలు, కెమెరాల ఏర్పాటు, బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాల నమూనాలను పరిశీలించారు. అంతకుముందు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు, న్యాయనిపుణులు.. రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి ఆయా రాష్ర్టాల ఎన్నికల కమిషన్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

కృష్ణాలో తెలంగాణకు 17 టీఎంసీలు

- ఆంధ్రకు 16 టీఎంసీలు
- ఉత్తర్వులు జారీచేసిన కృష్ణానదీ యాజమాన్య బోర్డు
- ఎక్కువనీళ్లు వాడుకొని ఇంకా కావాలంటూ ఏపీ డిమాండ్
- కృష్ణాబోర్డు ముందు తర్జనభర్జన
- మే 31 దాకా సాగర్‌లో 510 అడుగుల నిర్వహణకు నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా నది నీటి రిజర్వాయర్ల నుంచి రెండు తెలుగు రాష్ర్టాల నీటి వినియోగంపై కృష్ణానది యాజమాన్య బోర్డు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వుల్లో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి తెలంగాణకు 17 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 16 టీఎంసీల నీటిని కేటాయించింది. మంగళవారం నుంచి మే 31 వ తేదీవరకు ఈ నీటిని ఈ నీటిని కేవలం తాగునీరు కోసం వినియోగించుకోవాలని సూచించింది. ఏపీ తన వాటాకు మించి నీటిని వాడుకుని.. ఆపై మిగిలిననీటిలో మళ్లీ వాటాను డిమాండు చేయడం, దీనిని తెలంగాణ వ్యతిరేకించడంతో మంగళవారం జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో చాలాసేపు తర్జనభర్జనలు జరిగాయి. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి కొన్ని రోజుల కిందట రాసిన లేఖలో సూచించిన మేరకు మేనెల చివరివరకు నాగార్జునసాగర్ జలాశయంలో 510 అడుగుల నిర్వహణకు రెండు రాష్ర్టాల ఈఎన్సీలు అంగీకరించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన నీటి వినియోగంపై గతంలోనే నిర్ణయం జరిగిన విషయం తెలిసిందే. నాగార్జునసాగర్‌లో 510 అడుగులు మే నెలాఖరు వరకు నిర్వహించాల్సిందేనన్న తెలంగాణ డిమాండుపై రెండు రాష్ర్టాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ఎండీడీఎల్ దిగువన నీటిని ఏపీకి 66 శాతం, తెలంగాణకు 34 శాతం పంచాలని కోరినట్టు తెలిసింది. దీనిని కూడా తెలంగాణ వ్యతిరేకించింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రివరకు రెండు రాష్ర్టాల అధికారుల మధ్య చర్చలు, సంప్రదింపులు జరిగాయి.

రాచకొండ ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్

డీపీఆర్ తయారీకి ఓకే
ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎడారిని తలపించే రాచకొండ ప్రాంతం త్వరలో కృష్ణమ్మ జలసవ్వడితో సస్యశ్యామలం కానుంది. ఈ ప్రాంతంలో నిర్మించతలపెట్టిన రాచకొండ ఎత్తిపోతల పథకం సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) తయారీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎత్తిపోతల నిర్మాణం, భూసేకరణ తదితర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక తయారుచేయాలని ఆదేశించింది. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి ఆరు టీఎంసీల నీటిని లిఫ్టు చేసేందుకు రాచకొండ వద్ద ఈ ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించనున్నారు. దీని ద్వారా యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని అనేక చెరువులను కృష్ణాజలాలతో నింపి తాగు, సాగునీటిని అందిస్తారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకుగాను ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. అదేవిధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండలంలో ఎత్తిపోతల పథకం సర్వే పనులకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించింది. మంగపేట మండలంలోని రాజుపేట, గొల్లగూడెం, వడ్డెగూడెం గ్రామాల పరిధిలో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సమగ్ర సర్వే చేయాలని ఆదేశించింది. ఈ సర్వే కోసం ప్రభుత్వం రూ. 6.34 లక్షలు కేటాయించింది.

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కర్నె కృతజ్ఞతలు

రాచకొండ ఎత్తిపోతల పథకం సర్వే పనులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిలకు ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా సాగునీటి కోసం వేచిచూస్తున్న రాచకొండ పరిధిలోని ప్రజలకు ఎత్తిపోతల పథకం సర్వే పనుల కోసం ప్రభుత్వం జారీచేసిన జీవో గొప్ప ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే ఈ సర్వే పనుల త్వరితగతిన పూర్తయి రాచకొండ ఎత్తిపోతల పథకం కల సాకారమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాచకొండ ఎత్తిపోతల పథకం డీపీఆర్ కోసం ప్రభుత్వం అనుమతినివ్వడంపై తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధానకార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.



చివరి బంతికి సిక్సర్ కొట్టి భారత్‌కు ట్రోఫీ అందించి దినేశ్ అద్భుతం చేశాడు. ఇలాంటి అపురూప సంఘటనలు మన జీవితకాలం వరకు గుర్తుంటాయి. ఈ ఘనతతో అతని భార్యగా ఎంతో గర్విస్తున్నా. అతను నా సూపర్ హీరో.


దీపికా పల్లికల్, భారత స్క్వాష్ క్రీడాకారిణి

బీబీసీ సంస్థ లింగవివక్ష, పక్షపాతం చూపిస్తున్నది. వింబుల్డన్ పోటీల సందర్భంగా అమెరికా టెన్నిస్ దిగ్గజం జాన్ మెక్నరోతో కలిసి నేను వ్యాఖ్యాతగా వ్యవహరించాను. ఈ విషయంలో నాకు రూ.13.5 లక్షలు మాత్రమే చెల్లించగా..మెక్నరోకు రూ.1.5 కోట్ల వరకు చెల్లించారు. నా కంటే 10 రెట్లు ఎక్కువ చెలించడం నాకు షాక్‌ను కలిగించింది..

మార్టినా నవ్రతిలోవా, మహిళా టెన్నిస్ దిగ్గజం



చరిత్రలో నేడు




1935

పర్షియా పేరు ఇరాన్‌గా మార్పు.

1871

ఆఫ్రికా యాత్రను ప్రారంభించిన జర్నలిస్ట్ హెన్రీ మార్టన్ స్టాన్లీ.





1899

పశ్చిమ ఆఫ్రికాపై ఒప్పందం కుదుర్చుకున్న బ్రిటిష్, ఫ్రెంచి దేశాలు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ట్రంప్‌కు అనుకూలంగా ఫేస్‌బుక్‌ను దుర్వినియోగం చేసిన ఉదంతంపై ఆ సంస్థ చర్య తీసుకుంటున్నది. ట్రంప్ కోసం పనిచేసిన కేంబ్రిడ్జి అనాలిటికా సంస్థతోపాటు, మోసపూరితంగా ఐదుకోట్ల మంది వివరాలను వారి అనుమతి లేకుండా సేకరించిన ప్రొఫెసర్ అలెగ్జాండర్ కోగాన్‌కు చెందిన అకౌంట్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. కానీ వ్యక్తిగత గోప్యతను కాపాడే విషయంలో కాంగ్రెస్ చట్టాలను మరింత పటిష్టం చేయాలె. ఒబామా హయాంలో ఇటువంటి ప్రయత్నం మొదలైనప్పటికీ టెక్నాలజీ, వ్యాపార ప్రకటనల కంపెనీల అభ్యంతరాల వల్ల నిలిచిపోయింది.

హిందుస్థాన్ టైమ్స్

ట్రంప్‌ను గద్దెనెక్కించడానికి కేంబ్రిడ్జి అనాలిటికా సంస్థ చేసిన నిర్వాకం బయటపడిన దశలోనే బ్రిటన్ పార్లమెంటు డేటా ప్రొటెక్షన్ బిల్లును చేపట్టింది. ఈ బిల్లు ప్రకారం- వ్యక్తిగత సమాచారాన్ని నిర్దేశిత అవసరం కోసం కాకుండా ఇతరత్రా ఉపయోగించకూడదు. కానీ ఫేస్‌బుక్, గూగుల్ వంటి సంస్థలు డేటాను ఉపయోగించకుండా నివారించడం కష్టం. వినియోగదారుడు నాలుగు 'లైక్స్' కొట్టడాన్ని బట్టి అతడి లైంగిక దృక్కోణం తెలిసిపోతుంది. వ్యాపారం కోసం డేటా పోగు చేసుకోవడం వేరు. కానీ అదే సమాచారాన్ని రాజకీయాల కోసం వినియోగించుకోవడం ప్రమాదం.

ది గార్డియన్

లింగాయత్ వివాదం

కర్ణాటకలో ఓట్ల రాజకీయం ఊపందుకొని సామాజిక సమూహాల విభజనకు నాంది పలికింది. కన్నడనాట ప్రభావశీలవర్గంగా ఉన్న లింగాయత, వీరశైవ లింగాయతలను ప్రత్యేక మతంగా గుర్తిస్తూ కర్ణాటక క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. వారికి మతపరమైన మైనార్టీ హోదాను కల్పించాలన్న రిటైర్డ్ జస్టిస్ నాగమోహన్ దాస్ కమిటీ సిఫార్సులను ఆమోదించింది. దీన్ని వీలైనంత త్వరగా కేంద్ర ఆమోదం కోసం పంపుతామని ప్రకటించింది. దీంతో లింగాయత్‌లంతా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లపైకి వచ్చి ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ ప్రదర్శనలు చేయగా, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వీరశైవులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కల్బుర్గీ, దావణ గెరె, బిజాపుర ప్రాంతాల్లో లింగాయత్‌లు, వీరశైవుల మధ్య ఘర్షణలు చోటుచే సుకున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తున్నది. ఎన్నికలవేళ ఓట్ల కోసం కాంగ్రెస్ సామాజిక విభజనకు పాల్పడుతున్నదని బీజేపీ విమర్శిస్తుంటే, మాజీ ప్రధాని దేవేగౌడ తేనెతుట్టెను కదిపారని మండిపడుతున్నాడు. ఓట్ల రాజకీయాల కోసం నేతలు ఎంతటి పనికైనా సిద్ధపడటం, మత రాజకీయాలు చేయటం కొత్తేమీ కాదు. గత మూడు దశాబ్దాలుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మత రాజకీయాలకు తెరదీసి అధికార పీఠాలకు ఎగబాకుతున్నాయి. ఓట్ల వేటలో మతరాజకీయం చేయటంలో కాంగ్రెస్ తెరచాటు రాజకీయం చేస్తే, బీజేపీ నగ్నంగా మెజార్టీ వాదాన్ని తెర పైకి తెచ్చి మత రాజకీయాలకు పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలోనే సిద్ధరామయ్య లింగాయత్‌లను మత మైనార్టీలుగా గుర్తించటం గమనార్హం.

ఓట్ల రాజకీయాల కోసం నేతలు ఎంతటి పనికైనా సిద్ధపడటం, మతరాజకీయాలు చేయటం కొత్తేమీ కాదు. గత మూడు దశాబ్దాలుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మతరాజకీయాలకు తెరదీసి అధికార పీఠాలకు ఎగబాకుతున్నాయి. ఓట్ల వేటలో మతరాజకీయం చేయటంలో కాంగ్రెస్ తెరచాటు రాజకీయం చేస్తే, బీజేపీ నగ్నంగా మెజార్టీవాదాన్ని తెరపైకి తెచ్చి మత రాజకీయాలకు పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలోనే సిద్ధరామయ్య లింగాయత్‌లను మత మైనార్టీలుగా గుర్తించటం గమనార్హం.

బసవతత్వాన్ని అనుసరించే లింగాయత్, వీరశైవ లింగాయత్‌లది సుదీర్ఘ ప్రత్యేక చరిత్ర. 12వ శతాబ్ద కాలంనాటి బసవేశ్వరుని బోధలతో పురుడుపోసుకున్న లింగాయత హిందూ బ్రాహ్మణవాదంపై తిరుగుబాటుగా దేశీయంగా వచ్చిన మతవాద సంస్కరణోద్యమాల్లో బౌద్ధం తర్వాత అంతటి ప్రాధాన్యం, విశిష్టత కలిగినది. కాలక్రమంలో లింగాయత్‌లు రెండు వర్గాలుగా చీలిపోయినా లింగాయత్‌లు, వీరశైవ లింగాయత్‌లు వేదాల ఆధిపత్యాన్నీ, నిచ్చెనమెట్ల కులవ్యవస్థను వ్యతిరేకించిన ప్రజాస్వామ్య మత సంస్కరణోద్యమంగా చరిత్రలో నిలిచింది. శతాబ్దాల కాలక్రమంలో దక్షిణాది రాష్ట్రాలన్నింటా విస్తరించిన లింగాయత్‌లు కర్ణాటకలో మాత్రం సంఖ్యాపరంగా, సామాజికార్థిక విషయాల్లో ప్రభావశీలవర్గంగా ఎదిగారు. స్వాతంత్ర్యానంతర కాలంలో కర్ణాటకలో ఎక్కువకాలం లింగాయత్‌లే అధికారాన్ని చేజిక్కించుకున్న వర్గంగా రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నారు. ఈ క్రమంలోంచే 2000 సంవత్సరంలో అఖిలభారత వీరశైవ మహాసభ ఏర్పాటై లింగాయత్‌ల హక్కుల కోసం మాట్లాడసాగింది. 2003 నుంచి ప్రత్యేక మత గుర్తింపు కోసం ఆందోళన ప్రారంభమైంది. ఈ ఉద్యమం క్రమంగా బలపడి 2017 ఆగస్టులో కర్ణాటకలో రెండు లక్షల మందితో మహా ప్రదర్శన నిర్వహించారు. వేదాలను తిరస్కరిస్తూ, పరంపరాగత మత గురువుల బోధలపై ఆధారపడి నడుస్తు న్న బౌద్ధ, జైన, సిక్కు మతాల్లాగా లింగాయత ప్రత్యేక మతమనే వాదన లింగాయతల్లో బలంగా ఉన్నది. సహజంగానే తాత్విక విషయాల విషయంలో బీజేపీ చెబుతున్న మెజార్టీ వాదానికీ, లింగాయత్‌లు చెబుతున్న దానికి మధ్య వైరుధ్యం ఉన్నది. సరిగ్గా ఈ వైరుధ్యాన్ని కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేశారనటంలో సందేహం లేదు.

కర్ణాటకలో లింగాయత్‌లు 17శాతం జనాభాగా ఉన్నారు. 224 అసెంబ్లీ స్థానాల్లో వందకు పైగా నియోజకవర్గాల్లో నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న యడ్యూరప్ప లింగాయత్ సామాజికవర్గానికి చెందినవారే. ఈ అంశాన్ని ఆసరా చేసుకొని, సహజంగా ఉండే ప్రభుత్వ వ్యతిరేకతను వాడుకుని కర్ణాటకలో పాగా వేయాలని చూస్తున్న బీజేపీకి ఇప్పుడు సిద్ధరామయ్య నిర్ణయం శరాఘాతంగా మారింది. నిజానికి సిద్ధరామయ్య మత మైనార్టీలుగా గుర్తింపు నిర్ణయంతో లింగాయత్‌లకు ఒరిగేదేమీ లేదు. వారికి ఇప్పటికే ఉన్న 15 శాతం రిజర్వేషన్లలో మార్పేమీ ఉండదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం ప్రత్యేక మత గుర్తింపుతో ప్రచారం నిర్వహించుకోవచ్చు. ఆర్టికల్ 28 ప్రకారం మతపరమైన ఆధికారిక కార్యక్రమాల్లో ప్రత్యేక స్థానం దక్కుతుంది. అలాగే 29, 30ల ప్రకారం ప్రత్యేక రక్షణలుంటాయి. ఇవన్నీ తక్షణ ప్రయోజనాలు కాకున్నా, మత మైనార్టీ గుర్తింపుతో విద్యాసంస్థలు, ఇతర సంస్థలకు ప్రత్యేక రక్షణలు, సదుపాయాలు, గ్రాంట్లు అందుతాయి. ఇప్పటికే ఉత్తర కర్ణాటకలో విద్యా, వ్యాపారసంస్థల్లో గణనీయ ప్రాబల్యం కలిగిన లింగాయత్‌లు ప్రత్యేక మత మైనార్టీ హోదాతో ప్రయోజనం పొందుతారు. ఈ విధమైన సున్నితమైన అంశాలను ఎన్నికల్లో ఓట్ల కోసం వాడుకోవటంలోనే సమస్య ఉన్నది. ఇన్నాళ్లూ మెజార్టీ వాదాన్ని భుజానేసుకుని మత రాజకీయాలు చేసిన బీజేపీ ఇప్పుడు కాంగ్రెస్‌ను మతరాజకీయం చేస్తున్నదని విమర్శించటమే విడ్డూరంగా ఉన్నది. రాజకీయాల కోసం, ఓట్ల కోసం మతాన్ని ఆసరాగా చేసుకున్న వారెవరూ చరిత్రలో సుదీర్ఘకాలం ప్రజాస్వామికవాదులుగా మిగులలేదు. దేశంలో ప్రధాన జాతీయపార్టీలు రెండూ మతరాజకీయాల నీడన చేరటమే ఇప్పటి విషాదం. మత రాజకీయశక్తులపై లౌకిక ప్రజాస్వామిక రాజకీయ శక్తుల విజయమే సమాజ శాంతికి, అభివృద్ధికి హామీ.

జనగళం

క్షమార్హం కాదు

ప్రజలకు సేవ చేసేందుకు మాత్రమే ప్రభుత్వంలో వివిధ శాఖలు ఏర్పడినాయి. కానీ ఉపాధిక కల్పన కోసం కాదు, వాటిలో పనిచేసే ఉద్యోగుల శ్రేయస్సు కోసం యూనియన్లు, సంఘాలు ఏర్పడినాయి. ఈ మధ్య ప్రజా సేవ అనే ముఖ్యాంశాన్ని పక్కనబెట్టి యూనియన్లు ప్రతి చిన్న విషయానికి యూనియన్లు, సంఘాలు సమ్మెలకు దిగుతుండటం విడ్డూరం. ఇది సమర్థనీయం కాదు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, పార్ట్‌టైం స్వీపర్లు, సాక్షర భారత్ కో ఆర్డినేటర్లు స్థానిక జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తూ సామాన్య జనాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇది క్షమార్హం కాదు.

- గూరుడు అశోక్, గోదూర్, జగిత్యాల జిల్లా

ముదావహం

ఆడబిడ్డ పుడితే భారంగా భావించే తల్లిదండ్రులున్న ఈ రోజుల్లో ప్రభుత్వం ఆడబిడ్డలను బాధ్యతగా తీసుకోవడం హర్షణీయం. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటిని నుంచి కళ్యాణలక్ష్మి, షాదీముబారఖ్ పథకం ద్వారా మొదట రూ.51 వేలు, తర్వాత రూ.75 వేలు అందించింది. ఆ రూపాయలను ఇప్పుడు ఏకంగా రూ.1,00,116లకు పెంచుతూ చరిత్మాతక నిర్ణయం తీసుకున్నది. ప్రభుత్వ నిర్ణయం ఎంతోమంది పేద తల్లిదండ్రులకు భరోసా ఇవ్వనున్నది.

- ఎల్ల స్వామిరెడ్డి, లక్ష్మీపూర్, మానకొండూర్, కరీంనగర్

అద్భుత ప్రదర్శన

శ్రీలంక పర్యటనలో యువ క్రీడాకారులు అనుభవజ్ఞుల వలె రాణించటం హర్షణీయం. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో దినేష్ కార్తీక్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. మ్యాచ్ చేజారిందనుకుంటున్న అభిమానుల్లో ఆశలు రేకిస్తూ మ్యాచ్‌ను ఇండియా వైపు తిప్పాడు. ఇలాగే ఇంగ్లండ్ పర్యటనలో కూడా రాణించాలి.

- తలారి సతీష్, చిట్టిగడ్డ, వికారాబాద్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

అంతర్జాతీయం



సుధా రామచంద్రన్

లంకలో మళ్లా జాతి విద్వేషం

శ్రీలంకలో ఇటీవల ముస్లింలపై పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. వారి ఆస్తుల విధ్వంసం, ప్రార్థనాలయాలపై దాడి జరిగింది. దీంతో ఈ నెల ఆరవ తేదీన దేశాధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించారు. దాడులు సాగుతున్న ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించి, సైన్యాన్ని రంగంలోకి దింపవలసి వచ్చింది. అయినప్పటికీ, దాడులు విస్తరించాయి. రోడ్డుపై జరిగిన గొడవ ఈ దాడులకు దారితీసింది. కాండీ జిల్లాలో ఫిబ్రవరి 22న సింహళ ట్రక్కు డ్రైవర్‌కు, ముస్లింల గుంపునకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ముస్లింలు ట్రక్కు డ్రైవర్‌ను తీవ్రంగా కొట్టడంతో అతడు దవాఖానలో పడాల్సి వచ్చింది. డ్రైవర్ కొద్దిరోజుల చికిత్స తర్వాత మరణించాడు. డ్రైవర్ మరణించిన మరుసటి రోజు సింహళీయులు కొందరు ముస్లింలపై దాడులు ప్రారంభించారు. వారి ఇండ్లు, దుకాణాలు, వాహనాలను దగ్ధం చేశారు.

శ్రీలంక బహుళ జాతుల, మతాల, భాషల దేశం. జనాభాలో 74 శాతం సింహళీయులు. వీరు బౌద్ధులు. తమిళులు అతిపెద్ద మైనార్టీ. వీరు హిందువులు. ముస్లింలు తొమ్మిది శాతం ఉంటారు. సింహళీయులు, తమిళులు జాతిపరమై న గుర్తింపు కలిగిఉన్నారు. కానీ ముస్లింలది మతపరమైన గుర్తింపు. సింహళీయులు తమకుతాము ఏ విధంగా భావిస్తారనేది, ఈ హింసాయుత దాడులకు మూలంగా చెప్పవచ్చు. శ్రీలంక జాతి గురించి మహావంశ అనే గ్రంథంలో ప్రముఖంగా ఉన్నది. ఆరవ శతాబ్దంలో మహానా మా అనే బౌద్ధ సన్యాసి ఈ మహావంశ గ్రంథాన్ని రాశారు. సింహబాహు కుమారుడైన విజయుడి వారసులే సింహళీయులని అందులో ఉన్నది. సింహానికి, రాకుమారికి సింహబాహు జన్మించాడని అందులో ఉన్నది. మహానామా ప్రకారం- విజయుడు ఆయన ఏడువందల మంది అనుచరులు రావడానికి ముందే గౌతమబుద్ధుడు శ్రీలంకను సందర్శించారు. గౌతమబుద్ధుడి వల్ల పవిత్రమైన దీవిలోకి విజయుడు ప్రవేశించాడు. బుద్ధుడు నిర్యాణం పొందిన రోజే విజయుడు శ్రీలంక దీవిపై అడుగు పెట్టాడు. ధర్మబోధను పరిరక్షించి, ప్రచారం చేయడానికి బుద్ధుడు సింహద్వీపాన్ని ధర్మద్వీపంగా ఎంచుకున్నాడని మహానామా బోధిస్తుంది. ఇది సింహళ బుద్ధుల ఆలోచనాసరళిని ప్రభావితం చేస్తున్నది. మహానామా పురాణగాథనే కానీ, వాస్తవంకాదు. అయినప్పటికీ, దీని మూలంగా సింహళ బుద్ధులు ఈ దీవి తమదని, బుద్ధుడు తమ బోధనల పరిరక్షణ కు తమను ఎంచుకున్నారని భావిస్తారు.

శ్రీలంకలోని సింహళీయులు మెజార్టీ అయినప్పటికీ, తమను తాము మైనారిటీగా అనే మనోస్థితిని కలిగి ఉంటారని స్టాన్లీ తంబయ్య అనే మానవ పరిణామవేత్త 'శ్రీలంక: ఎథ్నిక్ ఫ్రాట్రిసైడ్ అండ్ ది డిస్మాంట్లింగ్ డెమొక్రసీ' అనే పుస్తకంలో వివరించారు. సింహళీయులు జనాభాలో తక్కువగా ఉన్న తమిళులు, ముస్లింలను చూసి, తాము మైనార్టీలమని భావిస్తుంటారు. శ్రీలంకలోని తమిళులను తమిళనాడులోని తమిళులలో భాగంగా చూస్తారు. ముస్లింలను మొత్తం ముస్లింలలో భాగంగా చూస్తారు. అల్పసంఖ్యాక మనస్తత్వం మూలంగా సింహళీయులు తమనుతాము బాధితులుగా భావించుకుంటారు. తమ దీవిలోని సింహళ- బౌద్ధ సంస్కృతిని కాపాడుకునేందుకు హింసాయుతంగా మారాలని భావిస్తారు. సింహళేతర, బౌద్ధేతరుల నుంచి తమ సంస్కృతికి కాపాడుకోవాలనుకుంటారు. విదేశీయుల వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామనుకుంటారు.

బ్రిటిష్ వలసకాలంలో మైనార్టీలపై దాడులు మొదలయ్యాయి. వలస పాలన వల్ల ముస్లింలు, క్రైస్తవులు లబ్ధి పొందుతున్నారనే అభిప్రాయం సింహళీయులకు ఏర్పడ్డది. 20వ శతాబ్దంలో ఆర్థిక వ్యవస్థలో ముస్లింల ప్రాబల్యం పట్ల సింహళ- బౌద్ధులలో తీవ్ర వ్యతిరేకత ప్రబలింది. బౌద్ధ పునరుజ్జీవవాదులు కొన్ని వాదనలను ముందుకుతెచ్చారు. ముస్లింలు విదేశీ దురాక్రమణదారులని, యూదుల మాదిరిగా సంపన్నులు కావడానికి షైలాక్ మాదిరి కుట్రలను అనుసరించారని అనగారిక ధర్మపాల పేర్కొన్నారు. భూమిపుత్రులైన సింహళీయుల ప్రయోజనాలను పణంగా పెట్టి ఈ విదేశీయులు సంపన్నులయ్యారని ధర్మపాల వివరించారు. సింహళ బౌద్ధాయ, సింహాల జాతీయవంటి పత్రికలు రెచ్చగొట్టే వ్యాసాలను ప్రచురించాయి. దీనివల్ల 1915లో ముస్లింలపై దాడులు జరిగాయనే అభిప్రాయం ఉన్నది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజకీయపార్టీలు తమకు తాము సింహళ-బౌద్ధుల పరిరక్షకులమని చెప్పుకోవడానికి పోటీ పడ్డాయి. దీంతో రాజ్యం, వ్యవస్థలు సింహళీకరణ సాగింది. తమిళులు రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా ప్రాబల్యం కోల్పోయారు. ప్రభుత్వ అండతో తమిళుల ఆస్తులపై దాడులు సాగాయి. ఈ దేశం తమది కాదనే భావన తమిళుల్లో మొదలైంది. దీంతో తమిళులలో వేర్పాటు ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. అదే ఎల్‌టీటీఈ నాయకత్వంలోని సాయుధ పోరాటానికి దారి తీసింది. ఆరు దశాబ్దాలపాటు తమిళులను శత్రువులు గా చూపే సింహళ- బౌద్ధుల జాత్యహంకార పథకం అమలైంది. 2009 లో ఎల్‌టీటీఈ నిర్వీర్యమైపోయింది. తమిళుల పోరాటం ముగియడం తో సింహళ తీవ్రవాదులకు తమ జాత్యహంకార పథకం అమలుచేయడానికి కొత్త శత్రువు అవసరమొచ్చిందని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో నిరుపమ సుబ్రమణ్యం ఒక వ్యాసంలో వివరించారు. 2012 నుంచి శ్రీలంకలో ముస్లింల వ్యతిరేక ప్రచారం మరింత పెరిగింది. శ్రీలంకలో ముస్లింలపై ఉండే అభిప్రాయాలకు తోడు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్లాం బూచి చేరింది. బోడు బాలసేన వంటి గ్రూపులు ముస్లింలపై విద్వేష ప్రచారాన్ని, దాడులను సాగిస్తున్నాయి. ముస్లింలు విపరీతంగా సంతానాన్ని పెంచుకుంటారని, బౌద్ధులను బలవంతంగా ముస్లింలుగా మారుస్తారని, తమకు సరిపడని సంస్కృతిని అనుసరిస్తారని ప్రచారంసాగింది. దీంతో ఇదే పరిస్థితి కొనసాగితే, ముస్లింల సంఖ్య పెరుగుతుందని, సింహళీయులు మైనార్టీలుగా మారిపోతారని, తమ దీవిలో సింహళ- బౌద్ధ సంస్కృతి అంతరిస్తుందని సాధారణ సింహళీయులలో భయాలు పెరిగాయి.

మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై దాడులను రెచ్చగొట్టిన ఆశిన్ విరాతు అనే బౌద్ధ సన్యాసి శ్రీలంకలోని బోడు బాలసేనకు మద్దతు ప్రకటించారు. శ్రీలంకలో జిహాదీ గ్రూపుల ప్రమాదం ఉందంటున్నారు. మొగ్గదశలోనే ఉన్న ఈ సింహళ అతివాద ధోరణులను తుంచివేయడానికి శ్రీలంక రాజకీయ నాయకులు సుముఖంగా లేరు. సింహళ అతివాదుల ఓట్లు రావనేదే వారి భయం.

బోడు బాలసేన మాదిరిగానే సింహళ రావయ, సింహళే, మహాసోన్ బాలయ మొదలైన తీవ్రవాద సంస్థలు సింహళీయులలో భద్రతా రాహిత్యాన్ని పెంచుతున్నాయి. పుకార్లు వ్యాపింపజేస్తూ, దాడులకు పురికొల్పుతున్నాయి. ఇటీవల ముస్లింలు సింహళీయులను జనాభాలో మించిపోవడానికి కుట్ర సాగుతున్నట్టుగా ప్రచారం సాగింది. ఒక హోటల్లోని వంటమనిషి సింహళీయులకు ఇచ్చే భోజనంలో ఒక మందు కలుపుతున్నట్టు, దానివల్ల సింహళీయులకు పిల్లలు పుట్టరని ఒక పుకారు వ్యాపించింది. సోషల్ మీడియాలో ఈ మందు గురించిన ప్రచారం సాగిన తర్వాతనే దాడులు మొదలయ్యాయి. ముస్లింల ఇండ్లు, ప్రార్థనాలయాలు, వ్యాపార సంస్థలపై దాడులు సాగాయి.

2011 నుంచి సింహళ అతివాద గ్రూపులు ముస్లింలపై తరచు దాడులు సాగిస్తున్నాయి. ఈ దాడులు యథాలాపంగా సాగినవి కాదు. పథకం ప్రకారం కొన్ని గ్రూపులు సాగిస్తున్నవి. రాజకీయ నాయకులకు, పార్లమెంట్ సభ్యులకు సన్నిహితులైన వారే సాగిస్తున్నారు. దాడులు చేసిన వారికి ఏ శిక్షలు పడవు. దోషులను శిక్షించి, న్యాయం అందించడంలో ప్రతి ప్రభుత్వం విఫలమవుతున్నది. దీంతో దుండగులు మరింత ధైర్యంగా దాడులకు తెగిస్తున్నారు. దాడులు ఇదేవిధంగా సాగితే, మైనార్టీల నుంచి కూడా ప్రతిస్పందన రావచ్చునని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ముస్లింలలోని ఉదారవాదుల బలం తగ్గి, యువకుల్లో తీవ్రవాదం ప్రబలవచ్చునని ప్రముఖ రాజకీయ వ్యాఖ్యాత దయాన్ జయతిల్లెక 'ది ఐలాండ్' పత్రికలో ఆందోళన వ్యక్తంచేశారు. 'తమిళులకు వారి స్థానం ఏమిటో చూపాలని దాడులు ప్రారంభించడంతో, అది మూడు దశాబ్దాల పోరాటంగా మారింది. ఇప్పుడు ముస్లింల పట్ల కూడా అదే ప్రయోగం సాగుతున్నది' అని జయతిల్లెక హెచ్చరించారు. ఇస్లామిక్ ఉగ్రవాదం పెచ్చరిల్లే పరిస్థితి ఏర్పడిందని ఆయన హెచ్చరించారు. ఇప్పటివరకు ముస్లింలు తమ వ్యాపారాలపై దృష్టిపెట్టారు. ఇప్పుడా పరిస్థితి మారిపోవచ్చు. ఇందుకు సింహళ నాయకులే బాధ్యత వహించాలి.


శ్రీలంకలో మరో ప్రమాదం పొంచి ఉన్నదా అనిపిస్తున్నది. సింహళ- బౌద్ధ తీవ్రవాదులు విదేశాల్లోని తీవ్రవాద బౌద్ధ సన్యాసులతో సంబంధాలు నెలకొల్పుకుంటున్నారు. మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై దాడులను రెచ్చగొట్టిన ఆశిన్ విరాతు అనే బౌద్ధ సన్యాసి శ్రీలంకలోని బోడు బాలసేనకు మద్దతు ప్రకటించారు. శ్రీలంకలో జిహాదీ గ్రూపుల ప్రమాదం ఉందంటున్నారు. మొగ్గ దశలోనే ఉన్న ఈ సింహళ అతివాద ధోరణులను తుంచివేయడానికి శ్రీలంక రాజకీయ నాయకులు సుముఖంగా లేరు. సింహళ అతివాదుల ఓట్లు రావనేదే వారి భయం.

(రచయిత్రి: బెంగళూరులోని ప్రముఖ పాత్రికేయురాలు, పరిశోధకురాలు. దక్షిణాసియా రాజకీయ, భద్రతా అంశాలలో దిట్ట)

(ది డిప్లమాట్ సౌజన్యంతో..)

వ్యవసాయిక విప్లవం

విశ్లేషణ



ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ

ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సమన్వయ సమితుల పేరుతో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఒక తాటిపైకి తెచ్చారు. రాజేంద్రనగర్‌లో ని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో దక్షిణ తెలంగాణలోని 13 జిల్లాల రైతు సమితుల సభ్యుల సమావేశంలో దశ, దిశ నిర్దేశం చేశారు. తద్వారా దేశంలోనే వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయం వ్యాపారం కాదు, అదొక జీవ న విధానం అని వివరించారు. దేశ జీవన విధానం వ్యవసాయంపై ఎంత ఆధారపడి ఉన్నదో విశదీకరించారు. గతంలో కరువు వస్తే ఆ సంవత్సరా న్ని ప్రజలు చాలాకాలం గుర్తుపెట్టుకునేవారని అన్నారు.

కేసీఆర్ అధికారానికి రావడాని ముందే రైతుల సమస్యల మీద, పరిష్కారాల మీద అనుభవం కలిగి ఉన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తొలి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత రైతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ఒక్కో అడుగు వేస్తున్నారు. ఈ విధంగా సమగ్ర వ్యవసాయాభివృద్ధి నమూనాను రూపొందించారు. అందులో భాగంగానే ప్రస్తుత రైతు సమితులను స్థాపించారు. రాష్ట్రంలో మిషన్ కాకతీయ పేరుతో గతంలో కనుమరుగైన కుంటలు, చెరువులను పునరుద్ధరిస్తున్నారు. ఇవి కొనసాగిస్తూనే మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను రీ ఇంజినీరింగ్ చేసి, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టును అతి తక్కువ కాలంలోనే పూర్తిచేయ సంకల్పించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని, వేగాన్ని దేశవ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖులు ప్రశంసిస్తున్నా రు. వ్యవసాయరంగానికి 24 గంటలు ఉచిత కరెంటు ఇవ్వడం, భూ రికార్డులు ఒక నెలలోపే అన్ని జిల్లాల్లో ప్రక్షాళన చేసి లిటిగేషన్ లేనివిధంగా న్యాయబద్ధమైన హక్కుదారులను గుర్తించి, పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు ఇవ్వ సంకల్పించడం ప్రశంసనీయం. దేశంలో ఎక్కడా ఈ విధంగా సమూల ప్రక్షాళన సాగలేదు. ప్రతి వ్యవసాయదారునికి ఎకరానికి రెండు పసళ్లకు ఉచిత పెట్టుబడిగా రూ.8000 లను ప్రీపెయిడ్ కార్డ్స్ రూపంలో చెల్లించ సంకల్పించడం, భూముల అమ్మకంలో అక్రమాలు జరుగకుండా ఒక గంటలో రిజిస్ట్రేషన్ విధానాన్ని పూర్తిచేసే విధానాన్ని రూపొందించి, ఎమ్మార్వోకు అనుసంధానం చేయడం, భూ రికార్డులను వెంటనే మార్చే విధానాన్ని ప్రవేశపెట్టడం మొదలైన చర్యలను రైతులు ప్రశంసిస్తున్నారు. కల్తీ విత్తనాలు, ఎరువులను, మందులను అరికట్టడానికి పీడీ యాక్టును ప్రయోగించడం రైతుల ప్రయోజనాల పరిరక్షణ పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం.

రైతు మరణిస్తే కుటుంబానికి రూ.6 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం, మార్కెట్ మాయాజాలాన్ని అదుపు చేసేవిధంగా జిల్లాల, మండలాల వారిగా గిడ్డంగులు నిర్మించడం, ఐదువేల ఎకరాలకు ఒక యూనిట్‌గా మౌలిక వసతులను కల్పించడం కూడా వ్యవసాయరంగాన్ని మెరుగుపరుచడంలో భాగమే. పంట స్వభావం, పంటల తీరు, పరిరక్షణ మొదలైన అంశాల్లో సలహాలు ఇవ్వడానికి వ్యవసాయాధికారులను నియమించారు. విత్తనాలు ఎరువుల సరఫరా కోసం మార్కెట్‌ను క్రమబద్ధీకరించారు.

వ్యవసాయ విధానాన్ని అన్నిరకాలుగా, అన్ని ప్రభుత్వ శాఖలతో అనుసంధానం చేసి రైతు సమితుల సహకారంతో గ్రామం నుంచి రాష్ట్రం వరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. నీరు, కరెంటు, పెట్టుబడి, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులు అందేలా చర్యలు తీసుకున్నారు. రైతు సమితుల కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల మూలధనం సమకూర్చడం కీలకమైన నిర్ణయం. మార్కెట్లలో గిట్టుబాటు ధర లభించకపోతే, రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ కొని మార్కెట్లలో ఎక్కడైనా లాభదాయకంగా అమ్ముకునే విధంగా వీలు కల్పిస్తుంది. ఈ విధానాలను ఉమ్మడి నిజామాబాద్‌లోని అంకాపూర్ గ్రామంలో రైతులు స్వచ్ఛందంగా అమలుచేస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ఆ ఊరును సందర్శించాలని సమన్వయ సమితి సభ్యులకు సీఎం సూచించారు. ఈ గ్రామస్థులు సంఘటితంగా సంపన్నమైన తీరును కేసీఆర్ రైతులకు వివరించారు.

ప్రతి మండలానికి కావాల్సిన యాంత్రిక పనిముట్లను, పర్మిట్లను ఇవ్వదలిచారు. సబ్సిడీలతో ట్రాక్టర్ల కొనుగోలు చేయ ప్రోత్సహించడం, 65 ఏండ్లు నిండిన రైతులకు క్రాప్ లోన్ ఇప్పించే నూతన లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించడం, దశలవారీగా అన్ని మండలాల నుంచి రైతు సమన్వ సమితి సభ్యులను వ్యవసాయకంగా బాగా అభివృద్ధి చెందిన ఇజ్రాయెల్ లాంటి దేశానికి పంపించ సంకల్పించడం హర్షించదగిన విషయం.

మండలాల్లో వ్యవసాయ అనుబంధ, ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించడం, ప్రతి మండలానికి ఒక రైతు బజారు, మిని మార్కెట్ యార్డ్స్ నిర్మించడం కూడా రైతులకు ఉపయోగకరం. కేంద్ర ఉపాధి హామీ పథకాన్ని రైతు సమన్వయ సమితులకు అనుసంధానం చేసేవిధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కూడా కేసీఆర్ సంకల్పించారు. రాజేంద్రనగర్‌లోని టీఎస్‌ఆర్డీలో రైతులకు నూతన వ్యవసాయ విధానంలో శిక్షణను ఇవ్వాలని భావిస్తున్నారు. ప్రతి మండలానికి కావాల్సిన యాంత్రిక పనిముట్లను, పర్మిట్లను ఇవ్వదలిచారు. సబ్సిడీలతో ట్రాక్టర్ల కొనుగోలు చేయ ప్రోత్సహించడం, 65 ఏండ్లు నిండిన రైతులకు క్రాప్ లోన్ ఇప్పించే నూతన లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించడం, దశలవారీగా అన్ని మండలాల నుంచి రైతు సమన్వ సమితి సభ్యులను వ్యవసాయకంగా బాగా అభివృద్ధి చెందిన ఇజ్రాయెల్ లాంటి దేశానికి పంపించ సంకల్పించడం హర్షించదగిన విషయం.

కోతులు, పందుల మూలంగా పంట నష్టాలను అరికట్టడానికి వైల్డ్‌ఫ్రూట్స్ చెట్లు పెంచడం, అడవి పందులను అవసరమైతే చంపటానికి అధికారంగా ప్రకటించడం సమర్థనీయం. రైతు సమన్వయ సమితుల పాత్రకు రూపకల్పనచేసి 2020 నాటికి తెలంగాణలో కోటి ఎకరాల్లో రెండు పంటలు పండించడానికి కేసీఆర్ కృషిచేస్తున్నారు. కేసీఆర్ దేశానికి ఆదర్శవంతమైన బృహత్ రైతు సంక్షేమ పథకాన్ని ప్రారంభించి నిరాశతో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతు సోదరులకు, గ్రామీణ ప్రజలకు ఆశలు చిగురింపజేశారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ రాజేంద్రనగర్‌లోని రైతు సదస్సు ముగింపు ప్రసంగంలో జరిగింది కొంతే జరుగాల్సిందే ఎంతో ఉందని రైతులకు ఆశాభావాన్ని కల్పించారు. రైతు సమన్వయ సమితుల్లో 1,61,000 సభ్యులున్నారని, ఇకముందు రైతు ఒంటరివాడు కాదని భరోసా ఇచ్చా రు. 'రైతు ఆవేదన నా చెవులారా విన్నా, ఆ వేదన తొలిగించే బాధ్యత చాలా పెద్దది. సంఘటితం కావడమే సంపద సృష్టికి మూలం. రైతులను సంఘటితంచేసి శక్తివంతంగా మారుద్దామంటే వాళ్లు లోకల్ బాడీస్‌కు గొడ్డలి పెట్టు అని దుష్ప్రచారం చేస్తున్నారు. ఇది ఎంతవరకు సబబు' అని రైతులను ప్రశ్నించారు. రైతు సమన్వయ సమితులు రాజకీయ పదవులు కావు. భుజంభుజం కలిపి బాధ్యత పంచుకొని వ్యవసాయ రంగాన్ని సమిష్టిగా నిర్వహించుకొని సంపద సృష్టించే స్వయంపోషక సంస్థలు. ఇందులో రాజకీయాలకు, పైరవీలకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు.

కాళేశ్వరం పూర్తయితే రెండు పంటలు పండి ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అవుతుంది. రైతు సమితులతో ఏ ఎకరంలో ఏ పంట పండించాలో తెలుస్తుంది. పాస్‌బుక్ ఆలస్యం చేస్తే అధికారికి రోజుకు వెయ్యి రూపాయలు జరిమానా పడుతుంది. రైతు వేదికల నిర్వహణకు రూ.12 లక్షలు ప్రభుత్వం ఇస్తుందని, వాటి నిర్వహణకు దాతలు భూ విరాళం ఇవ్వవచ్చని ముఖ్యమంత్రి సూచించారు. మార్కెట్ నియంత్రణ విధానం రావాలని, వ్యవసాయం యాంత్రీకరణతో రైతులు కాలానుగుణంగా మారాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఐదు లక్షల రూపాయల బీమాను కరీంనగర్ సదస్సులో ప్రకటించి మరింత భరోసా ఇచ్చారు.

కేసీఆర్ స్ఫూర్తితో ప్రజలంతా సస్యశ్యామలమైన శాంతివంతమైన తెలంగాణ నిర్మాణంతో దేశానికి ఆదర్శమవుతారని ఆశిద్దాం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ప్రొఫెసర్ వ్యాఖ్యలపై పుచ్చకాయలతో నిరసన

విద్యార్థినుల వస్త్రధారణపై అనుచితంగా మాట్లాడిన కేరళ అధ్యాపకుడు

తిరువనంతపురం, మార్చి 20: ముస్లిం విద్యార్థినులు హిజాబ్ (తలపై వేసుకొనే ముసుగు)ను సరిగ్గా ధరించడం లేదని, వారు ఉద్దేశపూర్వకంగా తమ ఛాతీ భాగాన్ని ప్రదర్శిస్తున్నారంటూ ఓ ప్రొఫెసర్ చేసిన వ్యాఖ్యలు కేరళలో దుమారం రేపుతున్నాయి. కోజికోడ్‌లోని ఫరూక్ ట్రెయినింగ్ కాలేజీకి చెందిన జౌహర్ మునవ్వీర్ ఇటీవల ఓ మతపరమైన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థినులు తమ ఛాతీ భాగాన్ని సగానికి కోసిన పుచ్చకాయలా ప్రదర్శిస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించడంతో పలు విద్యార్థి సంఘాలు పుచ్చకాయలతో ఫరూక్ కాలేజీ వెలుపల నిరసన ప్రదర్శన చేపట్టాయి. ప్రొఫెసర్ వ్యాఖ్యలకు నిరసనగా ఇద్దరు మహిళలు తమ అర్ధనగ్న ఫొటోలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. అయితే ఫేస్‌బుక్ ఆ ఫొటోలను తొలిగించడమే కాకుండా వారి అకౌంట్‌లను నిలిపివేసింది. ప్రొఫెసర్‌ను పుచ్చకాయలతో ముంచెత్తుతామని ఓ విద్యార్థి నాయకుడు అన్నారు. ఇదిలా




పుచ్చకాయలతో నిరసన తెలుపుతున్న యువతులు

ఉండగా, ప్రొఫెసర్ వ్యాఖ్యలను సమర్థించే విద్యార్థినులు సదరు కాలేజీలో ఆయనకు అనుకూలంగా ప్రదర్శన నిర్వహించారు. దీంతో క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ప్రొఫెసర్ మూడు నెలల క్రితం చేసిన ప్రసంగంలోని కొంత భాగాన్ని మాత్రమే కత్తిరించి ప్రచారం చేయడం సరి కాదని ఫరూక్ కాలేజీ ప్రిన్సిపాల్ జవహర్ అన్నారు.

నా వెనుక బీజేపీ లేదు

దేవుడు, ప్రజలు మాత్రమే ఉన్నారన్న రజినీకాంత్



చెన్నై, మార్చి 20: తన రాజకీయ ప్రవేశం వెనుక బీజేపీ ఉందన్న వాదనలను తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ తోసిపుచ్చారు. తన వెనుక దేవుడు, ప్రజలు మాత్రమే ఉన్నారన్నారు. 'వారు మొదటి నుంచి నా వెనుక బీజేపీ ఉందని చెప్తున్నారు. కానీ దేవుడు మాత్రమే నా వెనుక ఉన్నాడు. ఆ తరువాత ప్రజలు ఉన్నారు' అని ఆయన మీడియాతో చెప్పారు. తానింకా పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి రాలేదని చెప్తున్నప్పటికీ ఇటీవల ఆయన ఉత్తరాఖండ్‌లో కొందరు స్థానిక బీజేపీ నాయకులను కలుసుకోవడం వివాదాస్పదమైంది. ఈ నెల 10న హిమాలయాల పర్యటనకు వెళ్లిన రజినీకాంత్ మంగళవారం తిరిగి చెన్నై చేరుకున్నారు. తాను రాజకీయ పార్టీని స్థాపించి వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని గత డిసెంబర్‌లో రజినీ ప్రకటించిన సంగతి తెలిసిందే. కావేరీ జలాల వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో వెంటనే ఒక యాజమాన్య బోర్డును ఏర్పాటుచేయాలని ఒక ప్రశ్నకు బదులుగా రజినీ చెప్పారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు.

తమిళనాట ప్రవేశించిన రామరాజ్య రథయాత్ర

వీహెచ్‌పీ యాత్రకు వ్యతిరేకంగా పలు పార్టీల నిరసన ■ అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకున్న ప్రతిపక్ష డీఎంకే

తిరునల్వేలి/ చెన్నై, మార్చి 20: అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం మద్దతును కూడగట్టేందుకు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) చేపట్టిన రామరాజ్య రథయాత్ర మంగళవారం తమిళనాడులో ప్రవేశించింది. యాత్రకు వ్యతిరేకంగా పలు పార్టీలు నిరసన వ్యక్తంచేశాయి. యాత్రను అడ్డుకునేందుకు వెళ్లిన వీసీకే, ఎంఎంకే నాయకులను తమిళనాడు – కేరళ సరిహద్దుల్లోని కొట్టైవాసల్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఈ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించడంతో పాటు యాత్రామార్గంలో పోలీసు బలగాలను మోహరించినట్టు అధికారులు తెలిపారు. అంతకుముందు రథయాత్రకు వీహెచ్‌పీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కాగా రథయాత్రను అనుమతించడంపై తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షం డీఎంకే తీవ్రంగా మండిపడింది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు నిరసన తెలియజేస్తూ అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో స్పీకర్ వారిని సభ నుంచి సస్పెండ్ చేశారు. డీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ యాత్రను రాష్ట్రంలోకి రానివ్వడంపై ప్రభుత్వంపై



రథయాత్రకు వ్యతిరేకంగా అసెంబ్లీ బయట డీఎంకే నిరసన

విమర్శలు గుప్పించారు. అయితే యాత్ర ఆధారంగా రాజకీయ లబ్ధి పొందాలని డీఎంకే ప్రయత్నిస్తున్నదని సీఎం పళనిస్వామి ఆరోపించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో రథయాత్రకు ఆటంకాలేవీ ఎదురుకాలేదని, యాత్ర వల్ల రాష్ట్రానికి వచ్చిన ఇబ్బందేమీ లేదని పేర్కొన్నారు. ఫిబ్రవరి 13న అయోధ్యలో ప్రారంభమైన రథయాత్ర ఈ నెల 23న కేరళలోని తిరువనంతపురానికి చేరుకోనున్నది.

ఇరాక్‌లో భారతీయులు బలి

మూడేండ్ల క్రితం కిడ్నాపైన 39 మంది మృతి

- రాజ్యసభలో ప్రకటించిన కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్
- మట్టిదిబ్బ కింద సమాధిలో లభ్యమైన మృతదేహాలు డీఎన్‌ఏ ద్వారా గుర్తింపు
- 10 రోజుల్లో భారత్‌కు మృతుల అవశేషాలు



న్యూఢిల్లీ, మార్చి 20: ఇరాక్‌లో మూడేండ్ల క్రితం ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదులు కిడ్నాప్ చేసిన 39 మంది భారతీయులు మరణించారని కేంద్రం తెలిపింది. వారిని ఉగ్రవాదులు హతమార్చి సామూహికంగా ఖననం చేశారని, వారి మృతదేహాలు లభ్యమయ్యాయని విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ మంగళవారం పార్లమెంట్‌కు చెప్పారు. మృతదేహాలను త్వరలోనే భారత్‌కు తరలిస్తామన్న మంత్రి, వారు ఎప్పుడు మరణించిందీ చెప్పలేదు. మోసుల్ నగరానికి వాయవ్యంలోని బదోష్ గ్రామంలో భారతీయుల మృతదేహాలు లభించాయని, డీఎన్‌ఏ పరీక్షలతో వారిని గుర్తించారని ఆమె రాజ్యసభకు తెలిపారు. ఓ ప్రత్యేక విమానంలో ఆ మృతదేహాలను భారత్‌కు తరలించి, వారి బంధువులకు అప్పగిస్తామని చెప్పారు. ఇరాక్‌లోని రెండో అతిపెద్ద నగరమైన మోసుల్ నుండి 2014 లో ఐఎస్ ఉగ్రవాదులు కొంతమంది కార్మికులను బందీలుగా పట్టుకున్నారు. వీరిలో 40మంది భారతీయులు, కొందరు బంగ్లాదేశీయులున్నారు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ వాసి హర్జీత్ మసీహ అనే కార్మికుడు ఉగ్రవాదుల చెర నుంచి తప్పించుకున్నాడు. బందీలను తొలుత మోసుల్‌లోని ఒక వస్త్ర పరిశ్రమలో ఉంచారని, హర్జిత్ తప్పించుకున్న తరువాత వారిని బదోష్‌లోని జైలుకు తరలించారని సుష్మ తెలిపారు. వారికోసం నిరంతరం సాగిన గాలింపు చివరకు బదోష్‌లోని ఒక సామూహిక సమాధి వద్ద ముగిసిందని చెప్పారు. మృతదేహాలను వెలికితీసి పొడవైన తలవెంట్రుకలు, ఇరాకీయేతర బూట్లు, ఐడీల ఆధారంగా వారిని భారతీయులుగా గుర్తించి, బాగ్దాద్‌లో డీఎన్‌ఏ పరీక్ష నిర్వహించారన్నారు. 38 మంది భారతీయుల డీఎన్‌ఏ సరిపోలినట్టు ప్రభుత్వానికి సోమవారం సమాచారం అందిందన్నారు. మృతుల్లో 27 మంది పంజాబ్, ఆరుగురు బీహార్, నలుగురు హిమాచల్‌ప్రదేశ్, ఇద్దరు బెంగాల్ వాసులు ఉన్నారని చెప్పారు. కాగా రాజ్యసభలో నిరంతరం అంతరాయం కలుగుతుండటంతో ఆవేదన చెందిన చైర్మన్ వెంకయ్యనాయుడు ఎంపీలకు ఇవ్వ తలపెట్టిన విందును రద్దు చేశారు.

భోజనం చేసి వస్తుండగా కిడ్నాప్

ఐఎస్ ఉగ్రవాదులు మోసుల్‌ను ఆక్రమించినప్పుడు చాలా మంది ఇరాకీలు పారిపోయారు. కానీ భారత్, బంగ్లాదేశ్ కార్మికులు మాత్రం అక్కడే ఉండిపోయారు. వారు భోజనం చేసి వస్తుండగా, ఉగ్రవాదులు బందీలుగా పట్టుకొని ఒక టెక్స్‌టైల్ ఫ్యాక్టరీకి తీసుకెళ్లినట్టు అక్కడ ఆహారం సరఫరా చేసే ఒక వ్యక్తి చెప్పారు.

మరో 10 రోజుల్లో మృతదేహాల తరలింపు

మృతదేహాలను భారత్ తీసుకొచ్చేందుకు వీకే సింగ్ మళ్లీ ఇరాక్ వెళతారని సుష్మాస్వరాజ్ చెప్పారు. ఇరాక్ నుంచి మృతదేహాలను తరలించేందుకు మరో ఎనిమిది నుంచి పది రోజుల సమయం పట్టవచ్చని వీకేసింగ్ అన్నారు.



తమ వారి మరణవార్త విని అమృత్‌సర్‌లో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న ఓ బాధిత కుటుంబం

నేను ముందే చెప్పాను: హర్జీత్

బందీలందరినీ ఉగ్రవాదులు తన కండ్లముందే కాల్చి చంపారని, వారెవరూ బతికిలేరని తాను మూడేండ్ల క్రితమే చెప్పానని, ఐఎస్ మిలిటెంట్ల చెర నుంచి తప్పించుకొని వచ్చిన హర్జీత్ మసీహ అన్నారు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లా కాలా అఫ్ఘానా గ్రామానికి చెందిన మసీహ కూడా నాడు ఉగ్రవాదులకు బందీలుగా చిక్కిన 40 మందిలో ఉన్నాడు. తన వాదనను ప్రభుత్వం ఇంత కాలం ఎందుకు నమ్మలేదో అర్థం కావడం లేదని హర్జిత్ అన్నారు. 'మేము 2014 జూన్ నెలలో ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాం. భోజనం చేసి తిరిగివస్తుండగా ఉగ్రవాదులు పట్టుకున్నారు. కొద్దిరోజులు బందీలుగా ఉంచుకున్నారు. ఆ దురదృష్టకరమైన రోజు అందరినీ మోకాళ్లపై కూర్చోవాలని ఉగ్రవాదులు చెప్పారు. అలా కూర్చోగానే అందరినీ కాల్చి చంపారు. బుల్లెట్ నా తొడకు తగులడంతో నేను స్పృహ కోల్పోయాను. స్పృహ వచ్చిన తరువాత అక్కడి నుంచి ఎర్బిల్‌లోని ఇరాక్ సైన్యం చెక్‌పాయింట్ వద్దకు చేరుకున్నాను. అక్కడి నుంచి భారత దౌత్య అధికారులు నన్ను తీసుకెళ్లారు' అని మసీహ చెప్పారు. మసీహ చెప్తున్నది కట్టుకథ అని కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ కొట్టివేశారు.



ప్రభుత్వం ఎందుకు మభ్య పెట్టింది?

మృతుల కుటుంబాల ఆవేదన



భర్త మరణవార్తతో రోదిస్తున్న జ్ఞాన్‌కౌర్

చండీగఢ్, మార్చి 20: ఇంతకాలం ఎదురుచూసిన తమ ఆప్తులు ఇక రారని టీవీ చానెళ్ల ద్వారా తెలుసుకున్న మృతుల బంధువులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. వారు సజీవంగానే ఉన్నారని, వారికోసం వెతుకుతున్నామంటూ ప్రభుత్వం ఇంత కాలం తమను ఎందుకు మభ్య పెట్టిందని వారు ప్రశ్నిస్తున్నారు. 'ప్రభుత్వం ఇంతకాలం మమ్మల్ని మభ్యపెట్టింది. నాలుగేండ్ల తరువాత ఇప్పుడు దిగ్భ్రాంతిగొలిపే ప్రకటన చేసింది. మేము సుష్మాస్వరాజ్‌ను 12సార్లు కలిసాము. ఇరాక్‌లో అదృశ్యమైన భారతీయులు సజీవంగానే ఉన్నారని ఆమె చెప్పారు. హర్జీత్ మసీహ అబద్ధం చెప్తున్నాడు' అని అమృత్‌సర్‌కు చెందిన సర్వాన్ మండిపడ్డారు. ఇరాక్‌లో మృతి చెందిన 39 మందిలో సర్వాన్ సోదరుడు నిషాన్ ఉన్నారు. కేరళకు చెందిన నర్సులను ఇరాక్‌లో సురక్షితంగా కాపాడగలిగిన ప్రభుత్వం ఇతర భారతీయులను కాపాడటంలో ఎందుకు విఫలమైందని డింపుల్‌జీత్ కౌర్ ప్రశ్నించారు. తన సోదరు మంజిందర్‌సింగ్ మరణవార్త టీవీలో చూసి తెలుసుకున్నానని, అయితే మంత్రి తనకు ఫోన్ చేసి చెప్తేనే ఆ వార్తను నమ్ముతానని పంజాబ్‌కు చెందిన గుర్పిందర్‌కౌర్ చెప్పారు. తమ సోదరుడు గోబిందర్ సింగ్ పిల్లల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కపుర్తలకు చెందిన దేవిందర్ డిమాండ్ చేశారు.

భారతీయులంతా ఆ కుటుంబాల వెంటే: ప్రధాని మోదీ

'ఇరాక్‌లో ఉగ్రవాదుల చేతిలో హతమైన 39మంది కుటుంబాలకు భారతీయులంతా సంఘీభావంగా ఉంటారు. మొసుల్‌లో కనిపించకుండాపోయిన ఆ 39 మందిని సురక్షితంగా భారత్‌కు తెచ్చేందుకు సహచరులు సుష్మాస్వరాజ్, వీకేసింగ్ అన్ని ప్రయత్నాలు చేశారు'

– ట్విట్టర్‌లో ప్రధాని మోదీ

'బందీలుగా ఉన్న 39 మంది భారతీయులు మరణించారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాను. తమవారు తిరిగి వస్తారని ఇంతకాలం ఎదురుచూసిన కుటుంబాలన్నింటికీ నా ప్రగాఢ సంతాపం తెలుపుతున్నాను' – రాహుల్‌గాంధీ

'ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరించింది. పార్లమెంట్‌కు బదులుగా ముందు మృతుల కుటుంబాలకు సమాచారం ఇవ్వాల్సింది.

–మొహమ్మద్ సలీం, సీపీఎం ఎంపీ

శశికళ భర్త నటరాజన్ మృతి

- ■ అనారోగ్యంతో దవాఖానలో చికిత్స తీసుకొంటూ కన్నుమూత
- ■ శశికళకు 15 రోజుల పెరోల్ మంజూరు

చెన్నై/ బెంగళూరు : అన్నాడీఎంకే బహిష్కృత నేత వీకే శశికళ భర్త నటరాజన్(74) మంగళవారం అనారోగ్యంతో మరణించారు. ఛాతి నొప్పితో శనివారం చెన్నైలోని ఓ హాస్పిటల్‌లో చేరిన ఆయన సోమవారం అర్ధరాత్రి 1.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. భర్త అంత్యక్రియల్లో పాల్గొనడానికి వీలుగా బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో ఉన్న శశికళకు 15 రోజుల పెరోల్‌ను అధికారులు మంజూరు చేశారు. ఈ సమయంలో రాజకీయ కార్యక్రమాలు, సభల్లో పాల్గొనరాదని జైలు సూపరింటెండెంట్ షరతులు విధించారు. ఆమె చెన్నై చేరిన తరువాతే అంత్యక్రియలు ఎప్పుడు నిర్వహించేది నిర్ణయించే అవకాశం ఉంది. నటరాజన్ భౌతికకాయాన్ని బీసెంట్‌నగర్‌లోని నివాసానికి తరలించగా, రాజకీయ నాయకులు పెద్దసంఖ్యలో వచ్చి ఆయనకు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న దినకరన్

దేశాభివృద్ధి ఏ ఒక్కరివల్లనో జరగదు!

- ■ మోదీ ప్రజలను అవమానిస్తున్నారు : రాహుల్

పదుబిదిరె/ కర్ణాటక : దేశ ప్రగతికి తానే కారణమని గొప్పలు చెప్పుకొంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలోని సామాన్య ప్రజలను అవమానిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ దుయ్యబట్టారు. బీజేపీ ధర్మపన్నాలు వల్లిస్తూనే దేశ ప్రజలను విభజిస్తున్నదని, బసవన్న, నారాయణగురు వంటి వారిని పొగుడుతూనే వారి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నదని విమర్శించారు. కర్ణాటకలో మూడో దఫా పర్యటన కోసం వచ్చిన ఆయన ఉడిపి జిల్లాలోని పదుబిదిరెలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'ప్రధాని మోదీ ఎక్కడికి వెళ్లినా గత 70 ఏండ్లలో దేశంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని చెప్తూ మీ తల్లిదండ్రులను, పేద రైతులను, కార్మికులను వ్యాపారుల శ్రమను అవమానిస్తున్నారు. ప్రపంచ దేశాలకు దీటుగా భారత్ నిలబడిందంటే, అది ఈ రెండేండ్లలోనే జరుగలేదు. దేశాభివృద్ధి ఏ ఒక్కరి వల్లనో జరుగదు' అని రాహుల్ చెప్పారు.

అవసరమైతే యుద్ధానికైనా సిద్ధం

- ■ ఒక్క అంగుళం కూడా వదులుకోం
- ■ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సంచలన వ్యాఖ్యలు
- ■ భారత్ సహా పొరుగు దేశాలకు పరోక్ష హెచ్చరికలు

బీజింగ్, మార్చి 20: తమ భూభాగంలోని ఒక్క ఇంచు స్థలాన్ని కూడా వదులుకోవడానికి చైనా సిద్ధంగా లేదని, తమ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు యుద్ధానికైనా సిద్ధమేనని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనాకు చెందిన భూమి ప్రపంచంలో ఎక్కడ ఉన్నా స్వాధీనం చేసుకుంటామని భారత్ సహా పలు సరిహద్దు దేశాలకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. చైనా పార్లమెంట్ వార్షిక సమావేశాల ముగింపు సందర్భంగా మంగళవారం జిన్‌పింగ్ ప్రసంగించారు. 130 కోట్ల మంది చైనావాసుల 'పునర్నిర్మిత చైనా' ఆశలకు త్వరలో వాస్తవరూపం కల్పిస్తామన్నారు. 'చైనీయులు అజేయులు, పట్టు విడువని వారు. శత్రువులతో యుద్ధం చేసైనా మన భూభాగాలను స్వాధీనం చేసుకునే సత్తా మనకు ఉన్నది' అని పేర్కొన్నారు. మాతృభూమి సమగ్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ పునరేకీకరణ సాధించాలన్న దేశప్రజల ఆకాంక్షను నెరవేరుస్తామంటూ తైవాన్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. తైవాన్ తమ పరిధిలోకే వస్తుందని చైనా వాదిస్తున్న సంగతి తెలిసిందే. వన్‌బెల్ట్..వన్‌రోడ్, ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టులపై వస్తున్న విమర్శలకు స్పందించిన జిన్‌పింగ్ తమకు విస్తరణ కాంక్ష లేదని చెప్పారు. చైనాలో కమ్యూనిస్టు పార్టీ చెప్పిందే శాసనమని, 20 లక్షల మంది సైన్యం, ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు పార్టీ నాయకత్వంలోనే పనిచేయాలని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. భారత్ సహ పలు దేశాలతో కయ్యం పెట్టుకుంటున్న చైనా ఇప్పుడు ఏకంగా అవసరమైతే యుద్ధం చేస్తామంటూ భయపెట్టే ప్రయత్నం చేస్తున్నది.



పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తున్న జిన్‌పింగ్

పద్మ అవార్డుల ప్రదానం

- ■ ఉపరాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోదీ, ప్రముఖుల హాజరు



ఇళయరాజాకు 'పద్మవిభూషణ్' ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి

న్యూఢిల్లీ, మార్చి 20: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా, హిందుస్థానీ గాయకుడు గులాం ముస్తాఫా ఖాన్, హిందుత్వ సిద్ధాంతకర్త పీ పరమేశ్వరన్, కేరళ బిషప్ ఫిలిపోస్‌మార్ క్రోయ్సోస్టోమ్‌లతోపాటు మరో 39మందికి పద్మ అవార్డులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, ఆయన క్యాబినెట్ సహచరులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఇళయరాజాతోపాటు కన్యాకుమారి వివేకానంద కేంద్ర అధ్యక్షుడు పరమేశ్వరన్, హిందుస్థానీ గాయకుడు గులాం ముస్తాఫాఖాన్‌లకు పద్మ విభూషణ్, కేరళ బిషప్ ఫిలిపోస్ మార్ క్రోయ్సోస్టోమ్, చరిత్రకారుడు రామచంద్రన్ నాగస్వామి, న్యాయ కోవిదుడు వేద్ ప్రకాశ నందా, సితార్ విద్వాంసుడు పండిట్ అరవింద పారిఖ్‌లకు పద్మభూషణ్, మరో 36మందికి పద్మశ్రీ పురస్కారాలు అందజేశారు. ఈ ఏడాది 84 మందికి పద్మ అవార్డులు ప్రకటించగా, మిగతా 41 మందికి వచ్చేనెల రెండో తేదీన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అవార్డులు ప్రదానం చేస్తారు.

ఉస్మానియా, హైదరాబాద్ వర్సిటీలకు

పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి

- ■ దేశవ్యాప్తంగా 62 విశ్వవిద్యాలయాలకు మంజూరు చేసిన యూజీసీ
- ■ జాబితాలో తెలంగాణ ఇంగ్లిష్, ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ



న్యూఢిల్లీ, మార్చి 20: దేశవ్యాప్తంగా 62 ఉన్నత విద్యా సంస్థలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తిని కల్పించింది. వీటిలో మన రాష్ట్రంలోని సెంట్రల్ యూనివర్సిటీలైన హైదరాబాద్ విశ్వవిద్యాలయం, తెలంగాణ ఇంగ్లిష్, ఫారిన్ లాంగ్వేజెస్ విశ్వవిద్యాలయం, రాష్ట్ర యూనివర్సిటీగా ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం కూడా ఉన్నాయి. విద్యా బోధనలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పిన ఆయా విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి కల్పిస్తూ మంగళవారం జరిగిన యూజీసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పూర్తిస్థాయి స్వయంప్రతిపత్తి పొందిన వాటిలో ఐదు సెంట్రల్ యూనివర్సిటీలు, 21 స్టేట్ యూనివర్సిటీలు, 26 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వీటితోపాటు మరో 10 కళాశాలలకు కూడా స్వయంప్రతిపత్తి కల్పించారు. ఈ నిర్ణయంతో ఆయా యూనివర్సిటీలు సొంతంగా ప్రవేశ ప్రక్రియను, ఫీజుల విధానాన్ని, పాఠ్యాంశాలను కలిగి ఉంటాయని, కొత్త కొర్సులను, కొత్త విభాగాలను, రీసెర్చ్ పార్కులను ప్రారంభించవచ్చని, విదేశీ బోధనా సిబ్బందిని నియమించుకోవచ్చని, విదేశాల నుంచి విద్యార్థులను చేర్చుకోవచ్చని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ పేర్కొన్నారు.

రాహుల్ మాటల స్ఫూర్తి.. పదవికి స్వస్తి!

యువతకు అవకాశం కోసం కాంగ్రెస్ పార్టీ గోవా అధ్యక్షుడు రాజీనామా

న్యూఢిల్లీ: 'పార్టీలో యువతరానికి ప్రాధాన్యం ఇవ్వాలి' అంటూ ఇటీవల కాంగ్రెస్ ప్లీనరీలో ఆ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపునకు గోవా కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించారు. కాంగ్రెస్ పార్టీ గోవా అధ్యక్షుడు 71 ఏండ్ల శాంతారామ్ నాయక్.. పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని రాహుల్‌గాంధీకి పంపించారు. ప్లీనరీలో రాహుల్ చేసిన ప్రసంగాలతో స్ఫూర్తిపొంది ఈ నిర్ణయం తీసుకున్నానని శాంతారామ్ చెప్పారు. నాయకత్వాన్ని చేపట్టేందుకు యువతరం ముందుకురావాలన్నారు.

బీజేపీపై 'బ్రహ్మాస్త్రం'?

- ■ ఎన్నికలవేళ లింగాయత్‌లకు మైనార్టీ మత హోదా ఇచ్చిన కర్ణాటక కాంగ్రెస్ సర్కార్
- ■ బీజేపీ ఓటుబ్యాంకుపై భారీ దెబ్బ పడే సూచనలు ■ వ్యతిరేకిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్.. ఆచితూచి స్పందిస్తున్న కమలనాథులు
- ■ విభేదిస్తున్న వీరశైవులు.. సిద్ధరామయ్యకు కొత్త తలనొప్పులు

న్యూఢిల్లీ: సాధారణంగా బీజేపీ మత రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపణలు వస్తుంటాయి కానీ, ఆ అస్త్రాన్ని ఈసారి కాంగ్రెస్ ప్రయోగించింది. లింగాయత్‌లకు మైనార్టీ మత హోదా నిర్ణయం కర్ణాటకలో ఎన్నికలవేళ రాజకీయ వేడిని పెంచేసింది. రెండు రోజుల క్రితం ప్రత్యేక జెండాతో దర్శనమిచ్చిన రాష్ట్రం.. తాజా నిర్ణయంతో దేశం దృష్టిని తన వైపు తిప్పుకున్నది. రాష్ట్ర జనాభాలో లింగాయత్‌లు 17%. వారు తమ వెంటే ఉన్నారని బీజేపీ నమ్ముతూ వచ్చింది. కానీ, సిద్ధరామయ్య మైనార్టీ హోదా అస్త్రాన్ని ప్రయోగించడంతో రాజకీయ సమీకరణాలు మారాయి. తమను ప్రత్యేక మతంగా గుర్తించాలని లింగాయత్‌లు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. వారికి ప్రత్యేక మత హోదా ఇవ్వాలని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీ చేసిన సిఫారసులనే కర్ణాటక కేబినెట్ ఆమోదించినట్లు కనిపిస్తున్నా, గణనీయంగా ఉన్న లింగాయత్‌ల ఓట్లను కొల్లగొట్టేందుకే కాంగ్రెస్ ఈ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినట్లు తెలుస్తున్నది. వచ్చేవారం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసి, కేంద్రానికి సిఫారసు చేయనుందని భావిస్తున్నారు.

ఎన్నికలపై ఏమేరకు ప్రభావం?: ఉత్తర కర్ణాటకలో బలమైన ఈ వర్గం తొలినుంచీ బీజేపీకి వెన్నుదన్నుగా ఉన్నది. బీజేపీ నేత, రాష్ట్ర మాజీ సీఎం యడ్యూరప్ప సామాజిక వర్గ నేతే. 224 అసెంబ్లీ సెగ్మెంట్లలో 100 స్థానాల్లో లింగాయత్‌లు గెలుపును ప్రభావితం చేయగలరు. ఈ జాబితాలో వీరశైవులను కలుపడమూ కాంగ్రెస్‌కు లాభిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పలువురు మంత్రులు బెంగళూరులో భారీ ర్యాలీ నిర్వహించి, సీఎం సిద్ధరామయ్యకు సన్మానించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నిర్ణయంతో వీలైనంత ఎక్కువ లబ్ధి పొందాలన్నది కాంగ్రెస్ వ్యూహం. బంతిని కేంద్రం కోర్టులోకి నెట్టి తమ డిమాండ్‌కు బీజేపీయే అడ్డుపడుతుందన్న అభిప్రాయాన్ని లింగాయత్‌లలో కలిగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. దీన్ని వీరశైవులు విభేదిస్తుండడం కాంగ్రెస్‌ను కలవరపరుస్తున్నది.

ఇరకాటంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్: దూకుడుమీదున్న బీజేపీని సిద్ధరామయ్య ప్రభుత్వ నిర్ణయం చిక్కుల్లో పడేసింది. లింగాయత్‌లను ప్రత్యేక మతంగా గుర్తించడాన్ని అంగీకరించబోమని 'ఆర్‌ఎస్‌ఎస్' స్పష్టంచేసింది. ఎలా స్పందించాలో తెలియనిస్థితిలో బీజేపీ పడిపోయింది. లింగాయత్‌లు, వీరశైవులు ఒక్కటేనని.. వారి ఐక్యతకు కాంగ్రెస్ ముప్పుతెస్తున్నదని బీజేపీ నేత యడ్యూరప్ప అన్నారు.

ఎవరీ లింగాయత్‌లు, వీరశైవులు?: 12వ శతాబ్ద సంఘ సంస్కర్త బసవేశ్వరుడి అనుచరులే లింగాయత్‌లు. బ్రాహ్మణ, కుల ఆధిపత్యంపై సామాజిక, ఆధ్యాత్మిక తిరుగుబాటుకు బసవేశ్వరుడు మార్గనిర్దేశం చేశారు. మహిళలను పురుషులతో సమానంగా చూడాలని బోధించారు. వారి నమ్మకాలు, ఆచారాలు, పద్ధతులు అన్నీ హిందూ సమాజానికి భిన్నంగా ఉంటాయి. ఉత్తర, మధ్య కర్ణాటకలో లింగాయత్‌ల ఆధిపత్యం ఎక్కువ. ఇక కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌ల్లో వీరు విస్తరించి ఉన్నారు. లింగాయత్‌లలోనే వీరశైవ వర్గం హిందువులు పూజించే శివుడిని ఆరాధిస్తుంది. బసవన్న తన తత్వాల్లో పేర్కొన్న శివుడు హిందూ దేవుడు కాదని, అది 'ఇష్ట లింగం' (నిరాకార స్వరూపం) అని లింగాయత్‌ల వాదన.



వీరశైవుల అభ్యంతరం

లింగాయత్‌లకే మైనార్టీ మత హోదా ఇస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని వీరశైవ పంచపీఠాధిపతులు తొలినుంచీ చెబుతున్నారు. తమను లింగాయత్‌లతో సమానంగా గుర్తించాలని వాదిస్తున్నారు. తమలో అంతర్భాగంగా ఉంటూ రాజకీయంగా, ఆర్థికంగా బలంగా ఉన్న వీరశైవుల ఆధిపత్యాన్ని లింగాయత్‌లు వ్యతిరేకిస్తున్నారు. తాము లింగాయత్‌లు ఒక్కటేనని వీరశైవులు చెబుతున్నారు. కాగా, ప్రభుత్వం కొత్తగా గుర్తించే మతాన్ని 'వీరశైవ లింగాయత్'గా పిలువాలని వీరశైవులు డిమాండ్ చేస్తున్నారు. నిపుణుల కమిటీ మాత్రం 'లింగాయత్'గా పేర్కొనాలని స్పష్టంచేసింది. కాగా, కర్ణాటక కేబినెట్ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు అఖిల భారత వీరశైవ మహాసభ స్పష్టంచేసింది. లింగాయత్‌లతో సమానంగా వీరశైవానికీ మత హోదా ఇవ్వాలని మహాసభ అధ్యక్షుడు షమనూర్ శివశంకరప్ప డిమాండ్ చేశారు.

ప్రతిపాదన వస్తే

పరిశీలిస్తాం: కేంద్రం

న్యూఢిల్లీ : లింగాయత్, వీరశైవులకు మైనార్టీ మత హోదా ఇవ్వాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై కేంద్రం ఆచితూచి స్పందిస్తున్నది. కర్ణాటక నుంచి ప్రతిపాదన వస్తే పరిశీలిస్తామని కేంద్ర హోంశాఖ అధికారులు తెలిపారు. కర్ణాటక మైనారిటీ కమిషన్ చైర్మన్ హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ కమిషన్ నివేదిక ఆధారంగా సిద్దరామయ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన పరిశీలనకు జనగణన రిజిస్ట్రార్ జనరల్‌ను హోం శాఖ అధికారులు పంపనున్నారు. ఆయన సలహాలను తీసుకున్నాక కేబినెట్ ముందుకు ప్రతిపాదన రానున్నది.

రిజర్వేషన్లు కోల్పోతారు: కేంద్రమంత్రి

లింగాయత్‌లకు మైనారిటీ మత హోదా వల్ల అందులోని ఎస్సీలు తమ రిజర్వేషన్ కోల్పోతారని కేంద్ర మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ తెలిపారు. అందుకే 2013లో ఈ ప్రతిపాదన కేంద్రం ముందుకొచ్చినా యూపీఏ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు.

24న పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ మేళా

హైదరాబాద్ పాస్‌పోర్టు రీజినల్ ఆఫీస్‌లో ఏర్పాటు

కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 24న పీసీసీ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ల(పీసీసీ) సత్వర జారీ ప్రక్రియ కోసం తొలిసారిగా మేళా చేపట్టామన్నారు. హైదరాబాద్‌లోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, సచివాలయశాఖతో కలిసి నిర్వహిస్తున్న ఈ మేళా కోసం ఆన్‌లైన్‌లో (www.pass portindia.gov.in) బుక్ చేసుకునేందుకు వెయ్యి స్లాట్లను రిలీజ్ చేశామన్నారు. దరఖాస్తుదారులు తమ స్లాట్‌ను బుక్ చేసుకొని, పీసీసీ జారీకి అవసరమైన డాక్యుమెంట్లతో 24న మేళాకు హాజరుకావాలని కోరారు. బేగంపేటలోని పాస్‌పోర్టు సేవా కేంద్రంలో లేదా సెక్రటేరియట్ బ్రాంచీలో పీసీసీని ఉచితంగా పొందవచ్చునని, వాటిపై అధికారులతో ధ్రువీకరణ చేయించుకొని మేళాకు హాజరుకావాలని కోరారు. గల్ఫ్‌కు వెళ్లాలనుకుంటున్న పాస్‌పోర్టు దరఖాస్తుదారులు చాలా కాలంగా పీసీసీ కోసం వేచి చూస్తున్నట్టు గుర్తించి ఈ మేళాను ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు.

రియల్ కింగ్ హైదరాబాద్

గృహ విక్రయాల్లో 32 శాతం వృద్ధి

- దేశంలోని ప్రధాన నగరాల్లో 39 శాతం క్షీణత
- తెలంగాణ ఏర్పాటు తర్వాత పెరిగిన అమ్మకాలు
- కొత్తజిల్లాలు, సదుపాయాల కల్పనతో ఊతం
- జేఎల్ఎల్ సర్వేలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: దేశంలోని ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం డీలా పడుతున్న వేళ గ్రేటర్ హైదరాబాద్ మాత్రం కళకళలాడుతున్నది. క్రయవిక్రయాల్లో దూసుకుపోతూ 'రియల్' కింగ్‌గా నిలుస్తున్నది. గత ఐదేండ్లలో కొత్త భవనాల విక్రయాల్లో హైదరాబాద్ 32 శాతం వృద్ధిని సాధించడమే ఇందుకు నిదర్శనం. ఇదే సమయంలో దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో గృహవిక్రయాల్లో సగటున 39 శాతం తగ్గుదల నమోదుకావడం గమనార్హం. నూతన భవనాల విక్రయాలపై జేఎల్ఎల్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు వెల్లడైనట్టు ఓ ఆంగ్ల పత్రిక ప్రచురించింది.

అనుమానాలు పటాపంచలు చేస్తూ..

దేశంలో ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, పుణె, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా నగరాల్లో 2014 నుంచి 2017 వరకు ఏటా జరిగిన నూతన భవనాల విక్రయాలపై జేఎల్ఎల్ సంస్థ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత తెలంగాణలో రియల్ రంగం దూసుకుపోతున్నట్టు తేలింది. పటిష్ట నాయకత్వం కింద సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పడటం, హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలకు ఇస్తున్న ప్రాధాన్యం తదితర అంశాలు కలిసొచ్చినట్టు వెల్లడైంది. అంతేకాకుండా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో తరుచూ జరుగుతున్న ఆందోళనలు, ప్రత్యేక హోదాపై నిరసనలు, అనిశ్చిత పరిస్థితులు కూడా రియల్ ఎస్టేట్ పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు హైదరాబాద్‌వైపు చూసేలా దోహదపడినట్టు విశ్లేషించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో రోడ్ల అభివృద్ధి కోసం చేపట్టిన ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం, మెట్రోరైలు ప్రాజెక్టు, ఐటీ కారిడార్లుగా వర్ధిల్లుతున్న నానక్‌రామ్‌గూడ, గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలు స్థిరాస్తి కొనుగోళ్లకు ఊతమిచ్చినట్టు పేర్కొన్నారు. అంతేకాకుండా నగరం చుట్టూ మేడ్చల్, యాదాద్రి భువనగిరి, వికారాబాద్ వంటి నూతన జిల్లాలను ఏర్పాటు చేయడం, వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడం వంటివి గృహాల క్రయవిక్రయాల పెరుగుదలకు దోహదపడినట్టు సర్వేలో తేలింది.



ప్రధాన నగరాల్లో క్షీణత

2013 నుంచి 2017 వరకు జరిగిన విక్రయాలను పరిశీలిస్తే 2013-14లో ఢిల్లీ పరిధిలో 1,16,250 విక్రయాలు జరుగగా, 2017 నాటికి 37,600కు పడిపోయాయి. అంటే సుమారు 68 శాతం విక్రయాలు క్షీణించాయి. ముంబైలో 2013-14లో 72,400 విక్రయాలు జరుగగా, 2017 నాటికి 27 శాతం క్షీణించి 52,600కు పడిపోయాయి. ఇలా చెన్నైలో 45శాతం, పుణెలో 29 శాతం, బెంగళూరులో 17శాతం, కోల్‌కతాలో 12 శాతం విక్రయాలు పడిపోయాయి. ఆర్థిక అభివృద్ధి, వ్యాపార దృష్టితో ఎన్ఆర్ఐలు అధికంగా పెట్టుబడి పెట్టే పుణెలోనూ గత ఐదేండ్లలో కొత్త ఇండ్ల కొనుగోళ్లు గణనీయంగా తగ్గడం గమనార్హం. కేంద్రం ప్రవేశపెట్టిన జీఎస్టీతో దేశంలోని అన్ని మెట్రో నగరాలపై ప్రతికూల ప్రభావం పడగా, హైదరాబాద్‌లో మాత్రం ఆ ప్రభావం పెద్దగా కనిపించలేదని దీనిని బట్టి స్పష్టమవుతున్నది. మొత్తం మీద ఏడు ప్రధాన నగరాల్లో 2013-14లో 3.30 లక్షల విక్రయాలు జరుగగా, 2015-16లో 17శాతం తగ్గి 2.73లక్షలకు పరిమితమయ్యాయి. 2017లో మరింత క్షీణించి 2.02 లక్షలకు (26 శాతం తగ్గుదల) పడిపోయాయి. అదే సమయంలో హైదరాబాద్‌లో మాత్రం విక్రయాలు గణనీయంగా పెరిగాయి. దీనిని బట్టి భవిష్యత్తులో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం మరింత వృద్ధిని సాధిస్తుందని నిపుణులు చెప్తున్నారు.

ప్రధాన నగరాల్లో విక్రయాలు ఇలా..

నగరం	2013-14	2015-16	2017	నగటు వృద్ధి/ క్షీణత శాతం
ఢిల్లీ	1,16,250	62,300	37,600	-68
ముంబై	72,400	67,450	52,600	-27
బెంగళూరు	50,600	53,900	42,200	-17
పుణె	41,300	38,450	29,300	-29
హైదరాబాద్	11,450	14,250	15,100	+32
చెన్నై	23,850	21,000	13,100	-45
కోల్‌కతా	14,600	16,050	12,900	-12
మొత్తం	3,30,450	2,73,400	2,02,800	-39

నిపుణులను అందించండి

- టాస్క్‌ను కోరిన ఫ్రెంచ్ సంస్థ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్న టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్)కు దేశవిదేశీ సంస్థల నుంచి ఆదరణ లభిస్తున్నది. అంతర్జాతీయంగా పేరొందిన ఫ్రెంచ్ విమానయాన సంస్థ తెలంగాణలో నిర్వహించబోయే తమ కార్యకలాపాలకు నిపుణులైన సిబ్బందిని అందించాలని టాస్క్‌ను కోరింది. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నది. టాస్క్ ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్ అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నది. ఫ్రాన్స్‌లోని పారిస్ కేంద్రంగా పనిచేసే సాఫ్రాన్ సంస్థ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజినీరింగ్, రాకెట్, ఏరోస్పేస్ కాంపొనెంట్ రంగాల్లో ప్రపంచంలోనే పేరెన్నికగన్నది. ఎయిర్‌క్రాఫ్ట్ వైరింగ్‌లో అంతర్జాతీయంగా పేరొందిన సాఫ్రాన్ ఎలక్ట్రికల్ అండ్ పవర్ సంస్థ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నది. ఎలక్ట్రికల్ వైర్ హార్నెస్ అసెంబ్లింగ్ బండిల్స్ ఉత్పత్తిని త్వరలో ప్రారంభించనున్నది. ఇందులో పనిచేసేందుకు అవసరమైన టెక్నీషియన్స్, ఇంజినీర్ల కోసం తమతో ఎంవోయూ కుదుర్చుకున్నదని టాస్క్ సీఈవో సుజీవ్ నాయర్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. రెండేండ్లలో 200 మంది అవసరమని, మొదటి దశలో 40 మందిని సాఫ్రాన్ సంస్థ తీసుకోనున్నదని చెప్పారు. వచ్చేవారం ఇందుకు సంబంధించిన వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని వివరించారు.

భార్యాబిడ్డలను కడతేర్చాడు

అత్తవారింట్లోనే గొంతునులిమి హత్య • భార్య, ఇద్దరు పిల్లలను చంపేశానని మామకు ఫోన్ • మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన ఉన్మాది



నిందితుడు సురేందర్(ఫైల్), వరలక్ష్మి, నితీశ్, యశస్విని మృతదేహాలు

బడంగ్‌పేట: నిద్రిస్తున్న భార్యాబిడ్డలను గొంతునులిమి కడతేర్చాడు ఓ ఉన్మాది. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హైదరాబాద్ మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున ఈ దారుణం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ మండలం బడంగ్‌పేట సాయిప్రభుకాలనీలో ఉంటున్న మహేశ్, జ్యోతి దంపతుల కుమార్తె వరలక్ష్మికి కాటేదాన్ పద్మశాలికాలనీకి చెందిన గాజుల (సంగిశెట్టి) మణెమ్మ కుమారుడు సురేందర్‌కు తొమ్మిదేండ్ల కిందట పెండ్లి జరిగింది. సురేందర్, వరలక్ష్మికి ఇద్దరు పిల్లలు నితీశ్ (5), యశస్విని (3) ఉన్నారు. సురేందర్ సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో ఆటోమెకానిక్‌గా పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో వరలక్ష్మి పిల్లలను తీసుకొని తెల్లాపూర్ నుంచి బడంగ్‌పేటలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. రాత్రి సురేందర్ అత్తగారి ఇంటికి వచ్చాడు. మంగళవారం తెల్లవారుజామున నిద్రలో ఉన్న భార్య వరలక్ష్మి(30), కుమార్తె యశస్వినిని గొంతు నులిమి హత్యచేశాడు. కుమారుడు రాత్రి అమ్మమ్మ వద్ద పడుకున్నాడు. భార్య, కూతురును హత్య చేసిన విషయం బయటకు పొక్కకుండా సురేందర్ జాగ్రత్త పడ్డాడు. ఉదయం లేవగానే మామ మహేశ్, బావమరిది తిలక్‌ను పిలిచి కల్లు కావాలని అడుగగా, వారిద్దరూ కల్లు కోసం ఆదిభట్లకు వెళ్లారు. అత్త జ్యోతి గోధుమ రవ్వ తీసుకురావడానికి దుకాణానికి వెళ్లింది. వారు వచ్చేలోపు కుమారుడు నితీశ్‌ను పిలిచి ఫోన్‌లో గేమ్ ఆడుకొమ్మని చెప్పి గదిలోకి తీసుకెళ్లి గొంతునులిమి చంపేశాడు. మామ మహేశ్‌కు ఫోన్ చేసి భార్యాపిల్లలను హత్య చేశానని చెప్పాడు. మహేశ్, తిలక్ హడావుడిగా ఇంటికి వచ్చేసరికి ముగ్గురు అపస్మారక స్థితిలో ఉన్నారు. కాలనీ అధ్యక్షుడు సాగర్ కారులో ఒవైసీ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. హత్యల అనంతరం సురేందర్ నేరుగా మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. భార్య తనను వేధిస్తుండడం వల్లే హత్య చేశానని, పిల్లలు అనాథలు అవుతారన్న ఉద్దేశంతో వారిని కూడా చంపేశానని పోలీసులకు వివరించాడు. సంఘటనా స్థలాన్ని డీసీపీ వెంకటేశ్వర్‌రావు, ఏసీపీ రవీందర్‌రెడ్డి, డీఐ మధుసూదన్, సీఐ మన్మోహన్, ఎస్ఐ రాఘవేందర్ తదితరులు పరిశీలించారు. కుటుంబ తగాదాల వల్లే ఈ ఘటన జరిగినట్టు తెలుస్తున్నదని పోలీసులు పేర్కొన్నారు. ఇటీవల మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇలాంటి ఘటనలు వరుసగా జరుగుతుండటం స్థానికులను కలవర పెడుతున్నాయి. గతంలో బాలాపూర్‌లోని సాయినగర్‌కాలనీ, జిల్లెలగూడలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయి. ఇది మూడోది.

ఆర్టీసీ బస్సులో అసెంబ్లీకి ఎమ్మెల్యేలు

ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్న మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, అరికెపూడి గాంధీ

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ

కూకట్‌పల్లి/దుండిగల్, నమస్తే తెలంగాణ/హైదర్‌నగర్:

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను తెలుసుకోవడానికి గ్రేటర్ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మంగళవారం బస్సులో అసెంబ్లీ వరకు ప్రయాణించారు. మొదట బాచుపల్లిలో బస్సు ఎక్కిన ఎమ్మెల్యే వివేకానంద్ ప్రయాణికులతో ముచ్చటించారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని భాగ్‌అమీర్ బస్టాప్‌లో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అదే బస్సు ఎక్కారు. ఈ సందర్భంగా వారు బస్టాపుల్లో వేచి ఉన్న ప్రయాణికులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. బస్సు ఎక్కిన తర్వాత తోటి ప్రయాణికులతో ముచ్చటించారు. బస్టాపుల్లో మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్య వేధిస్తున్నట్టు పలువురు ప్రయాణికులు వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బస్టాపుల్లో తాగునీటి వసతి, ఉదయం పూట అధికంగా బస్సు సర్వీసుల నిర్వహణ వంటి అంశాలను తక్షణమే ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చిస్తామని, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రయాణికులు తెలిపిన సమస్యలను పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, రవాణశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం ఆల్ ఇండియా రేడియో బస్‌స్టాప్ వద్ద దిగిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి నడుచుకుంటూ వెళ్లిపోయారు. కాగా, ఎమ్మెల్యే వివేకానంద్ సోమవారం కుత్బుల్లాపూర్ నుంచి బస్సులో అసెంబ్లీకి వెళ్లగా, మంగళవారం కూడా బస్సులోనే వెళ్లారు.



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద్, అరికెపూడి గాంధీ

చౌటుప్పల్‌లో పోలీసుల కార్డన్‌సెర్చ్

- డీసీపీ ఆధ్వర్యంలో రెండు గంటలపాటు తనిఖీలు
- సరైన పత్రాలు లేని వాహనాలు, అరకిలో గంజాయి స్వాధీనం



కాలనీవాసుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీసీపీ రామచంద్రారెడ్డి

చౌటుప్పల్ క్రైం: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలకేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. భువనగిరి డీసీపీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్సైలు, సిబ్బంది కలిసి 150 మంది పోలీసులు రెండు గంటలపాటు తనిఖీలు చేశారు. ముందుగా వారు మండల కేంద్రంలోని మైత్రి ద్వారక టౌన్‌షిప్‌లో క్యాంప్ ఏర్పాటు చేసుకున్నారు. పది బృందాలుగా విడిపోయి.. చౌటుప్పల్‌లోని చిన్నకొండూర్ రోడ్‌లో ఉన్న శివాజీనగర్, బూడగ జంగాల కాలనీల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల వరకు తనిఖీలు జరిగాయి. దాదాపు150 ఇండ్లల్లో సోదాలు చేశారు. కుటుంబ సభ్యులను నిద్రలేపి వివరాలు సేకరించారు. ఆధార్ కార్డులను పరిశీలించి సరిచూసుకున్నారు. ఇండ్లలో, కాలనీలోని రోడ్లపై ఉన్న వాహనాల గురించి ఆరా తీశారు. వాటి పత్రాలను తెప్పించుకొని పరిశీలించారు. డాక్యుమెంట్లు సరిగా లేని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చిన్నకొండూరు రోడ్‌లోని హైస్కూల్ వద్ద రోడ్డుపై తనిఖీలు చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి వచ్చి పోయే వాహనాల వివరాలను ఆరా తీశారు. సోదాల్లో సరైన పత్రాలు లేని 42 ద్విచక్రవాహనాలు, ఒక కారు, మూడు ఆటోలు, 500 గ్రాముల గంజాయి, రెండు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వాటన్నింటినీ మైత్రి టౌన్‌షిప్‌కు తరలించారు. ఇంటింటి తనిఖీల్లో మూడు బెల్ట్‌షాప్‌లను గుర్తించి ముగ్గురు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్టు తెలిపారు. బైక్ దొంగతనాలు, గంజాయి వంటి మత్తుపదార్థాల రవాణా, బెల్ట్‌షాప్‌ల నిర్వహణ వంటి నేరాలకు పాల్పడేవారిని గుర్తించడంతోపాటు, ఎవరైనా నేరస్థులు తలదాచుకుంటున్నారా? తెలుసుకునేందుకే తనిఖీలు చేపట్టామన్నారు. అలాంటివారిని అదుపులోకి తీసుకొని శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు. తనిఖీలకు కాలనీలవాసులు సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఏసీపీ ఆర్ రమేశ్, యాదాద్రి ఏసీపీ శ్రీనివాసాచార్యులు, చౌటుప్పల్ సీఐ వెంకటయ్య, ఎస్సై సాయిలు, పలు పీఎస్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

గంటన్నరలో డీఎన్‌ఏ రిపోర్టు

త్వరలో ఎఫ్ఎస్ఎల్‌కు కొత్త డీఎన్‌ఏఐ, సాంకేతిక పరికరాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నుంచి ప్రస్తుతం నివేదిక రావడానికి రెండురోజులు పడుతుండగా, 90 నిమిషాల్లోనే నివేదిక వచ్చేలా ఆధునిక సాంకేతిక పరికరాలను సమకూర్చుకోనున్నట్టు పోలీసు అధికారులు వెల్లడించారు. ఎఫ్ఎస్ఎల్‌ను టెక్నాలజీపరంగా ఆధునీకరించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చిన్న కేసు దర్యాప్తులో సైతం ఎఫ్ఎస్ఎల్ నివేదిక కీలక భూమిక పోషిస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా అధికారులు ల్యాబ్‌ను తీర్చిదిద్దేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే డీఎన్‌ఏ ఐడెంటిఫికేషన్ పరికరం మొదలు, ఇతర అన్నిరకాల సాంకేతిక పరికాల కొనుగోలుకు సిద్ధమవుతున్నారు. కొన్ని పరికరాలు దేశంలోనే లభిస్తుండగా.. డీఎన్‌ఏ ఐడెంటిఫికేషన్ వంటి పరికరాలను విదేశాల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. డీఎన్‌ఏ యంత్రాలను సరఫరా చేసే సంస్థల నుంచి టెండర్లను కూడా ఆహ్వానించారు. వీటిని రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 1998లో కొనుగోలు చేసిన యంత్రాలతోనే రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ పనిచేస్తున్నది. కాలంచెల్లిన పాత యంత్రాలు, పరికరాలు కావడంతో కేసుల విచారణకు సంబంధించిన నివేదికలను దర్యాప్తు అధికారులకు అందజేయడంలో ఆలస్యమవుతున్నది. ఈ ఆలస్యం ప్రభావం కేసు దర్యాప్తుపై పడుతున్నది. ఈ విషయంపై ఎఫ్ఎస్ఎల్ నిపుణులు, పోలీసు అధికారులు పలు దఫాలుగా సమావేశమై, కొత్త యంత్రాలు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దాదాపు పది కంపెనీల డీఎన్‌ఏ ఐడెంటిఫికేషన్ యంత్రాలను పరిశీలించిన అధికారులు మూడు కంపెనీల యంత్రాలు బాగున్నట్టు గుర్తించారు. ఈ మూడు విదేశీ కంపెనీల నుంచి టెండర్లను కూడా ఆహ్వానించారు. వాటిని మరోసారి పరిశీలించాల్సి ఉన్నదని అధికారులు తెలిపారు. ఇతర సాంకేతిక అంశాలు, పరికరాలపై కూడా పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు చర్చిస్తున్నారు. కొత్త యంత్రాలతో దర్యాప్తులో వేగం పెరుగుతుందని వివరించారు.

కొమురవెల్లి మల్లన్న హుండీ ఆదాయం 73.50 లక్షలు

చేర్యాల, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామివారి ఆలయంలో హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. స్వామివారి ఖజానాకు 27 రోజుల్లో రూ.73,50,909 ఆదా యం సమకూరింది. నగదుతోపాటు 125 గ్రాముల మిశ్రమ బంగారం, 11.70 కిలోల వెండి, 21.25 క్వింటాళ్ల బియ్యం, 83 విదేశీ కరెన్సీ నోట్లు, రద్దు చేసిన నోట్లు రూ.83,500 లభించినట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎం రామకృష్ణారావు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది, అర్చకులు, రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన సత్యసాయి సేవా సమితి, శ్రీరామకృష్ణ భజన మండలి భక్తులు 130 మంది పాల్గొన్నారు.



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

నమస్తే తెలంగాణ
జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
బుధవారం 21 మార్చి 2018
WWW. NTNEWS.COM

గంటలో యాప్ చేసిస్తాం

ఆకలేసిన అరగంటలో పొయ్యి ముట్టియ్యకుండానే పల్లెంలో బిర్యానీ రెడీగా ఉంటుంది. సొంత కారు లేకపోయినా సరే.. ఎక్కడికైనా వెళ్లాలంటే ఐదే ఐదు నిమిషాల్లో ఇంటి ముందు కారు మనకోసం వెయిట్ చేస్తుంది.. చేరాలనుకున్న గమ్యానికి చేర్చుతుంది. మెడికల్ సేవలు కావాలన్నా, ప్రయాణాలు కన్ఫర్మ్ చేసుకోవాలన్నా, కొత్త ప్రదేశాల గురించి తెలుసుకోవాలన్నా ఏం చేయాలన్నా వేలికొసల మీద పొందే సదుపాయం టెక్నాలజీ మనకు కల్పించింది. అందులో యాప్‌ల పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. అలాంటి యాప్‌ల క్రియేషన్‌లో గంటలో యాప్ రూపొందిస్తామంటున్నారు ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్ సంస్థవారు. ఆ సంస్థను ముందుకు నడిపించడంలో వెనుకుండి కీలకపాత్ర పోషిస్తున్న అనసూయ అకిల్ల పరిచయం.



మనకే అవసరం అనుకుంటే.. మనం మాత్రమే బాగుపడేలా.. మనకు మాత్రమే ఉపయోగపడేలా ఏదో ఒకటి చేస్తాం. కానీ ప్రస్తుతం మార్కెట్లో ఏది అవసరం? ఏం చేస్తే జనాలకు, మనకు ఇద్దరికీ ఉపయోగపడుతుంది? సేవలు చేసే ప్రొడక్ట్ తయారుచేద్దామా? సేవలు విస్తృతం చేసే ప్రొడక్ట్ చేద్దామా? అని ఆలోచించే వారు చాలామందే ఉన్నారు. ఇప్పుడున్న ట్రెండ్‌లో ఏం చేయాలన్నా యాప్ అవసరం. కూర్చున్నచోట నుంచే ఏ సేవలు కావాలన్నా దాని ద్వారా రప్పించుకుంటున్నారు. అందుకే యాప్ క్రియేషన్ రంగం విజయవంతంగా దూసుకుపోతున్నది. అనసూయ అకిల్ల.. ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్ పేరుతో ఇప్పటికే ఎన్నో ప్రముఖ సంస్థలకు వారి అభిరుచికి తగ్గట్టు యాప్‌లు తయారుచేసి ఇచ్చారు. ఇప్పటికీ ఇస్తున్నారు. అసలు అనసూయ ఈ రంగం వైపు అడుగులు వేసిన సందర్భం విచిత్రంగా జరిగింది.

అదెలా అంటే..

దాదాపు పదేళ్లుగా అందరూ ఆరోగ్యం గురించి ఆలోచిస్తున్నారు. ఆరోగ్యం బాగుండాలంటే ప్రకృతిని కాపాడుకోవడం, ప్రకృతిని ఫాలో కావడం మాత్రమే అని అర్థం చేసుకున్నారు. ఈ క్రమంలోనే అందరూ సేంద్రీయ ఆహారం వైపు మొగ్గు చూపారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న అనసూయ 2008లోనే 'నేచర్‌ట్రీట్' పేరుతో ఆర్గానిక్ స్టోర్ ఏర్పాటు చేసి సేంద్రీయ అల్పాహారాన్ని తయారుచేయడం మొదలుపెట్టింది. ఆ తర్వాత కొన్నిరోజులు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు లంచ్, డిన్నర్, సప్లిమెంట్స్ కూడా తయారుచేసి అమ్మేది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న క్రమంలో అనసూయ పెళ్లయింది. ఆ తర్వాత మొదలుపెట్టిన నేచర్‌ఫుడ్ కాన్సెప్ట్ బాగా పాపులర్ అయింది. అనసూయ భర్త రామ మోటోరోలా కంపెనీలో ఆర్కిటెక్చర్. ఆయన ప్రతిరోజూ ఆఫీస్ వర్క్ అయిపోయిన తర్వాత పోకర్ గేమ్ ఆడేవారు. ప్రతిసారీ.. కదులుతూ గేమ్ ఆడాల్సి రావడం గమనించింది అనసూయ. అలా కాకుండా ఒక చోట కూర్చుని వాయిస్ కమాండ్స్ ఇస్తూ.. గేమ్ ఆడితే ఎలా ఉంటుంది? అనే ఆలోచన వచ్చింది ఆమెకు. వెంటనే తన ఆలోచనకు కాస్త క్రియేటివిటీ జోడించి వాయిస్ బేస్డ్ పోకర్ గేమ్ క్రియేట్ చేసింది. అది రామను బాగా ఇంప్రెస్ చేసింది. కొద్దిరోజుల తర్వాత ఆ యాప్‌ని ఇద్దరూ కలిసి యూఎస్ కంపెనీకి అమ్మేశారు. ఆ డబ్బుతో ఏదైనా చేద్దామని ఆలోచించింది అనసూయ.

అడుగు పడింది..

ఏదైనా చేయాలంటే ముందు ఎంతో కొంత తెలిసుండాలి. కాస్తో కూస్తో అనుభవం ఉండాలి. అందుకే కొంతమంది ఫ్రెండ్స్‌తో కలిసి ఫ్రేమ్‌వర్క్ కంపెనీలో పనిచేసింది. అక్కడ అనసూయ పాత్ర టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్. అక్కడ టెక్నికల్ పార్ట్‌నర్‌గా తనేంటో నిరూపించుకుంది. ఈ క్రమంలో 2011లో అనసూయ భర్త రామ మోటోలో ఉద్యోగం వదిలేశాడు. వాయిస్ బేస్డ్ పోకర్ గేమ్ యాప్ అమ్మిన డబ్బుతో 'ఆన్‌గో' పేరుతో ఓ స్టార్టప్ మొదలుపెట్టారు. అందులో మొబైల్ యాప్స్, 360 డిగ్రీల టెక్ డెవలప్స్, గంటలో యాప్ డిజైన్ చేయాలన్న కొన్ని కాన్సెప్టులతో పనిచేశారు. ఒక ఆఫీస్ పెట్టి స్టార్టప్‌కి అంకురార్పణ చేశారు. కంపెనీ నిలదొక్కుకోవడానికి కనీసం ఐదేళ్లు పడుతుందని ముందే మానసికంగా ప్రిపేర్ అయ్యారు. కొద్దిరోజుల తర్వాత ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. అయినా ఏమాత్రం నిరాశ పడలేదు. ఇద్దరూ కష్టపడితే, కాస్త ఆలోచిస్తే కంపెనీని నిలబెట్టడం కష్టమేం కాదని భావించారు. టీమ్‌మెంబర్స్, జీతాలు, కస్టమర్లను కాపాడుకోవడం, ఆఫీస్ మెయింటెనెన్స్, డెవలప్‌మెంట్ ఇవన్నీ చాలెంజింగ్‌గా కనిపించాయి. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి చెరిసగం బాధ్యతను పంచుకున్నారు. హ్యూమన్ రిసోర్సెస్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ బాధ్యత అనసూయ తీసుకుంది. మార్కెటింగ్, కస్టమర్ సపోర్ట్ వంటివి రామ తీసుకున్నాడు. 2015 కల్లా కంపెనీ నిలదొక్కుకుంది.

సక్సెస్ మంత్రం.. విజయమార్గం..

ఎవరికి మన ప్రొడక్ట్ అమ్మాలనేది డిసైడ్ అయితే వ్యాపారంలో సగం విజయం సాధించినట్టే. ఆ దిశలో కూడా వినూత్న నిర్ణయం తీసుకున్నారు ఈ దంపతులు. బిజినెస్ టు బిజినెస్, బిజినెస్ టు రిక్రూట్‌మెంట్ ఈ రెండు రంగాలకు తమ ప్రొడక్ట్ అమ్మాలనుకున్నారు. ఆ నిర్ణయం ఫలితంగా ఎటు నుంచి ఎటు వెళ్లినా తమ ప్రొడక్ట్‌కి మాత్రం డిమాండ్ తగ్గదు. ఈ సూత్రం ఫాలో అవుతూ ఇండియాలో బెస్ట్ స్టార్టప్‌గా నిలువడానికి ప్రయత్నం చేస్తున్నారు వీరు. హైసా (HYSEA) వేడుకల్లో బెస్ట్ ప్రొడక్ట్ ఆఫ్ 2016 అవార్డును కేటీఆర్ చేతుల మీదుగా అందుకున్నారు. దేశవ్యాప్తంగా 20 బెస్ట్ కంపెనీలలో ఎంటర్‌ప్రైజ్ మొబిలిటీ ప్రొవైడర్స్‌గా మంచి గుర్తింపు సంపాదించారు. ఐబీఎం ప్రకటించిన స్మార్ట్ అవార్డుల్లో 2016కు గానూ స్మార్ట్ కంపెనీ అవార్డు అందుకున్నారు.



టెక్నాలజీని విస్తరిస్తాం..

డిజిటల్ తెలంగాణ పేరుతో తెలంగాణ ప్రభుత్వం మహిళలకు, యువ పారిశ్రామికవేత్తలకు మంచి ప్రోత్సాహం అందిస్తున్నది. ప్రతీ బిజినెస్‌కి టెక్నాలజీని విస్తరించాలనేది మా ప్రయత్నం. దానికి అవసరమైన టెక్నాలజీ, ఫ్రేమ్‌వర్క్ మా దగ్గర ఉంది. ఈ రోజుల్లో ఇంటర్నెట్ ఎంత అవసరమో, యాప్ కూడా అంతే అవసరం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఆధారంగా ఎంటర్‌ప్రైజ్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్స్ రంగంలో నెంబర్ వన్‌గా నిలువాలన్నది మా లక్ష్యం. ఆ దిశగా మా ప్రయత్నాన్ని కొనసాగిస్తాం.

– అనసూయ అకిల్ల, ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్ ఫౌండర్

కొత్త ప్రయత్నం..

గంటలో కస్టమర్‌కి కావాల్సిన యాప్ క్రియేట్ చేసి ఇవ్వడంలో మంచి అనుభవం సంపాదించారు. కానీ మార్కెటింగ్ చేయడం ఎలా? ఈ విషయమై అనసూయ, రామ అందరిలా కాకుండా కాస్త కొత్తగా ఆలోచించారు. మార్కెటింగ్ మీద ఖర్చు పెట్టడం కంటే కస్టమర్లను మన ప్రొడక్ట్స్‌తో సంతృప్తి పరిస్తే అదే ప్లస్ పాయింట్ అవుతుంది అనుకున్నారు. ఇందుకోసం రెండు టీమ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఒకటి టెక్నికల్ డెవలపర్స్, రెండు ప్రొడక్ట్‌ని వాడుకలోకి తీసుకెళ్లే టీమ్. ఈ రెండు టీమ్‌లతో సమర్థంగా పనిచేయించి అనుకున్నది సాధించారు. కస్టమర్‌ని ప్రొడక్ట్ వాడేలా చేయడం ఎలా? యాప్ వాడటంలో వారు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు? వారికి ఇంకా ఏం కావాలి వంటి అంశాల మీద దృష్టి పెట్టారు. వారానికోసారి కస్టమర్‌కి కాల్ చేసి వారి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వారిచ్చే సలహాలు, వారి డిమాండ్స్‌కి అనుగుణంగా యాప్స్ తయారు చేయడం, డెవలప్ చేయడం, అప్‌డేట్ వర్షన్లు రూపొందించడం చేశారు. 2015 వరకు పరిస్థితి అంతంత మాత్రంగానే కొనసాగింది. కానీ ఇప్పుడు వారికి 700పైగా కస్టమర్లున్నారు. అందులో మెజారిటీ కస్టమర్లు అప్పటికే ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్ తయారుచేసిన యాప్ వాడుతున్న కస్టమర్లు రిఫర్ చేసిన వారే కావడం విశేషం. ఒకప్పుడు ఒక యాప్ క్రియేట్ చేయాలంటే, చేయించుకోవాలంటే లక్షల్లో ఖర్చయ్యేది. కానీ వీళ్లు మాత్రం ఆ ఖర్చును వేలల్లోకి తగ్గించారు. కస్టమర్‌కి అనుకూలంగా ఉండే బడ్జెట్‌లోనే, ఆర్డర్ చేసిన అరగంటలో యాప్ క్రియేట్ చేసి ఇస్తున్నారు. ఇలా రోజుకు కనీసం పన్నెండు నుంచి పదిహేను యాప్స్ క్రియేట్ చేస్తున్నారు వీళ్లు. కంపెనీలో 30 శాతం మంది ఉద్యోగులు మహిళలే. ఇద్దరితో మొదలుపెట్టి ప్రస్తుతం 74 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

50యేండ్లుగా సేవలు చేస్తున్నది!

కస్తుర్బా గాంధీ నేషనల్ ట్రస్ట్‌కి ట్రస్టీ శోభనా రాండే! ఆమె 50యేండ్లుగా జీవితాన్ని ఆ ట్రస్ట్‌కే ధారపోస్తున్నది. మహిళా సాధికారత, అభివృద్ధి, సమానత్వం, విద్య గురించి పోరాడుతున్నది.



శోభనా రాండే.. మహిళల కోసం, పిల్లల కోసం ఐదు దశాబ్దాలుగా పోరాడుతూనే ఉంది. గాంధీతత్వాన్ని ఇష్టపడే ఆమె దేశ సేవకు ఆమె జీవితాన్ని అంకితం చేసింది. 1979లో గాంధీ నేషనల్ మెమోరియల్ సొసైటీకి ప్రాతినిధ్యం వహించింది. పుణేలోని అగఖాన్ ప్యాలెస్‌లో నేషనల్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్‌లో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ట్రెయినింగ్ ఇచ్చింది. ఈమె మహాత్మాగాంధీ చేసిన క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా వలంటీర్‌గా పనిచేసింది. అప్పటి నుంచే గాంధేయవాదిగా మారి దేశ సేవ చేస్తుంది. 1955లో అస్సోంలో 'శిశు నికేతన్' అనే మొదటి పిల్లల వెల్ఫేర్ సెంటర్‌ని మొదలు పెట్టిన ఘనత ఆమెకే దక్కుతుంది. నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని గిరిజన గ్రామాల్లో తిరిగి మహిళా అభివృద్ధి కోసం కృషి చేసింది. అక్కడి వారికి కుట్లు, అల్లికల్లో శిక్షణనిప్పించింది. ఇప్పుడున్న ట్రస్ట్ ఆఫీస్ పుణే దగ్గర్లోని సస్వాద్‌లో ఉంది. అది 11 ఎకరాల స్థలం మధ్యలో ఉంది. ఇందులో ఆరు ఎకరాలు వ్యవసాయానికి, మిగిలిన ఐదు ఎకరాల్లో ఆశ్రమానికి సంబంధించిన పనులు చేసుకోవడానికి అనువుగా ఉంచారు. ఈ ఆశ్రమంలో బేకరీ, టైలరింగ్.. ఇలా అనేక శిక్షణలు ఇప్పిస్తూ వారికి ఉపాధి మార్గాన్ని చూపిస్తున్నది రాండే. ఇన్ని సేవలు చేస్తున్న ఈమెకు ఎన్నో అవార్డులు దక్కాయి. కేంద్ర ప్రభుత్వం పద్మ భూషన్ అవార్డు ఇచ్చి ఈమెను సత్కరించింది.

'దోస'తో దోస్తీ చేయండి!

సమ్మర్ అనగానే మనందరికీ గుర్తొచ్చేది కీరదోస. దోస జాతిలో ఉండే దోస, కీరదోస రెండూ మన శరీరానికి మేలు చేస్తాయి. సమ్మర్‌లో దోసతో దోస్తీ చేస్తే ఈ లాభాలు పొందొచ్చు.

- దోసలో ఉండే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
- శరీరంలోని వేడిని తగ్గించడంలో దోసను మించిన మందు లేదు.
- కళ్లకింద నల్లటి చారలను కీర దోసతో ఈజీగా తొలగించవచ్చు.
- వేడి చేసి కళ్లు ఉబ్బినా, మండినా కీరదోసను గుండ్రంగా కట్ చేసి కళ్ల మీద పెట్టుకుంటే ఉపశమనం లభిస్తుంది.
- కీరదోసలో ఉండే సల్ఫర్, సిలికాన్ కురులకు ఆరోగ్యాన్నిస్తాయి.
- కీరదోస జ్యూస్ కడుపులో మంట, అజీర్తి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.





చాలామంది మహిళలు నల్లబడ్డ మోచేతులను దాచుకోడానికి ఫుల్‌హ్యాండ్స్ డ్రెస్సులు ధరిస్తుంటారు. అయితే దీనికో సొల్యూషన్ ఉంది. నల్లబడ్డ మోచేతి భాగాలను ఇంట్లోనే స్వయంగా తిరిగి సాధారణ చర్మంలా మారేలా చేయొచ్చు.

మోచేతులు నల్లబడుతున్నాయా?

- శరీరంలోని వేడిని తగ్గించి, శరీరాన్ని చల్లబరిచే గుణం కలబందలో ఉన్నది. కొద్దిగా అలోవేరా జెల్ తీసుకొని నల్లబడ్డ చర్మం మీద రాసి 20 నిమిషాల పాటు అలాగే ఉండనివ్వాలి. ఆ తర్వాత నీటితో శుభ్రంగా కడిగేయాలి. ఇలా రెగ్యులర్‌గా కొన్నిరోజులు చేస్తే నల్లబడ్డ చేతులు తిరిగి మామూలు స్థితికి వచ్చేస్తాయి.
- ఒక వంతు నీరు, మూడు వంతుల బేకింగ్ సోడాతో కలిపి మెత్తటి పేస్ట్ తయారు చేయాలి. రోజుకు రెండుసార్లు నల్లబడ్డ చర్మభాగం మీద రాస్తే కొద్ది రోజుల తర్వాత ఫలితం కనిపిస్తుంది.
- నల్లబడ్డ చర్మాన్ని తిరిగి మామూలు స్థితికి తీసుకురావడానికి కొద్దిగా నిమ్మరసాన్ని ఆ ప్రదేశంలో రాయాలి. కనీసం 10 నుంచి 15 రోజులు ఇలా చేస్తే నల్లబడ్డ చర్మం మాత్రమే కాదు.. మిగతా చర్మం కూడా తాజా నిగారింపును సంతరించుకుంటుంది.
- చక్కెర, ఆలీవ్ ఆయిల్ సమభాగాలుగా రెండింటిని మెత్తగా అయ్యేంత వరకు బాగా కలుపాలి. ఆ పేస్ట్‌ను నల్లబడ్డ శరీర భాగాలకు రాసి 10 నిమిషాల తర్వాత కడిగేయాలి.
- రోజుకోసారి బాదం నూనె చర్మానికి రాస్తే తగిన ఫలితం ఉంటుంది. చర్మానికి మెరుపునిచ్చే గుణాలు బాదం నూనెలో పుష్కలంగా ఉంటాయి.
- ఆలుగడ్డలు ఉడికించి మిక్సీ పట్టాలి. ఆ మిశ్రమాన్ని నల్లబడ్డ శరీర భాగాల మీద రాసి, కొద్దిసేపటికి కడిగేయాలి. ఆలూ చర్మం మీద పేరుకుపోయిన మృతకణాల్ని వేగంగా తొలగించి చర్మానికి నిగారింపును ఇస్తుంది.

ఊరంతా 'శోభా'యమానం!


ఎవరైనా తమ ఇంటిని కళకళలాడాలని చూస్తారు. కానీ ఈమె ఊరంతా పచ్చదనంగా వెలిగిపోవాలని ఆశిస్తున్నది. ఇంటి పెరడునే కాదు.. రోడ్డు పక్కన పూల మొక్కలను పెంచుతూ అవార్డులను అందుకుంటున్నది.

ఇల్లు బాగుండాలనుకుంటారు చాలామంది. ఆ తర్వాతే దేని గురించైనా ఆలోచిస్తారు. కానీ శోభనా పుష్పాంగధన్ అలా కాదు. త్రిశూర్‌లోని అంచేరిలో నివాసముండే ఈమె పెరట్లోకి, డాబా మీదకు వెళ్లి చూస్తే ఎన్నో కూరగయలు, పూల మొక్కలు దర్శనమిస్తాయి. చిన్నప్పటి నుంచి ప్రకృతి మీద ప్రేమతో ఈమె ఇవన్నీ చేస్తున్నది. అయితే తన చుట్టు పక్కన ఉన్నవాళ్లు ఇలా చెట్ల గురించి ఆలోచించకపోవడంతో వారి ఇంటి ముందు స్థలంతో తానే స్వయంగా చెట్లను నాటింది. ఇలా ఎవరి ఇంటి ముందు చెట్లు లేకపోయినా అక్కడికి వెళ్లి అక్కడ మొక్కలు నాటడం ప్రారంభించింది. ఇది గమనించిన ఒక న్యూస్‌పేపర్ వాళ్లు ఆమె గురించి ఆర్టికల్ పేపర్‌లో ప్రచురించారు. దాంతో ఆమె మరింత బాధ్యతగా మొక్కలను పెంచడం మొదలుపెట్టింది. ఇది గుర్తించిన లష్ వాళ్లు ఆమెకు అవార్డు ఇచ్చి సత్కరించారు. ఇలా మొక్కలతోనే ఈమె బిజీగా ఉంటుందనుకునేరు. ఈమె ఇద్దరు పిల్లల తల్లి. కుటుంబాన్నే కాదు.. వ్యాపారి వ్యవసాయి ఎకోపానా సమితికి జనరల్ సెక్రటరీగా పనిచేస్తుంది. అలాగే ఆక్సిడెంట్ కేర్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్(యాక్ట్)లో కూడా మెంబర్. ఈ పనులతో పాటు మొక్కలను పెంచడం చేస్తున్నది.




మా నాన్న వయసు 60 సంవత్సరాలు. ఊపిరితిత్తుల్లో క్యాన్సర్ నిర్ధారణ జరిగింది. 3 నెలలుగా చికిత్స కొనసాగుతున్నది. ఇప్పుడు రేడియేషన్ థెరపీ అవసరమని అంటున్నారు. రేడియేషన్ థెరపీ అంటే ఏమిటి? క్యాన్సర్ చికిత్సలో ఇది తప్పనిసరిగా చేయించుకోవాలా? దయచేసి వివరంగా తెలియజేయండి.

కె. ఆంజనేయులు, వనస్థలిపురం



క్యాన్సర్ అంటే రేడియేషన్ తప్పదా?

క్యాన్సర్ కణితిని గుర్తించిన తర్వాత దాన్ని తొలగించడానికి శస్త్రచికిత్స అవసరమవుతుంది. ఆ తర్వాత తిరిగి క్యాన్సర్ అభివృద్ధి చెందకుండా ఉండేందుకు, నొప్పి వంటి ఇతర క్యాన్సర్ లక్షణాల నుంచి ఉపశమనం కలిగించేందుకు రేడియేషన్ థెరపి లేదా రేడియో థెరపీని ఉపయోగిస్తారు. కొన్ని సందర్భాల్లో క్యాన్సర్ శస్త్ర చికిత్సకు ముందు రేడియేషన్ థెరపీ చేస్తారు. ఇది క్యాన్సర్ కణితి ముడుకుపోయేందుకు తోడ్పడుతుంది. అందువల్ల కణితి తొలగింపు ప్రక్రియ సులభమవుతుంది. అవసరాన్ని బట్టి రేడియేషన్ థెరపీని వాడుతుంటారు. ఊపిరితిత్తుల క్యాన్సర్లలో కీమోథెరపీతో పాటు కొన్నిసార్లు రేడియేషన్ అవసరం అవుతుంది. శ్వాసకోశాల్లోని క్యాన్సర్ గడ్డ ఛాతి భాగాన్ని దాటి విస్తరించకుండా ఉన్న సందర్భాల్లో శస్త్ర చికిత్స చేసి గడ్డను తొలగించి వేయడం మందులు వాడడంతోపాటు రేడియేషన్ థెరపిని ఉపయోగించడం ద్వారా మంచి ఫలితాలు సాధించడానికి వీలవతుంది. దీని వల్ల క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు విస్తరించకుండా సమర్థవంతంగా అరికట్టగలుగుతారు. అదే సమయంలో శస్త్ర చికిత్స కీమోథెరపీ తర్వాత క్యాన్సర్ కణాలు తిరిగి రాకుండా నిరోధించడానికి వీలవుతుంది. వైద్యనిపుణులు జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత మీ నాన్నకు రేడియేషన్ థెరపీని కూడా సిఫారసు చేసి ఉంటారు. కంగారేమీ లేదు. తప్పకుండా పూర్తిస్థాయిలో చికిత్స తీసుకోండి.



డాక్టర్ ఎం. జగన్మోహన్ రెడ్డి
సీనియర్ రేడియేషన్ అంకాలజీ
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

నమస్తే తెలంగాణ
యువ
[హైదరాబాద్]
బుధవారం 21 మార్చి 2018


లక్కీ ఛాన్స్.. సుశాంత్‌తో రొమాన్స్!

సినిమా పరిశ్రమలో అంతే.. రాత్రికి రాత్రే స్టార్ అయిపోతారు. ఒక్క చాన్స్ అంటూ వెతికిన వాళ్లు ఒక్కక్షణం కూడా తీరిక లేకుండా బిజీ అవుతారు. అందుకు టాలెంట్‌తో పాటు కొంత లక్ కూడా ఉండాలి. సంజనా సంఘీకి ఆ రెండూ ఉన్నాయి. అందుకే స్టార్ అయింది. ఎవరీ సంజనా సంఘీ.. ఏంటా బ్రేక్ అనుకుంటున్నారా? ఆమె గురించి ఆసక్తికరమైన సమ్‌గతులు..



- మూడు సినిమాల్లో చిన్నాచితక పాత్రలు వేసి ఇప్పుడు బాలీవుడ్‌లో హీరోయిన్‌గా చాన్స్ కొట్టేసింది.
- తను నటించిన సినిమా త్వరలో విడుదల కానున్నది. ఆ సినిమాలో కూడా సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌కు జోడిగా నటిస్తుంది.
- పద్నాలుగేళ్లప్పుడే రాక్‌స్టార్ సినిమాలో నర్గీస్ ఫక్రీకి చెల్లెలుగా సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌కి జంటగా నటించింది.
- డాబర్ ఆల్మండ్ హెయిర్ ఆయిల్, సబ్‌వే, తనిష్క్, కోకాకోలా వంటి బ్రాండ్‌లకు సంబంధించిన యాడ్‌లలో నటించింది.
- ఢిల్లీలోని ఎల్‌ఎస్‌ఆర్ కాలేజ్ నుంచి డిగ్రీ పట్టా అందుకున్నది.
- ట్రావెలింగ్, ఫుడ్ అంటే ఇష్టపడే సంజనా యూత్‌కి ఆవాజ్ అనే మీడియా సంస్థకు రైటర్‌గా పనిచేసింది.
- మీటా 2017 హిందీ మీడియం, కట్టే ఫర్కీ వంటి వెబ్‌సిరీస్‌లలో నటించింది.
- 21 సంవత్సరాలకే హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తూ అంచనాలను పెంచేసింది.
- సినిమాకు సంబంధించిన ప్రకటనలను సుశాంత్, సంజనా ఇద్దరూ ట్వీట్ చేసి కన్‌ఫామ్ చేశారు.

ఎరుపు ట్రెండ్.. యమా క్రేజీ!



ఫ్యాషన్‌కు ఇప్పుడు ఎరుపు తోడైంది. గ్రీన్.. బ్లూ ట్రెండ్‌లను దాటేసి ఈ ఎరుపు ట్రెండ్ యమ క్రేజీగా మారుతున్నది. రెట్టింపు అందానికి.. ఆకర్షణకు తోడుగా నిలుస్తూ ఫ్యాషన్ ప్రపంచంలో ఫేవరెట్‌గా మారుతుంది. మెరుపుతో పాటు ఫ్యాషన్‌లో మెరిట్‌ను కూడా తీసుకొస్తున్నది.

ఫ్యాషన్‌కు ఊపు రావాలంటే మంచి ప్రదర్శన ఇవ్వాలి. ప్రదర్శన బాగా రావాలంటే మంచి అందంతో మెరువాలి. ఆ మెరుపును అందరూ ఇష్టపడాలంటే మేకప్‌లో కచ్చితంగా ఎరుపుండాల్సిందే అంటున్నారు ఫ్యాషన్ నిపుణులు. 2018వ సంవత్సరపు మేటి ట్రెండ్‌గా దీనిని కొనియాడుతున్నారు. అమ్మాయిలకు అత్యంత ఇష్టమైన మోడలింగ్‌లో మేకప్‌దే ప్రధాన పాత్ర. పెదాలు.. చెంపలు మాత్రమే కాదు ఇప్పుడు నొసలు.. చెవులు.. బుగ్గలాంటి చోట్లా కూడా రెడ్‌ను టచ్‌చేయాల్సిందేనట. దానివల్ల స్పెషల్ లుక్ వస్తుంది. ముఖంలో ఎరుపుతో కూడిన మేకప్‌ను హైలైట్ చేస్తూ అద్దితే అదిరిపోతుంది. సన్నగా ఉండేవారికి.. బుగ్గలు లోపలకు ఉండేవారికి ఈ ట్రెండ్ చాలా అవసరమొస్తుంది. చాలామటుకు వాటిని కవర్‌చేస్తుంది. పైగా ఎలాంటి అతుకుల్లేకుండా చూడ చక్కగా ఉంటుంది. కాబట్టి ఈ యేటి మేటిగా నిలుస్తున్న రెడ్ ట్రెండ్‌ను ఫాలో అయి అందానికి మరింత మెరుగులద్దాలని ఫ్యాషన్ నిపుణులు సూచిస్తున్నారు.

సినిమా ఈజ్.. ఆల్ ఎబౌట్ కనెక్షన్. తెరపై కదిలే చిత్రాలు.. తెర ముందు కూర్చున్న ప్రేక్షకున్ని కదిలించాలి. ఆ పాత్రలతో కనెక్ట్ అవ్వాలి. నీదీ నాదీ ఒకే కథ అంటూ.. ప్రేక్షకులను టైటిల్ తోనే కనెక్ట్ చేసిన ఈ కథ.. ఏ ఇద్దరిదో కాదు.. మన అందరి కథ. మన పక్కింటి అబ్బాయి కథ.. ఎదురింటి అమ్మాయి కథ. చదువు పూర్తయ్యాక.. జీవితంలో సెటిలవ్వడానికి మధ్యన ప్రతి యువకుడూ పడే వ్యథ ఇది. ఈ ఫేజ్‌లో ఒక్కొక్కరి స్థితి ఒక్కోలా ఉంటుంది, కానీ అందరిదీ ఒకే పరిస్థితి. యువతలో 80 శాతం మంది తమకోసం కాకుండా.. జీవితంలో రాజీపడి ఇతరుల కోసం బతుకున్నారు. అదీ.. అయినవాళ్ల ఆనందానికి, సంపాదనకు ముడి పెట్టడం వల్లే. 'అసలు ఆనందం అంటే ఏమిటి? మంచి ఉద్యోగం సంపాదించడమా? లక్షలు కూడబెట్టడమా? నచ్చినట్లు బతకడమా?'.. అంటూ సోకాల్డ్ మిడిల్ క్లాస్ మైండ్‌సెట్‌ను ప్రశ్నిస్తున్నాడు 'నీదీ నాదీ ఒకే కథ' దర్శకుడు వేణు ఊడుగుల. మొదటి సినిమాతోనే యువతలో ఆసక్తిని రేకెత్తించారీయన. దీంతో యువత ఇప్పుడు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని 'ఏందిరా మీ జనాల గోల?' అంటూ రచ్చ రచ్చ చేస్తూ కొత్త గళం వినిపిస్తున్నది. ఈ నెల 23న 'నీదీ నాదీ ఒకే కథ' సినిమా విడుదల సందర్భంగా ఆ కథ వెనుక కథే.. ఈ కథనం.



నీదీ నాదీ ఒకే కథ.. యువతరం వ్యథ

విజయానికి ఐదు మెట్లు అంటారొకరు. ఆ ఐదు మెట్లు ఎలా ఎక్కాలో మెదడుకు ఎక్కించుకునే ప్రయత్నం చేస్తుంది యువతరం. ఇంతలోనే ఆయనే విజయానికి ఆరో మెట్టు అంటారు. ఇంతకీ విజయానికి ఎన్ని మెట్లు? ఐదా.. ఆరా? అసలు విజయానికి మెట్లుంటాయా? షార్ట్ కట్లుంటాయా? అసలేమిటీ పర్సనాలిటీ డెవలప్‌మెంట్? నిజంగానే పుస్తకాలను చదివి మన పర్సనాలిటీని డెవలప్ చేసుకోవచ్చా?– ఇక్కడ ఎవరో చెప్పిన ఓ మాట గుర్తుకొస్తున్నది.. 'పిల్లల్ని బుద్ధిమంతులుగా పెంచడం ఎలా?' అనే పుస్తకం రాసినాయన కొడుకు బుద్ధిహీనుడయ్యాడట. ఇక్కడ పుస్తకాలను తప్పుపట్టడం లేదు. అందులోని కంటెంట్ గురించే ఈ ప్రశ్న. మన దేశంలో మత ప్రచార పుస్తకాల తర్వాత అంతటి బోగస్ పుస్తకాలు.. ఏవైనా ఉన్నాయంటే అవి వ్యక్తిత్వ వికాస పుస్తకాలే. ఒకరు ఇలా ఉండాలి.. అలా ఉండాలి.. అలా ఉంటేనే విజయం లభిస్తుంది.. ఇలా ఉంటేనే వికాసం వస్తుంది.. అని ఎలా చెప్పగలరు? హౌ? ఈ ప్రపంచంలో ఎవరికి వారూ యునిక్. ఎవరికి వారు ప్రత్యేకం. ఎవరి పర్సనాలిటీ వారికి ప్రత్యేకమైనది. వారి జీవితంలో ఎదురయ్యే వ్యక్తులు, పరిస్థితులే ఆ వ్యక్తిని వికాసం వైపో, వినాశనం వైపో నడిపిస్తాయి.. ఇలాంటి వ్యక్తులను, పరిస్థితులను ఎదుర్కొన్న ఓ యువకుని కథే 'నీదీ నాదీ ఒకే కథ'. తనకు నచ్చినట్లు ఉండలేక, తన వాళ్ల కోసం తన ఇష్టాయిష్టాలను చంపుకోలేక.. మానసిక వ్యథ అనుభవిస్తూ ఆత్మన్యూనతా భావానికి గురై దాని నుంచి ఎలా బయటపడాలో తెలియక తండ్లాడే నీలాంటి యువకుని గాథ. ఇదొక డిఫరెంట్ ఫేజ్. జీవితంలో చదువుకు, స్థిరపడడానికి మధ్య ఉండే ఈ ఫేజ్‌ను ఫేస్ చేయని వారుండరు.. దీన్ని అప్పట్లో అనుభవించిన వారు ఇప్పుడు రాజీ పడి ఎక్కడో అక్కడ స్థిరపడి ఉండొచ్చు. కొందరు ఇప్పుడు ఇదే ఫేజ్‌ను అనుభవిస్తూ ఉండొచ్చు. ఇంకొందరు రేపు ఇదే స్థితిని అనుభవించాల్సి రావొచ్చు. అలాంటి వారిందరికీ కనెక్ట్ అయ్యే, కదిలించే కథ ఇది.

కథకు స్ఫూర్తి

చలం ఒక మాటన్నారు – 'ఆనందం మనిషి హక్కు' అని.. ఈ కథ ఈ మాట నుంచే పుట్టింది అంటాడు వేణు ఊడుగుల. 'నీది నాది ఒకే కథ.. ద్వారా ఈ ఆనందం ఎలా పొందాలో చూపించాం. నిజంగానే పిల్లలకు చదువుపై చాలా ఇష్టం ఉంటే చదివించండి. కానీ చదువు రూపంలో ఎలా తయారు చేస్తున్నారో ఆలోచించుకోవాలి. వాళ్లు రోబోలుగా మారుతున్నారా? వారి సృజనాత్మకత పెంపొందుతున్నదా? అస్తమానం పోటీ పోటీ అని వాళ్లను పొడుస్తున్నారా? అలా చేయడం వల్ల ఏమవుతుంది? అందరి కంటే ముందుండాలి అనే ఒక యాంటీ సోషల్ థాట్ పెరిగిపోయి ముందుండడం అనే పోటీలో పడి ఎమోషన్స్‌ను కోల్పోతుంటారు. ఆ ఇంటెన్షన్ వల్ల ప్రేమ.. మానవీయత కోల్పోయి రోబోల్లాగా తయారవుతున్నారు. పిల్లలు ఏం చేయాలనుకుంటున్నారో అదే చేయనీయండి. ట్యాక్సీ నడుపుకోవాలనుకునేవాన్ని ట్యాక్సీనే నడుపుకోనివ్వాలి. ఇవాళ డ్రైవర్ అయియుండొచ్చు. రేపు ఓనరవుతాడేమో. కొద్దిరోజులకు నాలుగు ట్యాక్సీలు తీసుకుంటాడేమో. మరికొన్ని రోజులకు పదిమందికి ఉపాధినిచ్చే స్థాయికి ఎదుగుతుండొచ్చు కదా. ఎవరికి తెలుసు జీవితం ఎవర్ని ఎప్పుడు ఎక్కడికి తీసుకెళ్తుందో? ఈ మాత్రం దానికి చదువండీ.. అదండీ.. ఇదండీ.. అంత సంపాదించండి.. ఇంత సంపాదించండి అని దొబ్బడమెందుకు? అసలు సంపాదనకు.. ఆనందానికి సంబంధం ఉందా ఎక్కడైనా? ఒకేవేళ ఉంది అనుకుంటే ఇవాళ లక్షలు సంపాదించేవాళ్లు కూడా ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? మనిషికి ఆనందంగా ఉండడమే ముఖ్యం. ఏ మనిషైతే ఆనందంగా ఉంటాడో అతడే జీవితంలో సెటిల్ అయినట్లు లెక్క. లక్షలు కూడబెడితే సెటిల్ అయినట్లు కాదు. ఈ అంశాన్నే చక్కటి భావోద్వేగాలతో చెప్తున్నాం మా సినిమాలో. నా జీవితంలో.. మిగతావాళ్ల జీవితాల్లోంచి పుట్టుకొచ్చిన రియల్ లైఫ్ ఎలిమెంట్ ఇది' అని చెప్పారు వేణు.

సోషల్‌మీడియాలో హల్ చల్

ఈ మధ్యకాలంలో పెళ్లిచూపులు.. అర్జున్‌రెడ్డి లాంటి సినిమాల ద్వారా ప్రేక్షకుల టేస్ట్ మారింది అనే నమ్మకం కలుగుతున్నది. ఆ నమ్మకాన్ని మా సినిమా ఇంకో మెట్టు పైకి తీసుకెళ్తుంది అనడానికి సోషల్‌మీడియానే ఒక ఉదాహరణ. చాలామంది నాన్న ఫీలవుతాడేమో? అమ్మ ఏమనుకుంటుందో ఏమో అని నిజమైన ఎషెన్స్‌ను కిల్ చేసుకొని ఏదో ఒకదాంట్లో కాంప్రమైజ్ అయి బతుకుతుంటారు. ఇష్టంతో చేసే పని చేయించాలి తప్ప.. తమ ఇష్టాన్ని పిల్లలపై రుద్దొద్దు. అందరూ బాగా డబ్బు సంపాదించాలి అంటున్నారు కానీ ఆనందంగా ఎలా బతుకాలో చెప్పడం లేదు? మా సినిమా చెప్తుంది ఇవ్వన్నీ. ఈ పాయింట్‌కు చాలా మంది కనెక్ట్ అయినట్లున్నారు. అందుకే సోషల్‌మీడియా మొత్తం ఈ సినిమాను తమ భుజాలపై వేసుకొని ప్రచారం చేస్తున్నది. ఈ సినిమా పాటలకు కవర్స్ వచ్చాయి, డాన్స్ వీడియోలు వచ్చాయి. కోలాటం, పౌరాణికం లాంటి వివిధ కళారూపాల్లో ఎవరికి వారు ప్రమోషన్ చేస్తున్నారు. కొందరు స్ఫూఫ్‌లు చేస్తున్నారు. ఇంకొందరు మైమ్‌లు చేస్తున్నారు. కొందరు ఫేస్‌బుక్‌లో పోస్టు రాయకపోతే ఏదో మిస్సయిపోతామేమోనని రాసేస్తున్నారు. కొందరు బెస్ట్ విషెస్ చెబుతున్నారు. మొత్తంగా విడుదలకు ముందు సోషల్‌మీడియా ద్వారా సినిమా జనాల్లోకి వెళ్లిపోయినందుకు యూనిట్ హ్యాపీగా ఉంది.

తొలి తెలుగు డోగ్మా 95

నీదీ నాదీ ఒకే కథ.. తెలుగులో డోగ్మా 95 టెక్నిక్‌తో వస్తున్న తొలి సినిమా. ఈ కథ చాలా సహజమైనది. చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఇలాంటి కథను చెప్పడానికి ఎలాంటి టెక్నాలజీ వాడాలని ఆలోచించినప్పుడు డోగ్మా 95 కరెక్ట్ అనిపించింది. ఈ టెక్నిక్ ద్వారా చిత్రీకరిస్తే సహజంగా పక్కింట్లో.. ఎదురింట్లో సంఘటనలు జరిగినట్లు తెరమీద మనకు కనిపిస్తయి. ఎలాంటి క్రేన్స్ ఎక్విప్‌మెంట్స్ వాడలేదు. నీదీ నాదీ ఒకే కథ.. రెగ్యులర్ సినిమా కాదు. అందులో ఉండే ఫైట్లు.. బాంబ్ బ్లాస్ట్‌లు.. ఫారిన్‌లో డ్యూయెట్లు మా సినిమాలో ఉండవు. నీలాంటి నాలాంటి ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన రుద్రరాజు సాగర్ అనే ఒక వ్యక్తి జీవితాన్ని రిప్రెజెంట్ చేసే వాస్తవ కథ. ఒక రకంగా ఇది సినిమా మాత్రమే కాదు, జీవితం కూడా. వాస్తవాన్ని, సహజత్వాన్ని ప్రతిబింబించే సినిమా. 'ఒక ఇండివిడ్యువల్ కథను అనుకున్నది అనుకున్నట్లుగా తీశాం' అని చెబుతున్నారు వేణు ఊడుగుల. మరి కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్నాయా అంటే.. 'అన్ని కథలు కమర్షియలే. సినిమా ద్వారా ప్రేక్షకుడిని నవ్వించడమో.. ఏడిపించడమో లాంటి ఎమోషన్‌కు గురిచేస్తే అది పక్కా కమర్షియల్. ఫైట్లు.. డ్యూయెట్లు మాత్రమే కమర్షియల్ కావు. విదేశాల్లో పాటలు.. విపరీతమైన ఫైట్లు మాత్రం ఉండవు. నీది నాది ఒకే కథ అన్ని ఎమోషన్లను పండిస్తూ పక్కా కమర్షియల్ సినిమాగా నిలుస్తుంది. ఫస్ట్ టైమ్ ఇన్ టాలీవుడ్ డోగ్మా 95 టెక్నిక్ వాడిన సినిమా 'నీది నాది ఒకే కథ' అని గర్వంగా చెప్పుకుంటున్నాం. అని చెప్పారు వేణు.



నీది నాదీ ఒకే కథ.. వర్కింగ్ స్టిల్స్..

నాన్న పైనుంచి ఈ విజయాన్ని చూస్తారు..

- **టీజర్.. ట్రైలర్, సాంగ్స్‌కు సూపర్ రెస్పాన్స్ వస్తున్నది. ఎలా అనిపిస్తున్నది?**
- సూపర్. సినిమాకు ఇంతకంటే రెట్టింపు స్పందనను.. విజయాన్ని తీసుకొస్తుందనే నమ్మకం ఉన్నది. నిజాయితీగా కథ రాసి సెన్సిబిల్‌గా తెరకెక్కిస్తే విజయం వరిస్తుందనే నమ్మకం ఇంకా బలపడింది.

- **సెన్సార్ వాళ్లు కూడా క్లీన్ యూతో బావుందన్నారట.. మీకెలా అనిపిస్తున్నది?**
- సెన్సార్ వాళ్లు చూసి డైరెక్టర్‌ని పిలవండీ అన్నారు. నేను లోపలికి వెళ్లగానే సెన్సార్ పెద్దలు మైండ్ బ్లోయింగ్ అన్నారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా చూడలేదన్నారు. ఒక గంటసేపు మాతోనే ఉన్నారు. అవసరమైతే ప్రెస్‌మీట్ పెట్టి మరీ జనాలకు చెప్తాం ఈ సినిమా చూడమని అన్నారు. ఇలాంటి సినిమా సమాజానికి అవసరం అన్నారు. 80 పర్సెంట్ స్టూడెంట్స్.. పేరెంట్స్‌కు యాప్ట్ అయ్యే సినిమా అన్నారు. క్లీన్ యూ కోసం కొన్ని కటింగ్ చెప్తారనుకున్నా. కానీ అవేవీ లేకుండా క్లీన్ యూ సర్టిఫికేట్ ఇవ్వడం నిజంగా గర్వంగా.. సంతోషంగా ఉన్నది.

- **సినిమా పాటలు కూడా చాలా ప్రత్యేకంగా ఉన్నాయి.. ఈ బ్యూటీ ట్రీట్‌మెంట్ ఎలా సాధ్యమైంది?**
- ప్రతి పాటలో స్వచ్ఛమైన సాహిత్యం ఉంటుంది. ప్రతీ పాటలో కథ నడుస్తుంది. ఏ పాటలో అయితే కథ నడుస్తుందో ఆటోమేటిగ్గా ఆ కథలో విలువలు ఉంటాయి. కథను నడిపించే క్రమంలో ఒక రైటర్‌గా.. డైరెక్టర్‌గా మంచి సాహిత్యం రావడానికి మంచి టీమ్‌ను ఎంచుకున్నాను.

- **యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యే సినిమాలా అనిపిస్తున్నది? మిగతా ప్రేక్షకులు ఈ సినిమాని ఎలా ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నారు?**
- హండ్రెడ్ పర్సెంట్ యూత్‌కు నచ్చే సినిమా. పేరెంట్స్‌కి నచ్చే సినిమా. ఫ్యామిలీ సినిమా. అందరూ చూడాల్సిన సినిమా. ఒక చెల్లె అక్క.. తమ్ముడు.. అన్నా.. అమ్మానాన్నలతో కలిసి చూడాల్సిన అవసరమైన సినిమా. చూస్తారనే నమ్మకం కూడా ఉన్నది. ఇంట్లో ఒక్కరు చూసి ఇంటిల్లిపాదినంతా 'నీది నాది ఒకే కథ'ను చూపించడానికి తీసుకెళ్తారనే నమ్మకం మాకుంది.

- **త్వరలో రిలీజ్.. టెన్షన్‌గా ఉన్నారా? కాన్ఫిడెంట్‌గా ఉన్నారా?**
- టెన్షన్ ఇప్పటివరకూ లేదు. వేరే టెన్షన్లు ఉండొచ్చేమోగానీ సినిమా గురించి అసలు టెన్షనే లేదు. నేనొక్కడినే కాదు యూనిట్ మొత్తం ఎలాంటి టెన్షన్ లేకుండా ఉంది. వందకు వందశాతం ఎఫర్ట్ పెట్టి నిజాయితీగా పనిచేశాం కాబట్టి ఈ కాన్ఫిడెంట్ మాలో ఉన్నది.

- **హీరో శ్రీ విష్ణు గురించి?**
- శ్రీవిష్ణు మంచి నటుడు. గొప్ప వ్యక్తిత్వం గలవాడు. ఆయనకు నటనే కాదు డైరెక్షన్ గురించి తెలుసు. రైటింగ్ తెలుసు. అందుకే కథల్ని ఎంచుకునే క్రమంలో చాలా జాగ్రత్తగా సెలెక్టివ్‌గా ఉంటారు. మెంటల్ మదిలో.. అప్పట్లో ఒకడుండేవాడు.. నీది నాది ఒకే కథ నావెల్టీ బేస్డ్ సినిమాలు ఎంచుకోవడాన్ని బట్టే ఆయన టేస్టేంటో అర్థమవుతుంది.

- **వరంగల్‌లోని ఓ మామూలు గ్రామం నుంచి బిగ్ స్క్రీన్ వరకు.. మీ ప్రస్థానం నాలుగు మాటల్లో?**
- మాది చెన్నారావు పేట మండలం ఉప్పరపల్లి గ్రామం. మూడో తరగతి వరకు అక్కడే చదువుకున్నా. తర్వాత హన్మకొండలోని బాలసముద్రం వచ్చా. డిగ్రీ ఫైనలియర్‌లో ఉన్నప్పుడే హైదరాబాద్‌కు వచ్చాను. సినిమా కోసమని చాలా తిరిగాను. ఎవరూ అవకాశాలు ఇవ్వకపోవడంతో కొంతకాలం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో పనిచేశాను. చదువడం.. రాయడం అలవాటు. వాటితోనే ఒక అడ్వర్‌టైజ్‌మెంట్ కంపెనీలో చేరాను. నా టాలెంట్ నిరూపించుకొని క్రమంగా సినిమాల్లోకి వచ్చేశాను. బ్రేక్ కోసం ఇన్నాళ్లు వేచి ఉన్నా. ఇన్నేళ్ల నా కృషి 'నీది నాది ఒకే కథ'.



- **పుత్రోత్సాహం గురించి సినిమాలో చెప్పారు. మీ నాన్న ఆ పుత్రోత్సాహాన్ని చూడడానికి చేరువలో మీరున్నప్పుడే ఆయన మీకు దూరమయ్యారు. ఆ బాధను ఎలా భరిస్తున్నారు?**
- నాన్న పై నుంచి నా విజయాన్ని చూస్తూ పుత్రోత్సాహం పొందుతారు. ఇంకొక 15 రోజులు బతికి ఉంటే బాగుండేది. ప్రత్యక్షంగా చూసేవారు. నేను చాలా రోజులుగా సినిమా ప్రయత్నాల్లో ఉన్నానని.. డైరెక్టర్ కావడానికి ప్రయత్నిస్తున్నానని ఆయనకు తెలుసు. తరుచూ అంటుండేవారు.. ఎప్పుడవుతావురా డైరెక్టర్‌వు అని. 8 ఏండ్లుగా ట్రయల్స్‌లోనే ఉన్నా. ఈ సినిమా స్టార్ట్ అయి కూడా 3 ఏండ్లు అవుతున్నది. ఇంకెప్పుడు రిలీజ్ అంటుండేవారు. నాన్న హస్పిటల్లో ఉన్నారు. నాకు పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఉన్నాయి. ఇంట్లోవాళ్లకు నన్ను డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక.. నాన్న బానే ఉన్నారు, నువ్వు నీ పని చూస్కో.. ఇక్కడ మేం చూస్కుంటాం అన్నారు. నాకు ఉండాలనిపించలేదు. వెళ్లాను. 'నాన్నా' అని పలుకరిస్తే లేచి చేతిలో చెయ్యేసి 'సినిమా ఎప్పుడురా' అని శ్వాస విడిచారు. అదే చివరి మాట.. అదే చివరి చూపు. సినిమా చూడకుండానే చనిపోయారు.

- **ఎల్లుండే సినిమా విడుదల? ప్రచారం ఎలా జరుగుతున్నది?**
- సినిమా ప్రజల్లోకి వెళ్లిపోయింది. ఎలాంటి ప్రమోషన్ లేకుండానే సోషల్‌మీడియా ద్వారా యూత్ తమ భుజాలమీదేసుకొని మంచి సినిమాగా దీన్ని ప్రమోట్ చేస్తున్నారు. మంచి సపోర్ట్ ఇస్తున్నారు. బుక్‌మైషోలో 94 శాతం ఓటింగ్ వచ్చింది. అందుకే వైరల్ అయింది. ఎక్కడ చూసినా ఈ సినిమా గురించి మాట్లాడుతున్నారు. ప్రముఖ దర్శకులు శేఖర్ కమ్ముల, మదన్, దేవకట్ట ఈ సినిమా చూశారు. మంచి సినిమా అన్నారు. చాలా సంతోషం. మా సినిమా రిలీజ్‌కు ముందే సెన్సేషన్ అయ్యేందుకు కృషి చేసిన అందరికీ పేరు పేరునా హృదయపూర్వక ధన్యవాదాలు.

దాయి శ్రీశైలం

సుడోకు

డైలీ సుడోకు 155 సమాధానం

1	8	4	2	5	9	3	7	6
9	3	6	8	1	7	4	2	5
5	7	2	4	6	3	8	9	1
6	9	3	1	2	4	5	8	7
8	1	7	3	9	5	6	4	2
2	4	5	6	7	8	9	1	3
4	5	8	7	3	2	1	6	9
7	6	9	5	4	1	2	3	8
3	2	1	9	8	6	7	5	4

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -156

2			6	1		3	7	8
			9			1		
		1		3	7			5
		5	1	4		2		3
9		2		8		4		
8	4			7				
					4	7	5	
	5			9		8	1	

ట్వీట్





నా వ్యక్తిగత యాప్ అప్లికేషన్‌ను విడుదల చేశాను. ఈ సరికొత్త వేదికను ప్రారంభించినందుకు సంతోషంగా ఉన్నది.

రకుల్ ప్రీత్ సింగ్
@Rakulpreet

రకుల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య

2,222,410

కామన్‌మ్యాన్ వాయిస్

సరే. ఆయనని గద్దె దించడమే నీ లక్ష్యం అనుకుంటే మిమ్మల్ని నమ్మేదెవలు ఇంతకు? తెలంగాణ బాగు కదా మనందరి లక్ష్యం. నీకు గదే లక్ష్యం అంటే నువ్వు చేయాల్సింది సచ్చిన శవం నెత్తిన పేనుని సంపుడే ఇక.

–Vamshi Kariveda


బాబు గారు మళ్లా మోదీ గారితో దోస్తీ కట్టకపోతారా.. మోదీ గారు దోస్తానాను ఒప్పుకోకపోతారా? 2002లో మోదీ గారు హైదరాబాద్‌కు వస్తే అరెస్ట్ చేస్తా అన్న బాబు గారు, మోదీ గారు మళ్లా జిగ్రీ దోస్తులు కాలేదా?

–Katpally Santosh Reddy

మనిషి జీవితంలో ఏదో ఒకటి సాధించడం ముఖ్యమే. ఏది సాధించినా.. సంతృప్తి సాధించలేకపోతే అది ఓటమే. సంతృప్తిగా ఉండగలిగితే ఏదీ సాధించలేకపోయినా విజయమే!

–Pushyamitra Shunga

వైరల్ వీడియో



ఏక్ దో తీన్ పాట అప్పట్లో ఒక ఊపు ఊపింది. భాగీ 2 సినిమాలో ఆ పాటను మళ్లీ పెట్టారు. జాక్వెలినా ఫెర్నాండెజ్ ఈ పాటకు స్టెప్పులేసింది. ఇంకేముంటుంది? యూట్యూబ్‌లో చక్కర్లు కొడుతుంది.

Baaghi 2: Ek Do Teen Song | Jacqueline Fernandez |Tiger Shroff | Disha P| Ahmed K | Sajid Nadiadwala

Total views : 13,679,561+

Published on Mar 18, 2018

నమస్తే తెలంగాణ
సంకేత
[హైదరాబాద్]
బుధవారం 21 మార్చి 2018
టెక్నాలజీ 2.0

నయా మాల్

నిఫ్ఫోస్ ఎన్1

నెట్‌వర్క్ దిగ్గజం టీపీ లింక్ సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ని మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. చాలామందికి ఈ కంపెనీ స్మార్ట్‌ఫోన్ మేకర్ అని తెలియదు. నిఫ్ఫోస్ ఈ కంపెనీ బ్రాండ్. మలేషియా మార్కెట్లో లాంచ్ అయిన ఈ ఫోన్ త్వరలోనే ఇండియాని పలుకరించనుంది.



డిస్‌ప్లే	:	5. 50 ఇంచులు
రిజొల్యూషన్	:	1080 X1920 పిక్సెల్స్
ఆండ్రాయిడ్ వెర్షన్	:	ఆండ్రాయిడ్ 7.0
ప్రాసెసర్	:	2.5 గిగాహెడ్జ్ అక్టాకోర్
రియర్ కెమెరా	:	12 మెగా పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా	:	8 మెగా పిక్సెల్స్
ర్యామ్	:	4 జీబీ
ఇంటర్నల్ మెమొరీ	:	64 జీబీ (128జీబీ వరకు పెంచుకోవచ్చు)
బ్యాటరీ సామర్థ్యం	:	3260ఎమ్ఏహెచ్
స్పెషల్ ఫీచర్లు భాగం	:	టాప్ అండ్ బాటమ్ బెజెల్ డిస్‌ప్లే, వెనుక కర్వ్‌డ్ కార్నర్స్‌తో పాటు యాంటెన్నా లైన్స్, మ్యూట్ బటన్‌తో పాటు సైలెన్స్ కాల్ నోటిఫికేషన్ ఉంది.
అందుబాటులో ఉన్న రంగులు	:	బ్లాక్, సిల్వర్
ధర	:	రూ. 18, 000

దూసుకొస్తున్న లైఫై!


అందరికీ వైఫై తెలుసు.. ఏంటీ లైఫై అని ఆశ్చర్యపోతున్నారా? వైఫై ఇక చరిత్ర పుటల్లోకి జారుకోనున్నది. ఇకపై మనం లైఫైని వాడుకోవాల్సిన సమయం ఆసన్నమైనట్లేనట. ఫిలిప్స్ కంపెనీ ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించింది.




ఇప్పటిదాకా వైఫై టెక్నాలజీని వాడుకొని ఎంజాయ్ చేస్తున్నాం. ఇక నుంచి లైఫై వాడుకోవాల్సిన రోజులు రాబోతున్నాయి. సురక్షితమైన, వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను అందుకొనే వీలు కల్పించనున్నది ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీదారు ఫిలిప్స్. వైఫై టెక్నాలజీ అంటే వైర్‌లెస్ తరంగాల ఆధారంగా పనిచేస్తుంది. అతే లైఫై కాంతి తరంగాల ఆధారంగా పనిచేస్తుంది. అంటే ప్రత్యేకంగా తయారుచేయబడిన ఎల్ఈడీ లైట్లలో మోడెమ్‌ని అమరుస్తారన్నమాట. మనం లైట్లను ఆన్ చేసినప్పుడు ఆ మోడెమ్ నుంచి కాంతి తరంగాలు లైట్ల ద్వారా బయటకు వస్తాయి. స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్‌కి అమర్చబడిన ప్రత్యేకమైన యూఎస్‌బీ డాంగిల్ ఆ కాంతి తరంగాలను గుర్తించి వాటిని ఇంటర్నెట్ తరంగాలుగా మార్చి డివైస్‌లకు అందిస్తుంది. ఇలా ఇంటర్నెట్‌ని వాడుకోవచ్చు. వైర్‌లెస్ తరంగాలు వాడేందుకు వీలుకాని చాలా ప్రదేశాల్లో దీన్ని వాడుకోవచ్చు. పైగా వినియోగదారులకు పూర్తి సెక్యూరిటీ అందిస్తుంది. గోడల గుండా వైఫై ప్రయాణించినట్లు లైఫై ప్రయాణించలేదు. దీంతో ఇతరులు దీన్ని యాక్సెస్ చేయలేరు. కాగా ఈ లైఫై టెక్నాలజీ ప్రస్తుతానికి 30 ఎంబీపీఎస్ స్పీడ్ మీద ప్రయాణిస్తున్నదట. త్వరలోనే వేగం మరింత పెంచే అవకాశం కూడా ఉంది. ఈ టెక్నాలజీ ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉంది. ఒకవేళ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే కార్పొరేట్ సంస్థలకు ఎంతో ఉపయోగకారిగా ఉంటుంది.

టెక్ మూఢనమ్మకాలు!

రోజులు మారాయి. 2జీ, 3జీలను దాటిపోయి 4జీలు వాడే కాలంలో ఉన్నాం మనం. మరికొద్ది రోజులైతే అరచేతిలో 5జీతో ప్రపంచాన్ని ఏలేస్తాం. కానీ.. మన నమ్మకాలు, మూఢనమ్మకాలు మాత్రం ఇంకా అలాగే ఉన్నాయి. మిగతా విషయాల్లో కొన్ని మూఢనమ్మకాలకు కొన్ని లాజిక్‌లు, శాస్త్రంతో పోల్చి నిరూపించాల్సిన అవసరం ఉంది. కానీ టెక్నాలజీ విషయంలో కూడా చాలామంది కొన్ని మూఢనమ్మకాలను అమాయకంగా ఫాలో అవుతుంటారు.





అన్నీ బార్స్ ఉంటేనే ఫుల్ సిగ్నల్ ఉన్నట్టు

ఫోన్లో సిగ్నల్ చూపించే బార్స్ ఫుల్లుగా ఉంటే సిగ్నల్ బాగా వస్తున్నట్టు. రెండు మూడు పాయింట్లు తక్కువగా చూపిస్తే.. సిగ్నల్ వీక్‌గా ఉన్నట్టు. ఒకవేళ సిగ్నల్ వీక్‌గా ఉంటే.. ఫోన్లో గట్టిగా మాట్లాడేస్తుంటారు చాలామంది. లేదంటే ఫోన్ పైకెత్తి పట్టుకుని మాట్లాడుతారు. కానీ ఎంత శ్రమపడినా, ఆలోచించినా మీరు చేసేదంతా ఉత్తదే అని తెలుసా! ఎందుకంటే ఫోన్లో సిగ్నల్ బార్స్ ఎన్ని చూపిస్తున్నాయన్నది అస్సలు పట్టించుకోవాల్సిన అవసరం లేని అంశం. ఎందుకంటే ఒక్క పాయింట్ సిగ్నల్ చూపించినా బ్రహ్మాండంగా ఫోన్ కాల్స్ మాట్లాడుకోవచ్చు. ఒక్కోసారి ఫుల్ సిగ్నల్ ఉన్నా.. అవతలి వారు మాట్లాడేది సరిగ్గా వినిపించదు. దీనికి కారణం సిగ్నల్ సమస్య కాదు.. మీరు వాడుతున్న నెట్‌వర్క్ ఏదైతే దాని సామర్థ్యం, ఎంతమంది ఆ నెట్‌వర్క్‌కి కనెక్ట్ అయి ఉన్నారు, ఆ టవర్ పాయింట్ ఎన్ని మొబైల్స్‌కి సిగ్నల్ అందించగలదన్న దాని మీద మీ ఫోన్లో ఉండే సిగ్నల్ పాయింట్లు ఆధారపడుతాయి. అంతేకానీ.. ఎక్కువ పాయింట్లు ఉంటే సిగ్నల్ బాగా ఉన్నట్టు.. తక్కువ పాయింట్లు ఉంటే సిగ్నల్ వీక్‌గా ఉన్నట్టు కాదు.

నిమ్మకాయతో ఛార్జింగ్ పెట్టొచ్చు!

ఆ మధ్య ఏదైనా ఆకుతో నోకియా మొబైల్స్‌కి చార్జింగ్ పెట్టొచ్చు అంటూ ఒక వార్త బాగా వైరల్ అయింది. అది తెలిసిన వారంతా ఏ ఆకు పడితే ఆ ఆకు తెంపి ఫోన్లకు చార్జింగ్ పెట్టేందుకు ఆపసోపాలు పడ్డారు. ఆ తర్వాత వంద, యాభై, ఇరవై, పది రూపాయల నోటుతో కూడా చార్జింగ్ పెట్టొచ్చంటూ మరో వార్త చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత మరికొద్దికాలానికి నిమ్మకాయతో కూడా ఫోన్లకు చార్జింగ్ పెట్టొచ్చన్న వార్త షికార్లు చేసింది. కానీ నిజానికి ఇదంతా సాధ్యం కాదు. వొట్టి హోక్స్ మాత్రమే. కాకపోతే ఎలక్ట్రిక్ వైర్లు నిమ్మకాయలో పెడితే వందలో ఐదోవంతు ఎలక్ట్రిక్ పవర్ ఉత్పత్తి అవుతుంది. కానీ దానితో మొబైల్ చార్జింగ్ పెట్టడం సాధ్యం కాదు. ఇదంతా ఉత్తముచ్చటే.

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, ఇంటర్నెట్ ఒకటే!



ఇంటర్నెట్ వాడేవారిలో ఎక్కువమంది డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ , ఇంటర్నెట్ ఒకటే అనుకుంటారు. కానీ.. ఇది నిజం కాదు. ఈ రెండు విభిన్న పోర్టల్స్. ఇంటర్నెట్ అనేది ఒక సేవ. వరల్డ్ వైడ్ వెబ్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ) అనేది ఈ ఇంటర్నెట్‌ని వాడుకునేందుకు ఒక మాధ్యమం. ప్రపంచంలో ఎక్కువమంది వాడే నెట్‌వర్క్ ఇదే కాబట్టి అందరూ దీన్నే ఇంటర్నెట్ అనుకుంటారు. సేమ్ టు సేమ్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ లాగే ఇతర నెటవర్క్స్ కూడా ఈమెయిల్స్, ఆన్‌లైన్‌గేమ్స్, పీర్ టు పీర్ ఫైల్‌షేరింగ్, ఇన్‌స్టంట్ మెసేజింగ్ వంటి సదుపాయాలు ఇస్తాయి. నెట్‌వర్క్‌లు ఇచ్చినా.. అక్కడ మనం కనెక్ట్ అయ్యేది ఇంటర్నెట్‌కే అన్నమాట.

ఎక్కువ మెగాపిక్సెల్స్.. మంచి కెమెరా



ఎవరి మొబైల్‌లో అయినా మంచి ఫొటో కనిపిస్తే.. 'ఫొటో బాగా వచ్చింది' అని చెప్పకుండా ఉండలేం. దానికి అవతలి వారు 'నా మొబైల్‌తోనే తీశా.. 20 మెగాపిక్సెల్స్ కెమెరా తెలుసా నా మొబైల్‌ది' అనడం ఈ మధ్య పెరిగిపోయింది. నిజానికి ఇది ఇప్పటి మాటేం కాదు. చాలారోజులుగా ఉన్నదే. ఎంత ఎక్కువ మెగాపిక్సెల్స్ ఉంటే ఫొటోలు అంత బాగా వస్తాయనేది చాలామంది నమ్మకం. కానీ మొబైల్‌లో తీసిన ఫొటో బాగా రావడం వెనుక కారణం వేరే ఉంది. ఫొటో తీసేటప్పుడు మన ఫేస్ మీద పడే లైట్ ఆ ఫొటోను డిసైడ్ చేస్తుంది. అంతేకాకుండా.. కెమెరా సెట్ చేసిన యాంగిల్ కూడా మంచి ఫొటో రావడానికి కారణమవుతుంది. అంతేకానీ.. ఎక్కువ మెగాపిక్సెల్స్ ఉంటే.. ఫొటో బాగా వస్తుందనీ.. కెమెరా బాగా పనిచేస్తున్నట్టు కాదు. కెమెరా క్వాలిటీ అనేది లెన్స్ సైజు, లైట్ సెన్సార్, ఇమేజ్ ప్రాసెసింగ్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ లాంటి ఫీచర్లను బట్టి కెమెరా పనిచేసే విధానం, ఫొటోల్లో క్లారిటీ వస్తుంది.

మొబైల్ -ల్యాప్‌టాప్ ఫుల్లుగా చార్జింగ్ పెట్టొద్దు!



'రాత్రంతా చార్జింగ్ పెడితే.. మొబైల్ బ్యాటరీ దాని సామర్థ్యాన్ని కోల్పోయి కొన్నిరోజుల తర్వాత ఎక్కువసేపు చార్జింగ్ ఉండదు' అనే విషయం మీరు చాలాసార్లు విని, చదివి ఉంటారు. కానీ అది నిజం కాదు. ఒకప్పుడు ఈ పరిస్థితి ఉండేదేమో కానీ.. ఇప్పుడు కాదు. ఎందుకంటే.. ఇప్పుడు వచ్చేవన్నీ స్మార్ట్‌ఫోన్లే. బాగా డెవలప్ చెందిన సాఫ్ట్‌వేర్లతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్‌తో ఈ స్మార్ట్‌ఫోన్లు డిజైన్ చేస్తున్నారు. పైగా వేగంగా బ్యాటరీ ఫుల్ అయ్యే ఫీచర్లతో డిజైన్ చేస్తున్నారు. మునుపటికంటే వేగంగా చార్జింగ్ పూర్తి చేసుకుంటాయి. అంతేకాదు.. ఒక్కసారి బ్యాటరీ ఫుల్ అయిందంటే.. చార్జింగ్ తీసుకోవడం ఆపేస్తాయి. అంతేకానీ.. విద్యుచ్ఛక్తిని అధికంగా తీసేసుకొని, బ్యాటరీ హీట్ అయ్యి పేలిపోతాయి. బ్యాటరీ సామర్థ్యం దెబ్బతింటుంది అనే మాటలన్నీ ఉత్తవే.

సెల్‌ఫోన్ వల్ల గ్యాస్ పేలుతుంది!



కొన్ని వీడియోల్లో గ్యాస్ స్టేషన్‌లో, పెట్రోల్ బంక్‌లో మొబైల్ వల్ల మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించినట్టు చాలామంది చూసే ఉంటారు. కానీ.. అదంతా ఉత్తదే.. అలా జరుగడం సాధ్యం కాదు అంటున్నారు న్యూయార్క్ డైలీ న్యూస్ రిపోర్టు చేస్తున్నది. వాళ్లు మాత్రమే కాదు.. పలు అధ్యయనాలు కూడా ఇదే చెప్తున్నాయి. గ్యాస్ స్టేషన్‌లో ఫోన్ మాట్లాడడం వల్ల మొబైల్ నుంచి వెలువడే తరంగాల వల్ల చిన్నపాటి మంటలాంటి స్పార్క్ ఏర్పడి ఫలితంగా అగ్నిప్రమాదం సంభవిస్తుందనీ, అందుకే పెట్రోల్, గ్యాస్‌స్టేషన్లలో ఫోన్లు మాట్లాడకూడదంటూ పోస్టర్లు అంటిస్తారు. అయితే.. ఇప్పటి వరకు గ్యాస్ స్టేషన్, పెట్రోల్‌బంకుల్లో జరిగిన అగ్ని ప్రమాదాలకు మొబైల్ ఫోనే కారణమని ఏ నివేదికలో లేదు. ఏ విచారణా తేల్చలేదు' అంటున్నారు నేషనల్ ఫైర్ ప్రొటెక్షన్ అసోసియేషన్ సభ్యులు. దీన్ని నిరూపించడానికి వారు.. ఒక కార్లో మొబైల్ వదిలేసి గ్యాస్‌స్టేషన్‌లో ఆ కారు ఉంచి ఆ మొబైల్‌కి కాల్ చేశారు. అయినా.. అక్కడ ఎలాంటి స్పార్క్ రాలేదు. అగ్నిప్రమాదం జరుగలేదు అంటున్నారు ఎన్ఎఫ్‌పీఏ సభ్యులు. సో.. ఇప్పటికైనా ఈ మూఢనమ్మకాన్ని వదిలేయండి. అలా అని.. ఎక్కడ పడితే అక్కడ మొబైల్ మాట్లాడమని కాదు. జాగ్రత్తగా ఉండడం బెటర్ కదా!

ఇన్‌కోగ్నిటో విండో ఎవరూ చూడలేరు!



ఇంటర్నెట్ ఆన్ చేసినప్పుడు అందరికీ కనిపించే విండోస్‌లో ఏదైనా ప్రైవేట్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి చూస్తే అది హిస్టరీలో కనిపిస్తుంది. అలా కాకుండా.. ఇన్‌కోగ్నిటో విండోలో ఓపెన్ చేస్తే ఆ విండో ఎవరు వెతికినా కనిపించదు. కనీసం గూగుల్ హిస్టరీలో, ఇంటర్నెట్‌లో కూడా ఎవరికీ కనిపించదు. కాబట్టి మనం సేఫ్ అనుకుంటారు చాలామంది. కానీ అలా అనుకునేవారిది కేవలం మూఢనమ్మకం మాత్రమే. ఎందుకంటే ఇంటర్నెట్‌లో ఏదైనా సెర్చ్ చేసినప్పుడు ఆ కంప్యూటర్, ల్యాప్‌టాప్, మొబైల్‌కి సంబంధించిన ఐపీ అడ్రస్ ముందుగా అక్కడ రిజిష్టర్ అవుతుంది. సంబంధిత వెబ్‌సైట్, ఇంటర్నెట్ పోర్టల్‌కి కనెక్ట్ అవుతుంది. సిస్టమ్ హిస్టరీలో చూపించకపోవచ్చు కానీ.. ట్రాక్ చేస్తే ఇన్‌కోగ్నిటో మోడ్‌లో సెర్చ్ చేసిన వెబ్ హిస్టరీ అంతా బయటకి తీయొచ్చు.

సెల్‌ఫోన్ వల్ల బ్రెయిన్ క్యాన్సర్ వస్తుంది!



మొబైల్ అతిగా వాడితే రకరకాల ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకున్నట్టే అని చెప్తుంటారు డాక్టర్లు. అది నిజమే.. సమయానికి నిద్రపోకుండా, తిండి తినకుండా అదేపనిగా మొబైల్ వాడుతుంటే.. ఆరోగ్యం చెడిపోవడం నిజమే. 1990-2000దశకంలో అయితే ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా దానికి మొబైల్‌ఫోనే కారణం అనుకున్నారు అందరూ. అప్పట్లో అందరినీ భయపెట్టిన బ్రెయిన్ క్యాన్సర్‌కి కూడా మొబైలే కారణం అనుకున్నారు. ఎందుకంటే మొబైల్ వాడకం విస్తృతమయింది అప్పుడే. కానీ దీనికి ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారు. అయితే.. పదకొండు సంవత్సరాల సుదీర్ఘ అధ్యయనం తర్వాత 2011లో లండన్‌కి చెందిన శాస్త్రవేత్తలు అన్నీ ఆరోగ్య సమస్యలకు, ముఖ్యంగా బ్రెయిన్ క్యాన్సర్‌కు సెల్‌ఫోన్ కారణం కాదని తేల్చారు. మొబైల్ సిగ్నల్స్ వల్ల రేడియో తరంగాలు మెదడు మీద ప్రభావం చూపించడమనేది శాస్త్రీయంగా రుజువు కాలేదంటున్నారు శాస్త్రవేత్తలు.

ఇదే కాదు.. టెక్నాలజీకి సంబంధించి చాలా మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్నాయి. రోజురోజుకు టెక్నాలజీ ఊహకందని వేగంతో పరుగులు పెడుతుంటే.. ఇలాంటి పిచ్చి పిచ్చి నమ్మకాలు, ఉపయోగపడని ఊహలతో చాలామంది అబద్ధాలనే నిజం అని నమ్మేస్తున్నారు. ఇప్పటికైనా నిజం తెలుసుకోండి. మూఢనమ్మకాలకు టాటా చెప్పి.. టెక్నాలజీతో దోస్తీ చేయండి. చాలా విషయాలు తెలుస్తాయి.


శుభ్రమైన బాటిల్!

అసలే ఎండాకాలం నీళ్లు ఎక్కువ తాగుతుంటాం. మరి మీరు తాగే నీళ్లు శుభ్రమైనవేనా? మీకోసమే నీళ్లను శుభ్రం చేసుకునే బాటిల్స్ అందుబాటులోకి వచ్చాయి. వాటితో పరిశుభ్రమైన నీటిని తాగొచ్చు.



ఎండాకాలంలో కచ్చితంగా బాటిల్ చేతిలో లేనిది ఎక్కడికి వెళ్లలేని పరిస్థితి అయిపోయింది. అలా అని రోజూ మినరల్ వాటర్‌ని కొని తాగే వాళ్లు ఎంతమంది ఉంటారు చెప్పండి. పైగా చాలా ఖర్చు అవుతుంది. కొన్ని ప్రదేశాల్లో మంచినీటి ఫిల్టర్లు ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నారు. కానీ చాలాచోట్ల నీరు కలుషితమయ్యే ఉంటుంది. అవి తాగడం వల్ల రోగాలపాలు కావాల్సిందేనా? దీని పరిష్కారం కోసం హాలోసోర్స్ క్రౌడ్ సోర్సెస్ ద్వారా వాటర్ ప్యూరిఫై చేసే బాటిల్‌ని తయారుచేశారు. దీని పైగా భాగాన ఈ ప్యూరిఫైయర్ ఉంటుంది. ఈ బాటిల్‌కి ఆస్ట్రియావాటర్ అని నామకరణం చేశారు. మూడు స్థాయిల్లో నీటిని శుభ్రపరిచే విధంగా ఈ బాటిల్‌ని తయారు చేశారు. నీటిలో ఉండే చెత్తను లాగేస్తుంది. పైగా నీటిలో ఉండే కెమికల్స్ అయిన క్లోరిన్, బెంజ్, బ్యాక్టీరియా, వైరస్‌లను ఈ-కాయిల్ లాగేస్తుంది. చూడడానికి మామూలు బాటిల్‌లాగే కనిపిస్తుంది. అయితే భారతదేశంలో ప్లాస్టిక్ బాటిల్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. స్టీల్‌వి కావాలంటే యూఎస్ వెళ్లాల్సిందే. అమెజాన్‌లో దొరికే ఈ బాటిల్స్ ధర 1, 099రూపాయలు. ఈ బాటిల్‌ని వందరోజుల పాటు వాడుకోవచ్చు. లేదా 375లీటర్ల నీటి వరకు తాగిన తర్వాత క్యాటరిడ్జ్‌ని మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ క్యాటరిడ్జ్ 500 రూపాయలకు మనకు లభ్యమవుతుంది. దీన్ని మార్చుకుంటూ ఉంటే బాటిల్‌ని మరిన్ని రోజులు వినియోగించుకోవచ్చు.

బధిరుల కోసం రోబో చెయ్యి!



ప్రపంచవ్యాప్తంగా 70 మిలియన్ల బధిరులు ఉన్నారు. వాళ్లందరికీ సైన్ లాంగ్వేజ్ తెలియదు. అలాంటి వారికి సహాయకారిగా ఉండేందుకు ఈ రోబో ఆర్మ్ కనిపెట్టారు.

చెవులు వినిపించకపోతే ఇతరులతో కమ్యూనికేట్ చేయడం చాలా కష్టం. అలాంటి వారికి ఏదైనా విషయం కనీసం సంజ్ఞలతోనైనా తెలియచేయాలి. అలాంటప్పుడే వారికి అర్థం అవుతుంది. ఇతరులకు ఏ పదానికి ఎలా సంజ్ఞ చేయాలో తెలియదు. దాంతో ఇద్దరూ ఇబ్బందుల్లో పడాల్సి వస్తుంది. ఇలాంటిది ఏమీ లేకుండా యూనివర్సిటీ ఆఫ్ ఆంట్‌వెర్ప్ వాళ్లు రీసెర్చ్ చేసి ఈ రోబో చెయ్యిని కనిపెట్టారు. దీనికి దాదాపు 560 డాలర్లు ఖర్చు చేశారట. 3డీ ప్రింట్‌తో చేసిన దీనికి 'ప్రాజెక్ట్ అస్లాన్' అని పేరు పెట్టారు. మనం మాట్లాడే భాషను లేదా రాసిన స్క్రిప్ట్, కంప్యూటర్ స్క్రీన్ మీద కనిపించే వాటిని ఇది యథాతథంగా ఫింగర్ స్పెల్లింగ్ చేస్తుంది. దీని ద్వారా బధిరులకు మనం ఏం చెప్పదలుచుకున్నామో ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికీ ఒక చెయ్యిని మాత్రమే తయారుచేశారు. మరో చెయ్యి కూడా తయారైతే పూర్తిగా సంజ్ఞలు తెలియచేయడానికి ఎంతో సహాయకారిగా ఉంటుందంటున్నారీ శాస్త్రవేత్తలు. మరో ఐదేండ్లలో రెండు రోబో చేతుల సహాయంతో సంజ్ఞలు చేయించేస్తామంటున్నారు. వీటిని కాలేజ్‌లో పాఠాలు అర్థమయ్యేలా చేసేందుకు ఉపయోగిస్తారట. అదే గనుక జరిగితే ఎంతోమంది బధిరులకు మంచి విద్య అందుతుందని వారు ఆశిస్తున్నారు.

చిన్న పీసీ!



ఎలైట్ గ్రూప్ కంప్యూటర్ సిస్టమ్స్ 'లివా క్యూ' పేరిట ప్రపంచంలో అత్యంత చిన్నదైన విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారిత మినీ పీసీని భారతదేశంలో లాంచ్ చేసింది.

పీసీలంటే మనకు పెద్దవే గుర్తుకొస్తాయి. కానీ ఈ పీసీ బరువు కేవలం 260 గ్రాములు. ఇందులో ఇంటెల్ అపోలో లేక్ ప్రాసెసర్లు, 4జీబీ ర్యామ్, 32/64 జీబీ స్టోరేజ్, 128 ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్ ఉన్నాయి. అలాగే విండోస్ 10హోమ్ ఓఎస్, డ్యూయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 4.1, రెండు యూఎస్‌బీ పోర్టులు, ఒక ఈథర్‌నెట్ పోర్టు ఈ పీసీలో ఉంటాయి. దీంట్లో వెసా మౌంట్ పోర్ట్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీనివల్ల పీసీని మానిటర్లు, టీవీలకు కనెక్ట్ చేసుకోవచ్చు. విండోస్ 10 ఓఎస్ లేకుండా అయితే ఇది 13, 500 రూపాయలకు లభిస్తుంది. అదే విండోస్ 10 ఓఎస్‌తో అయితే రూ.15, 500లకు కొనుగోలు చేయవచ్చు. త్వరలోనే మినీ పీసీ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ స్టోర్‌లో లభ్యం కానుంది.



కళ్యాణ్‌రామ్, కాజల్, నరేష్, కిరణ్‌రెడ్డి, భరత్‌చౌదరి, విశ్వప్రసాద్, ఉపేంద్రమాధవ్

కాంబినేషన్ కంటే కథే ముఖ్యం

'నా హృదయానికి బాగా దగ్గరైన సినిమా ఇది. 'పటాస్' కథ వింటున్నప్పుడు ఎలాంటి ఎగ్జైట్‌మెంట్‌కు లోనయ్యానో అదే అనుభూతి ఈ సినిమాకు కలిగింది. ప్రతి రోజు కొత్త అనుభవాన్ని మిగిల్చిన చిత్రమిది' అని అన్నారు నందమూరి కళ్యాణ్‌రామ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఎంఎల్‌ఏ'. 'మంచి లక్షణాలున్న అబ్బాయ్' చిత్ర ఉపశీర్షిక.బ్లూప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై కిరణ్‌రెడ్డి, భరత్ చౌదరి నిర్మిస్తున్నారు. ఉపేంద్రమాధవ్ దర్శకుడు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు వంశీపైడిపల్లి విడుదలచేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'కథను నమ్మి సినిమాలు చేసే నిర్మాతలంటే నాకు ఇష్టం. నేను అలాగే సినిమాలు చేస్తుంటాను. ఆ లక్షణాల్ని ఈ చిత్ర నిర్మాతల్లో చూశాను.కాంబినేషన్ కంటే కథను నమ్ముకుంటే ఏదో ఒక రోజు తప్పకుండా హిట్ వస్తుందని నేను నమ్ముతాను. సినిమా చూస్తున్నప్పుడు బోర్ అనే మాట వినిపించదు. ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగుతుంది. కష్టపడేతత్వం, అంకితభావంతోనే కాజల్ ఇన్నాళ్లు ఇండస్ట్రీలో ఉండగలిగింది. ఈ ప్రయాణంలో వృత్తి పరంగా ఆమెలో చాలా పరిణితి వచ్చింది. ఆమె మరో యాభై సినిమాలు చేయాలి. నేను బాగా ఇష్టపడి చేసిన సినిమా ఇది. తప్పకుండా అందరిని మెప్పిస్తుంది' అని చెప్పారు. 'కథ వినగానే వెంటనే సినిమా చేస్తున్నామని కళ్యాణ్‌రామ్ అన్నారు. ఆయన దర్శకుల హీరో. ప్రసాద్‌మూరెళ్ల, మణిశర్మతో పాటు అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులను నిర్మాతలు నాకు ఇచ్చారు.అందువల్లే తొలి సినిమా అనే ఒత్తిడి లేకుండా సులభంగా పనిచేయగలిగాను' అని దర్శకుడు చెప్పారు. వంశీపైడిపల్లి మాట్లాడుతూ 'ఉపేంద్ర, నేను కలిసి కొన్నాళ్లు పనిచేశాం. ప్రతి రచయిత దర్శకుడిగా మారుతున్న సమయంలో తన దగ్గరున్న ఉత్తమమైన కథలతోనే సినిమాలు చేస్తుంటారు. ఉపేంద్ర అదే పనిచేశారు. నిర్మాత కిరణ్‌రెడ్డి మా జిల్లాకు చెందినవారే. ఆదిలాబాద్ నుంచి చిత్రసీమలోకి రావడం ఆనందంగా ఉంది. మంచి లక్షణాలున్న అబ్బాయ్ అనే పదానికి కళ్యాణ్‌రామ్ నిదర్శనంగా నిలుస్తారు. ట్రైలర్ బాగుంది. 'పటాస్' సినిమాలో కళ్యాణ్‌రామ్‌లోని ఎనర్జీ ఇందులో కనిపిస్తుంది' అని పేర్కొన్నారు. తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ మాట్లాడుతూ 'దర్శకుడు ఉపేంద్రమాధవ్ నాకు మంచి మిత్రుడు. రచయితగా ప్రతిభను చాటుకున్న అతడు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తొలి అడుగు అతడికి మంచి ఫలితాన్ని అందివ్వాలి' అని తెలిపారు. నా తొలి సినిమా హీరో కళ్యాణ్‌రామ్‌తో మళ్లీ పనిచేయడం ఆనందంగా ఉందని కాజల్ చెప్పింది. ఈ కార్యక్రమంలో రవికిషన్, శ్రీనువైట్ల, భీమనేని శ్రీనివాసరావు, కోనవెంకట్, రామజోగయ్యశాస్త్రి, కాసర్లశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



తమన్నా

శ్రియ రహస్య వివాహం!



శ్రియ, ఆండ్రీ కొశీవ్

కథానాయిక శ్రియ వివాహం అత్యంత సన్నిహితుల మధ్య రహస్యంగా ముంబైలోని లోఖండ్‌వాలాలో ఈ నెల 12న జరిగింది. ఈ పెళ్లికి సంబంధించిన ఫొటోలు మంగళవారం బయటికొచ్చాయి. నూతన వధూవరుల ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'ఇష్టం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన శ్రియ ఆ తరువాత తెలుగుతో పాటు, తమిళ, హిందీ భాషల్లో మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. ప్రస్తుతం వరుస చిత్రాల్లో నటిస్తున్న ఆమె గత కొంత కాలంగా రష్యాకు చెందిన క్రీడాకారుడు ఆండ్రీ కొశీవ్‌తో ప్రేమలో వుందని వార్తలు షికారు చేశాయి. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని చెబుతూ వచ్చిన శ్రియ తను ప్రేమిస్తున్న ప్రియుడినే రహస్యంగా వివాహం చేసుకుంది. హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగిన ఈ వివాహానికి బాలీవుడ్‌కు చెందిన మనోజ్ బాజ్‌పాయ్, షబానా అజ్మీ వంటి అతికొద్ది మంది నటీనటులు మాత్రమే హాజరయ్యారని తెలిసింది. ఎరుపు రంగు చీరలో పెళ్లి కూతురుగా శ్రియ మెరవగా, షేర్వానీ ధరించి ఆండ్రీ కొశీవ్ ఆకర్షణగా నిలిచారు. తొలుత డెస్టినేషన్ వెడ్డింగ్ పేరుతో మూడు రోజుల పాటు ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరగనుందని ప్రచారం జరిగింది. దానికి భిన్నంగా శ్రియ తన వివాహాన్ని రహస్యంగా ముంబైలో జరుపుకుని అందరినీ విస్మయపరిచారు.

కలలు ఫలించాయి!

'పదిహేనేళ్ల వయసులో చిత్రసీమలో అరంగేట్రం చేశాను. ఆ ప్రాయంలో భవిష్యత్తుపై ఎలాంటి ఆశలు వుండేవి కావు. కాలక్రమంలో నటన నా వృత్తిగా స్థిరపడిపోయింది. గతాన్ని తరచి చూసుకుంటే ఏదో అద్భుతం జరిగిందనే భావక కలుగుతున్నది' అని అంటోంది తమన్నా. తన సినీ ప్రయాణం గురించి ఈ అమ్మడు కొన్ని ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించింది. ఎవరి అండలేకుండా చిత్రసీమలోకి అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకోవడం ఆనందంగా వుందని పేర్కొంది. 'నటనపై వున్న వ్యామోహంతో పరిశ్రమలోకి వచ్చాను. కొన్నేళ్లపాటు అదృష్టాన్ని పరీక్షించుకొని ఇతర రంగంలోకి వెళ్లిపోదామనుకున్నాను. కానీ విధి నా జీవితాన్ని మరోలా ప్లాన్ చేసింది. కథానాయికగా ఉన్నత స్థానంలో నిలబెట్టింది. నా కలలన్నీ ఫలించాయి. ఇకముందు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే గొప్ప పాత్రలు చేయాలనుకుంటున్నాను' అని తమన్నా చెప్పింది. ప్రస్తుతం ఈ అమ్మడు 'క్వీన్' తెలుగు రీమేక్‌లో కథానాయికగా నటిస్తున్నది.

'గులేబకావళి' గీతావిష్కరణ



జానీ, జీవిత, మల్కాపురం శివకుమార్, రసమయి బాలకిషన్, ఎన్.శంకర్, కల్యాణ్

'హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మిస్టరీ, సస్పెన్స్, యాక్షన్ అంశాలతో కూడిన అందమైన చిత్రమిది. నిధి అన్వేషణ నేపథ్య కథాంశాలతో దక్షిణాదిలో వచ్చిన సినిమాలన్నీ పెద్ద విజయాల్ని సాధించాయి. ఈ సినిమా ఆ జాబితాలో నిలవాలి' అని అన్నారు తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్. ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. కళ్యాణ్ దర్శకత్వం వహించారు. రేవతి ప్రధాన పాత్రను పోషించారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని తెలుగులోకి అదే పేరుతో అందిస్తున్నారు. వివేక్ మెర్విన్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్ర గీతాలు సోమవారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. బిగ్ సీడీని రాష్ట్ర సాంస్కృతిక శాఖసారథి, శాసనసభ్యుడు రసమయి బాలకిషన్ విడుదలచేశారు. ఆడియో సీడీలను ఎన్.శంకర్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని శ్రీమతి జీవితా రాజశేఖర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ ' స్ట్రెయిట్, డబ్బింగ్ అనే తేడా లేకుండా చిన్న నిర్మాతల సినిమాల్ని విడుదలచేసి వారికి సహాయపడాలనే తపన మల్కాపురం శివకుమార్‌లో కనిపిస్తుంది. రిస్క్ అయినా నిర్మాతలను బతికించాలనే ఆలోచన ఉన్న మంచి మనిషి. భవిష్యత్తులో పదిమందికి సహాయపడుతూ అతడి ప్రయాణం ఇలాగే కొనసాగాలి' అని తెలిపారు. తెలుగు, తమిళ నేటివిటీకి సరిపోయే కథ ఇదని, అందరికి నచ్చే విధంగా ఉంటుందని దర్శకుడు కల్యాణ్ చెప్పారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ' చెన్నైలో ఐదోవారంలో ఈ సినిమా చూశాను. తమిళ భాష రాకపోయినా సాధారణ ప్రేక్షకుడిగా సినిమాను చాలా ఎంజాయ్‌చేశాను. తప్పకుండా తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది. ఏప్రిల్ 6న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు . రసమయి బాలకిషన్ మాట్లాడుతూ 'అన్నం ఉడికిందా లేదా చూడాలంటే ఒక్క మెతుకు చూస్తే చాలంటారు. పాటలు, ట్రైలర్ బట్టే ఈ సినిమా సక్సెస్ తెలుస్తున్నది. కష్టాల్లో ఉన్న వారికి నేనున్నానంటూ ధైర్యాన్నిస్తున్నారు మల్కాపురం శివకుమార్. నేను ఓ సినిమా చేయబోతున్నాను. ఆ సినిమాకు శివకుమార్ పంపిణీదారుడిగా వ్యవహరించనున్నారు ప్రయోగాత్మకంగా తెరకెక్కనున్న ఆ సినిమాను జూన్ 2న విడుదలచేయనున్నాం' అని తెలిపారు. జీవిత మాట్లాడుతూ ''గరుడవేగ' సినిమాను ఎలా విడుదలచేయాలి, ఏ విధంగా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలో తెలియని అయోమయంలో ఉన్న సమయంలో శివకుమార్ సహాయం అందించారు. ఆ సినిమా పెద్ద సక్సెస్‌గా నిలవడానికి ఆయనే కారణం. తెలంగాణలో శివకుమార్ పెద్ద నిర్మాతగా పేరుతెచ్చుకోవాలి' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొగ్గారం శ్రీనివాస్, బీరం సుధాకర్‌రెడ్డి, బీరం లోకేష్ రెడ్డి, జానీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

జీవితాల్ని చూసుకుంటున్నారు!



నిఖిల్, సంయుక్తహెగ్డే

'నటుడిగా నా కెరీర్‌లో అత్యధిక ప్రశంసలు అందుకుంటున్న చిత్రమిది. పతాక ఘట్టాలకు ముందు వచ్చే సన్నివేశాల్లో అద్వితీయంగా నటించానని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు' అని అన్నారు నిఖిల్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కిరాక్‌పార్టీ'. శరణ్‌కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సిమ్రాన్ పరీన్జా, సంయుక్త హెగ్డే కథానాయికలుగా నటించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నిఖిల్ మాట్లాడుతూ 'సినిమాలోని ప్రతి పాత్రతో ప్రేక్షకులు సహానుభూతి చెందుతున్నారు. తమ జీవితాల్ని తెరపై దర్శిస్తున్నారు. మౌత్‌టాక్‌తో రోజు రోజుకు వసూళ్లు పెరుగుతున్నాయి. చిన్న పట్టణాల్లో సినిమా మంచి కలెక్షన్స్ సాధిస్తున్నది. ఈ సినిమాతో నాకు మరో మంచి విజయం దక్కడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. 'సినిమాకు అన్ని ప్రాంతాల్లో చక్కటి స్పందన లభిస్తున్నది. థియేటర్స్ మొత్తం విద్యార్థులతో నిండిపోతున్నాయి. అందరూ ఈ సినిమాతో కనెక్ట్ అవుతున్నారు. నిఖిల్ కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన చిత్రమిది. ఓవర్సీస్‌లో మంచి కలెక్షన్స్‌ను సాధిస్తున్నది. బుధవారం నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విజయయాత్రను నిర్వహించనున్నాం' అని అనిల్ సుంకర పేర్కొన్నారు. విద్యార్థులంతా తమ కథగానే భావించి ఈ సినిమాకు పెద్ద విజయాన్ని కట్టబెట్టారని దర్శకుడు చెప్పారు. ఈ కార్యక్రమంలోబ్రహ్మాజీ, సంయుక్తహెగ్డే, హేమంత్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓ విద్యార్థి సంఘర్షణ



శ్రీవిష్ణు

'చదువు పూర్తిచేసుకున్న తర్వాత జీవితంలో స్థిరపడటానికి ప్రతి ఒక్కరికి కొంత సమయం పడుతుంది. ఆ సంధికాలంలో ఓ విద్యార్థికి ఎదురైన సంఘర్షణ నేపథ్యంలో సాగే చిత్రమిది. మధ్యతరగతి మనస్తత్వాలను ప్రతిబింబిస్తూ గ్రామీణ నేపథ్యంలో ఆద్యంతం సహజకోణంలో సాగుతుంది' అని అన్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నీది నాది ఒకే కథ'. వేణు ఊడుగుల దర్శకుడు. ప్రశాంతి, కృష్ణవిజయ్, అట్లూరి నారాయణ రావు నిర్మించారు. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలకానున్నది. శ్రీవిష్ణు మాట్లాడుతూ 'చదువు పూర్తయిన తర్వాత ఏం చేయాలనే అయోమయం చాలా మందిలో ఉంటుంది. నిత్యజీవితంలో మనకు తారసిల్లే అలాంటి విద్యార్థుల జీవితాలకు వాస్తవరూపంగా ఈ సినిమా ఉంటుంది. మనసుకు నచ్చకపోయినా సమాజం కోసం ఇష్టంలేని చదువును ఎంచుకొని వారు పడే ఆవేదనను హృద్యంగా ఆవిష్కరించే చిత్రమిది. జీవితంలో రాజీపడకుండా నచ్చిన లక్ష్యం వైపు అడుగులు వేయడంలోనే ఆనందం ఇమిడి ఉంటుందనే సందేశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నాం. డాగ్మే-95 అనే కొత్త టెక్నిక్‌తో సినిమాను తెరకెక్కించాం. ఈ టెక్నిక్‌తో తెరకెక్కిన తొలి తెలుగు సినిమా మాదే. ఈ తరహా విధానంతో మరిన్ని సినిమాలు రావడానికి ఈ చిత్రం నాందిగా నిలుస్తుంది' అన్నారు.

ఘనంగా ఈటల జన్మదిన వేడుకలు



మంత్రి ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్



మంగళవారం శాసనసభలో మంత్రి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యేలు బొడిగ శోభ, శ్రీనివాస్‌గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, అజయ్‌కుమార్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు



మంగళవారం లోటస్‌పాండ్‌లో మంత్రి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినిపల్లి సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గంగుల కమలాకర్, కోనేరు కోనప్ప, మనోహర్‌రెడ్డి, బాపూరావు, సోమారపు సత్యనారాయణ, దుర్గం చిన్నయ్య, ఒడితెల సతీశ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్, దివాకర్‌రావు, రమేశ్‌బాబు, కాలె యాదయ్య, నల్లాల ఓదెలు, హన్మంత్‌షిండే



అసెంబ్లీ ఆవాజ్



మిషన్‌కాకతీయకు ప్రపంచవ్యాప్త ప్రశంసలు

- గొలుసుకట్టు చెరువుల అభివృద్ధికోసమే మిషన్‌కాకతీయ
- నీతిఆయోగ్ సిఫారసు చేసినా, కేంద్రం సాయం ఇవ్వలేదు
- శాసనమండలిలో మంత్రి టీ హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేసేందుకు మిషన్‌కాకతీయ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. మంగళవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పాతూరి సుధాకర్‌రెడ్డి, నారదాసు లక్ష్మణరావు, గంగాధరగౌడ్, ఎస్ ప్రభాకరరావు, భూపాల్‌రెడ్డి, బోడెపూడి వెంకటేశ్వర్‌రావు తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి వివరంగా సమాధానాలు చెప్పారు. మిషన్‌కాకతీయ పనులకు నీతిఆయోగ్ రూ. 5 వేల కోట్లు తెలంగాణకు సాయం అందించాలని సిఫారసు చేసిందని, అయినప్పటికీ కేంద్రం సాయం చెయ్యలేదని మంత్రి విమర్శించారు. రామన్ మెగసెసె అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్, బ్రిటిష్ పార్లమెంట్ కామన్ వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సభ్యులు, బ్రిటిష్ హైకమిషనర్ హాంగ్రో మైకెంగ్రోతోపాటు.. కేంద్రం నుంచి వచ్చిన చాలామంది పెద్దలు మిషన్‌కాకతీయ చెరువులను సందర్శించి తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించారని మంత్రి హరీశ్ పేర్కొన్నారు. ఆనాటి కేంద్ర జలవనరులశాఖ మంత్రి ఉమాభారతి ఆదేశాల మేరకు కేంద్ర జలవనరులశాఖ ఇంజినీర్లు మిషన్‌కాకతీయ పనులను పరిశీలించి హర్షించారన్నారు. మిషన్‌కాకతీయ ద్వారా గతంలో కన్నా అదనంగా 2.88 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతున్నదని.. ఆయకట్టు స్థిరీకరణ పెరిగిందని, పంట దిగుబడి పెరిగిందని చెప్పారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న రైతులు రాష్ట్రంలో చాలా సంతోషంగా ఉన్నారని మంత్రి తెలిపారు. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఎక్కువ భూమిని సాగులోకి తీసుకొని రావడంతోపాటు, ఆదాయ వనరులను పెంచేవిధంగా జరుగుతున్న మిషన్‌కాకతీయ పనులకు దేశమంతటా ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ఈ స్కీంను అధ్యయనం చేస్తున్నాయని వెల్లడించారు. రామచంద్రాపురంలో రామసముద్రం చెరువుకు కావాల్సిన నిధులు ఇస్తామని ప్రకటించారు. ప్రజా ప్రతినిధులు ఇచ్చే ప్రతిపాదనలన్నింటికీ ప్రాధాన్యమిస్తామని తెలిపారు. వాన నీటిని ఒడిసి పట్టేందుకు, భూగర్భ జలవనరులను పెంచేందుకు మిషన్ కాకతీయ ద్వారా తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆదర్శనీయమైన వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ అభినందించారని చెప్పారు. ఈ ప్రక్రియ కరువు కాటకాలను తరిమి కొడుతుందని చెప్పారు. చెరువుల ద్వారా కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాలలో 244 టీఎంసీల వరకు నీటిని నిల్వచేసి 25 లక్షల ఎకరాలను సాగులోకి తెచ్చే ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతున్నాయని వివరించారు. చిన్న చెరువుల ద్వారా ప్రజలకు బహుళ ప్రయోజనాలు అందుతున్నాయని.. రాష్ట్రంలో మత్స్య సంపద పెరిగిందని, మత్స్యకార్మికులకు నిరంతరం ఉపాధి లభిస్తున్నదని మంత్రి హరీశ్ పేర్కొన్నారు.



నల్లగొండలో బత్తాయి.. నకిరేకల్‌లో నిమ్మకాయల మార్కెట్

- శాసనమండలిలో మంత్రి టీ హరీశ్‌రావు

నల్లగొండలో బత్తాయి పండ్లకోసం ప్రత్యేకంగా మార్కెట్‌ను ఏర్పాటుచేస్తామని.. అదేవిధంగా నకిరేకల్‌లో నిమ్మకాయల కోసం మరో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని మంత్రి టీ హరీశ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో బోడకుంటి వెంకటేశ్వర్లు, బాలసాని లక్ష్మీనారాయణ, సుంకరి రాజు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. ప్రస్తుతం రాష్ట్రంలో గడ్డిఅన్నారం, వరంగల్, జగిత్యాలలో మూడు పండ్ల మార్కెట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను రంగారెడ్డి జిల్లా కొహెడ గ్రామంలో సేకరించిన 175 ఎకరాల స్థలంలోకి, జగిత్యాల మామిడి పండ్ల మార్కెట్‌ను చెల్‌గల్ గ్రామంలో సేకరించిన 23 ఎకరాల స్థలంలోకి మార్చేందుకు, ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని ఆయన వివరించారు.

పథకాలకు తెలంగాణ ప్రయోగశాల

- రాష్ట్రాభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించకపోవడం దురదృష్టకరం
- శాసనసభలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు తెలంగాణ ఒక ప్రయోగశాల అని, దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోనూ ఇన్ని పథకాలు అమలవుతున్న దాఖలాలులేవని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వాలు పబ్బం గడుపుకొనేందుకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవని, కానీ తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాలకు లబ్ధి చేకూరేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని చెప్పారు. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీడీపీ ఎక్కువగా ఉన్నదంటే రాష్ట్ర అభివృద్ధికి ఇది నిదర్శనం కాదా? ప్రతిపక్షాలకు ఈ అభివృద్ధి ఎందుకు కనిపించడంలేదని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణాజలాలను తరలించుకుపోతున్నా గతంలో ఎవరూ పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు రాష్ట్ర సర్కారు ప్రాజెక్టులను చేపడుతుంటే కోర్టులకు వెళ్లి పనులను నిలిపేయిస్తున్నారని మండిపడ్డారు. కాగా రాష్ట్రంలో ఏమీ జరుగలేదని బీజేపీ ఎమ్మెల్యే లక్ష్మణ్ అనడం సరికాదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మండిపడ్డారు. మెస్ చార్జీలు పెరుగడం, 24 గంటల విద్యుత్, కల్యాణలక్ష్మి, రూ.17 వేలకోట్ల రైతుల రుణమాఫీ లాంటి ఎన్నో పనులు చేసినా, ఏమీ జరుగనట్టు మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు.

నాలుగుబిల్లులు ప్రవేశపెట్టిన ప్రభుత్వం

ప్రభుత్వం నాలుగుబిల్లులను మంగళవారం సభలో ప్రవేశపెట్టింది. మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి.. తెలంగాణ అసైన్డు భూముల (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) (సవరణ) బిల్లు-2018, ది తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ (సవరణ) బిల్లు-2018, ది తెలంగాణ అడ్వకేట్స్, క్లర్స్క్ వెల్ఫేర్ ఫండ్ (సవరణ) బిల్లు-2018, ది తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ (సవరణ) బిల్లు-2018ను సభలో ప్రవేశపెట్టగా.. సభ అందుకు అనుమతిచ్చింది.

బడ్జెట్‌తో మరో హరిత విప్లవానికి బాటలు

- మండలిలో ముగిసిన బడ్జెట్‌పై చర్చ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ మరో హరిత విప్లవానికి బాటలు వేసిందని పలువురు ఎమ్మెల్సీలు అభిప్రాయపడ్డారు. మండలిలో బడ్జెట్‌పై సోమవారం ప్రారంభమైన చర్చ మంగళవారం ముగిసింది.

మరో హరితవిప్లవానికి బాటలు: ఎమ్మెల్సీ యాదవరెడ్డి

2018-19 వార్షిక బడ్జెట్ మరో హరితవిప్లవానికి బాటలు వేసేలా ఉంది. నాలుగేండ్ల పాలనలో తెలంగాణ జీఎస్‌డీపీలో 10 శాతంపైనా, సేవల రంగంలో 5 శాతంపైన ప్రగతిని సాధించాం. పారిశ్రామికంగా కూడా ప్రగతి సాధించాం.

ప్రజల మనోభావాలను ప్రతిబింబించింది: పూల రవీందర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

ఇది ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని, జీవన స్థితిగతుల ఆధారం చేసుకొని రూపొందించిన బడ్జెట్. సీఎం కేసీఆర్, ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిలకు ధన్యవాదాలు.

అన్ని వర్గాల్లో ఆనందం: ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్

ఈ బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేలా ఉన్నది. గీత కార్మికులకు చెల్లించే పరిహారం రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు.

రైతు ఆధారిత బడ్జెట్: ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి

ఇది రైతుల ఆదారిత బడ్జెట్. విత్తనాలు, ఎరువుల కొరత లేదు. రైతు రుణ మాఫీ చేశాం. వ్యవసాయానికి పెట్టుబడిగా ఏడాదికి రూ.8 వేలు అందించబోతున్నాం. రైతు బీమా పథకం రూపొందించాం.

టీఆర్ఎస్ సభ్యుడిగా ఉండటం గర్వంగా ఉంది: ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్

సీఎం కేసీఆర్ పాలనలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో విశ్వాసం పెరిగింది. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక స్టడీ సర్కిళ్లలో చదువుకున్న ఎస్సీ, ఎస్టీ యువతకు ఉద్యోగాలొచ్చాయి.

రాష్ట్రాన్ని సుభిక్షం చేసే బడ్జెట్: ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి

సుభిక్షమైన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలనేది సీఎం కేసీఆర్ ఆకాంక్ష. సబ్బండ వర్గాలు, సబ్బండ కులాలు, ప్రభుత్వ వర్గాలకు అవసరమైన నిధుల కేటాయింపు జరిగింది.

ఆదర్శవంతమైన బడ్జెట్: కాటేపల్లి జనార్దన్‌రెడ్డి

రాష్ట్ర ఆవిర్భావ లక్ష్యం బడ్జెట్ రూపకల్పనలో ప్రస్ఫుటమయింది. ప్రపంచంలోనే ఆదర్శవంతమైన బడ్జెట్. గతంలో వర్షాలు వస్తే రైతులు ఎరువులు, విత్తనాలకోసం తిప్పలు పడేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

మైనార్టీ గురుకులాలను ఎమ్మెల్సీలు పర్యవేక్షించాలి: ఎమ్మెల్సీ ఫరూక్ ఉస్సేన్

పేదకుటుంబాలను దృష్టిలో పెట్టుకొని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద సాయాన్ని లక్షా నూటపదహార్లకు పెంచారు.

కేసీఆర్ మేధాశక్తికి కాళేశ్వరం నిదర్శనం: బాలసాని లక్ష్మీనారాయణ

కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ సీఎం కేసీఆర్ మేధాశక్తికి నిదర్శనం. మంత్రి హరీశ్‌రావు విజన్‌తో పనులను చేపడుతున్నారు.

రాముడు చేయనిది.. కేసీఆర్ చేస్తున్నారు

- రైతులకు పెట్టుబడి పథకం గొప్ప వరం
- మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదర్శవంతమైన పాలనకు చిరునామాగా నిలిచిన రామరాజ్యం, అశోకుడి పాలనల్లో రైతుల నుంచి శిస్తులు వసూలు చేసేవారని.. కానీ, నేడు తెలంగాణ ప్రభుత్వం రైతులకే పెట్టుబడి సహాయం ఇస్తూ వారి అభివృద్ధికి సహాయకారిగా నిలుస్తున్నదని.. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పంట పెట్టుబడి పథకం కింద రైతులందరికీ ఎకరానికి రూ. 4 వేల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా పార్ట్ ఏ కింద 1.12 కోట్ల ఎకరాలకు సంబంధించి.. 72.13 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ. 12 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా పంట పెట్టుబడి పథకంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రపంచంలో రైతులకు పెట్టుబడి రాయితీ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని చెప్పారు. వానకాలం పంటకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి, యాసంగి పంటకు నవంబర్ నుంచి పంట పెట్టుబడి సాయం చేస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి గ్రామంలో.. ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం.. స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా రైతులకు చెక్కుల పంపిణీ జరుగుతుందని వెల్లడించారు. దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా ఈ పథకం లేదన్నారు. ఆరు బ్యాంకుల ద్వారా ఆర్డర్లీ చెక్కులను పంపిణీ చేస్తామని, తద్వారా చెక్కులు మార్చుకునే విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందన్నారు. శనగ, చెరుకు పంటకు కూడా ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు.



ఉద్యాన పంటలకు సైతం అందిస్తామన్నారు. కౌలు రైతులకు ఈ పథకం వర్తించదని స్పష్టంచేశారు.

రైతుకు అండదండగా ఉండేందుకు రైతు భవనాలు

రైతుకు అండదండగా ఉండేందుకు రాష్ట్రంలో 2,638 రైతు వేదికల భవనాలను నిర్మిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం రూ. 300 కోట్లు కేటాయించామని.. కనీసం 300 మంది రైతులు కూర్చొనేలా వీటిని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతీ క్లస్టర్‌లోనూ ఒక్కో రైతువేదిక భవనాన్ని రూ. 12 లక్షల ఖర్చుతో ఏఈవోల ఆఫీసులు కూడా ఉండే విధంగా నిర్మాణం చేపడుతామన్నారు.

ప్రజల మనసు గెలిచాం

మొదటిపేజీ తరువాయి...

షాదీముబారక్ తదితర పథకాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయి. గొల్లకురుమలు, ముదిరాజ్‌లు, గౌడ కులస్తులు, గంగపుత్రులు ఇతర కులాలు, భవన నిర్మాణ కార్మికులు, ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి రూ. 6లక్షల బీమా పొందే ఏర్పాటు చేశాం. అన్ని వర్గాలవారినీ కలుపుకుని ముందుకుపోతున్నాం. రైతులకు వ్యవసాయానికి పెట్టుబడి ఇవ్వడంతోపాటు, రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నాం. ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదట్లో ఉత్తరాదికి వెళ్తే ఎవరూ అంతగా పట్టించుకోలేదు. మూడేండ్లు గడిచాయి.. ఇప్పుడు ఉత్తరాదితోపాటు దేశవ్యాప్తంగా గౌరవం పెరిగింది. ప్రతి ఒక్కరూ ఎంతో మర్యాదతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను అడిగిమరీ తెలుసుకుంటున్నారు. ఇదంతా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి వల్లనే సాధ్యమైంది. తెలంగాణలో బొగ్గుబాయి, బొంబాయి బతుకులే ఉంటాయని చెప్పుకునే పరిస్థితి నుంచి మాది తెలంగాణ అని గల్లా ఎగిరేసి గర్వంగా చెప్పుకునేస్థాయికి తీసుకువచ్చింది.

ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవం పెంచాం

పార్టీతో సంబంధం లేకుండా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.3 కోట్లు కేటాయించాం. ప్రజాప్రతినిధులు ప్రతి చిన్న అవసరం కోసం ఎదురుచూడకుండా, దేనికీ చేయిచాచకుండా వారి ఆత్మగౌరవాన్ని పెంచాం. ప్రజాప్రతినిధులు అడుగకముందే ప్రభుత్వం అన్నీ చేస్తున్నాం. తమ, పర పార్టీలనే తేడాలు చూపడం లేదు.

ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం..

కేంద్ర ప్రభుత్వం 1.91 కోట్ల మందికి కిలో రూ. 3 ధరకు బియ్యం ఇస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కిలో రూపాయి చొప్పున 2.74 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోలు ఇస్తున్నది. ఒక ఇంట్లో పదిమంది ఉంటే పరిమితులు లేకుండా 60 కిలోలు ఇస్తున్నాం.

ప్రతిపక్ష పార్టీలూ అభివృద్ధిని చూడండి

కాంగ్రెస్, బీజేపీ, సీపీఎంలు అనవసర రాద్ధాంతం చేయడం మానుకుని, పట్టణాలు, గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడాలి. విద్య, వైద్యం, వ్యవసాయం, తాగు, సాగునీరు.. ఇలా అన్ని అంశాల్లోనూ ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయి. పథకాల పేర్లుచెప్పి ఓట్లు అడుక్కోవటం మాకు చేతకాదు. మేం చేస్తున్న పనిని, కష్టాన్ని ప్రజలే చూస్తున్నారు. పనిచేసే వారెవరో, మాటలు చెప్పేవారెవరో ఇప్పటికే ప్రజలు గ్రహించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఏ పార్టీకీ పుట్టగతులుండవు. వచ్చేసారి కూడా టీఆర్ఎస్‌నే ప్రజలు ఆదరిస్తారు.

కేంద్రం నుంచి సహకారమేదీ?

కేంద్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఆశించిన దానికంటే చాలా తక్కువగా సహకారం అందుతున్నదని మంత్రి ఈటల చెప్పారు. 2014-15లో కేంద్రం నుంచి రూ.9,749 కోట్లు వస్తాయని ఆశిస్తే... రూ. 8,189 కోట్లు వచ్చాయని ఆయన లెక్కలు విప్పారు. '2015-16లో 12,823 కోట్లు ఆశిస్తే రూ.12,353 కోట్లు, 2016-17లో రూ.13,955 కోట్లకు రూ. 14,877 కోట్లు, 2017-18లో రూ. 17,004 కోట్లకు రూ.16,420 కోట్లు వచ్చినయి. సెంట్రల్ గ్రాంట్స్ కింద కూడా కేంద్రం నుంచి భారీగా నిధులు వస్తాయని, ఏపీ పునర్విభజన చట్టం 94(2) ప్రకారం కొత్తరాష్ట్రమైన తెలంగాణకు మంచి నిధులిస్తారని ఆశించినా అలా జరుగలేదు. 2014-15లో రూ. 21,721 కోట్లకు కేవలం రూ.7118 కోట్లు మాత్రమే వచ్చినయి. 2015-16లో రూ.12,404 కోట్లు అనుకుంటే రూ.9764 కోట్లు, 2016-17లో రూ. 14,557 కోట్లకు రూ.9752 కోట్లు మాత్రమే వచ్చినయి. రాష్ట్రాల స్థితిగతుల్ని నీతి ఆయోగ్ అధ్యయనం చేసే క్రమంలో తెలంగాణకు వచ్చినపుడు ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ కాకతీయను అభినందించి.. రూ.5వేల కోట్లు, మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. కానీ కేంద్రం మాత్రం ఒక్కపైసా ఇవ్వలేదు' అని వివరించారు.

కేంద్రానిది ఒక్కమంచి పథకమైనా ఉందా?

గత నాలుగేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మనసు దోచుకునే పలు పథకాలను ప్రవేశపెట్టిందని, కానీ కేంద్ర ప్రభుత్వం ఒక్క పథకమైనా వారికోసం తీసుకొచ్చిందా? అని ఆర్థికమంత్రి ఈటల ప్రశ్నించారు. 2014-15లో కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి బడ్జెట్ రూపకల్పనపై సీఎం కేసీఆర్ న్యాక్‌లో సమావేశం ఏర్పాటుచేశారని, అదే సమయంలో పార్లమెంటులో అరుణ్‌జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కేంద్రబడ్జెట్‌లో మహిళా, శిశు సంక్షేమశాఖ కేటాయింపులను రూ.17,800 కోట్ల నుంచి రూ.8 వేల కోట్లకు తగ్గించారన్నారు.

బీజేపీ నేతలు కేంద్రాన్ని నిలదీయాలి

కేంద్రం బీహార్, యూపీ తదితర రాష్ట్రాలకు ఆర్థిక సాయంచేస్తే మాకు ఇబ్బంది లేదని చెప్పాం. కొత్త రాష్ట్రానికి సాయం చేయాలని కేంద్రాన్ని పలుమార్లు కోరాం. కానీ స్పందన లేదు. బీజేపీ నేతల రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం కంటే కేంద్రంలో ఉన్న ఆ పార్టీ ప్రభుత్వాన్ని నిలదీస్తే మంచిదని చురక అంటించారు.

బడ్జెట్‌లో 95 శాతం ఖర్చుచేశాం

2017-18 బడ్జెట్‌లో 95 శాతం ఖర్చుచేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. గత నాలుగేండ్లుగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో ఖర్చు శాతాన్ని క్రమంగా పెంచుతున్నామని వివరించారు. 2014-15లో బడ్జెట్‌లో 62 శాతం, 2015-16లో 84.33 శాతం, 2016-17లో 93.34 శాతం ఖర్చుచేశామని చెప్పిన ఈటల 2017-18లో రూ.1,49,640 కోట్ల బడ్జెట్‌కుగాను సవరణ అంచనా ప్రకారం రూ.1,42,506 కోట్లు (95 శాతం) ఖర్చుపెట్టామని వివరించారు. 1868లోనే నిజాం హయాంలో ప్రధానమంత్రి సాలార్జంగ్ హైదరాబాద్-వాడి, హైదరాబాద్-ఖాజీపేట్, ఖాజీపేట్-బెజవాడ, ఖాజీపేట్-చాందా రైల్వేలైన్ల కోసం బ్రిటన్ దగ్గర అప్పు తీసుకున్నారని.. ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టుల కట్టేందుకు, సంక్షేమపథకాల కోసం తెలంగాణ ప్రభుత్వం అప్పు తీసుకోవడం తప్పా? అని ఈటల ప్రశ్నించారు. 2013-14లో దేశ జీడీపీ 5.9 ఉంటే, అప్పటి ఉమ్మడి ఏపీది 4.2 శాతం మాత్రమే ఉందని, కానీ 2017-18లో దేశ జీడీపీ సగటు కంటే తెలంగాణ సగటు ఎక్కువగా ఉందని, ఈ క్రమంలో రాష్ట్రం అభివృద్ధి చెందినట్లా? కాదా? అని మంత్రి ప్రశ్నించారు. ఐటీ రంగంలో రూ.85,470 కోట్ల ఎగుమతులు ఉన్నాయని, ఈ రంగంలో కర్ణాటక, తమిళనాడు తరువాత మూడోస్థానంలో తెలంగాణ ఉన్నదని, త్వరలో ఒకటి లేదా రెండోస్థానానికి చేరుకుంటామని మంత్రి ఈటల ఆకాంక్షించారు.

ప్రశ్నోత్తరాల సమయం

కొత్త డిగ్రీ కళాశాలల ఏర్పాటుపై సర్వే: కడియం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నదని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలు, అనుకూలతలను బట్టి వీలైనచోట డిగ్రీ కళాశాలలను ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా డిగ్రీ కళాశాలల ఏర్పాటుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు కడియం సమాధానం ఇచ్చారు. డిగ్రీ కళాశాలల ఏర్పాటుపై రాష్ట్రవ్యాప్తంగా 78 ప్రతిపాదనలు వచ్చాయని, ఈ డిమాండ్లను పరిశీలించాలని సీఎం కేసీఆర్ చెప్పారని.. ఆ మేరకు రాష్ట్రంలో కొత్త డిగ్రీ కళాశాలల ఏర్పాటుపై సర్వే జరుగుతున్నదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆమోదం మేరకు డిగ్రీ కళాశాలల ఏర్పాటు జరుగుతుందని కడియం స్పష్టంచేశారు.

గిరిజన రైతుల హక్కులను కాపాడుతాం


- శాసనమండలిలో ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెవెన్యూ రికార్డుల ప్రకారం గిరిజన ప్రాంతాలలోని గిరిజన భూములకు పక్కా రికార్డులను రూపొందిస్తామని, ఆయా ప్రాంతాలలోని న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ మంగళవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు. ఆదిలాబాద్, జయశంకర్‌భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో గిరిజనుల సాగు చేసుకుంటున్న పోడు భూముల వివాదాలకు సంబంధించి సభ్యులు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకొని.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండలి సభ్యులు కర్నె ప్రభాకర్.. సంస్థాన్ నారాయణ్‌పూర్, మంచాల మండలాల గిరిజనుల భూములు విషయాలను, పురాణం సతీశ్.. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా పోడు భూముల సమస్యలను, బాలసాని లక్ష్మీనారాయణ.. ఖమ్మం జిల్లా భూముల సమస్యలను ప్రస్తావించారు. సమస్యలన్నీ ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మహమూద్‌అలీ పేర్కొన్నారు.


బాల కార్మిక చట్టాలన్నింటినీ అమలు చేస్తున్నాం

- శాసనమండలిలో మంత్రి నాయిని నర్సింహారెడ్డి



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాలన్నింటినీ అమలు చేస్తున్నామని రాష్ట్ర హోం, కార్మికమంత్రి నాయిని నర్సింహారెడ్డి మంగళవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పేర్కొన్నారు. శాసనమండలిలో పల్లా రాజేశ్వరరెడ్డి, ప్రభాకరరావు, భూపతిరెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, పాతూరి సుధాకర్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. బాల కార్మికుల రక్షణ, పునరావాసం కోసం పోలీస్‌శాఖ సమన్వయంతో 'ఆపరేషన్ స్మైల్' కింద కార్మిక శాఖ ప్రత్యేక దాడులను చేపడుతున్నామని మంత్రి చెప్పారు. బాలకార్మిక చట్టాలు అమలు కావడం లేదని, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేపట్టాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. పేద ప్రజలు ఇళ్లు గడవకపోవడంవల్లనే పిల్లలను పనులకు పంపిస్తున్నారని, అటువంటి తల్లిదండ్రులకు ప్రత్యామ్నాయ సదుపాయాలను చేసే ఆలోచనలు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు 1446 కేసులు పెట్టామని, చట్టాలను అమలుచేస్తున్నామని, జిల్లా, రాష్ట్ర రీసోర్స్ సెంటర్ల ద్వారా శిక్షణను ఇస్తున్నామని చెప్పారు. వ్యవసాయ భూములలో, చిన్న చిన్న పరిశ్రమలలో, ప్రైవేట్ దవాఖానలలో, హోటళ్లలో బాలకార్మికులను ఉపయోగిస్తున్నట్లు తమ తనఖీలలో తేలిందని చెప్పారు. యజమానులకు రూ.20 వేల వరకు జరిమానాలు విధిస్తున్నామని ఆయన చెప్పారు.

రాష్ట్రమంతటా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు: లక్ష్మారెడ్డి



రాష్ట్రమంతటా ప్రజలందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర మంత్రి సీ లక్ష్మారెడ్డి మంగళవారం శాసనమండలిలో పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో క్యాన్సర్ పరీక్షల కేంద్రాలను ఏర్పాటుచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. వరంగల్ గ్రామీణ, వరంగల్ పట్టణ, జయశంకర్‌భూపాలపల్లి, జనగామ, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో క్యాన్సర్ పరీక్షా కేంద్రాలను నెలకొల్పామని ఈ కేంద్రాలలో రెండువేల మందికి ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ జరిగిందని మంత్రిచెప్పారు. కర్నె ప్రభాకర్, పాతూరి సుధాకర్‌రెడ్డి, భూపతిరెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలు చెప్పారు.

గ్రామాల్లో శ్మశానవాటికలు నిర్మిస్తున్నాం: జూపల్లి



గ్రామాల్లో శ్మశానవాటికల నిర్మాణాన్ని ప్రాధాన్య అంశంగా తీసుకున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా శ్మశానవాటికల నిర్మాణంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు జూపల్లి సమాధానం ఇచ్చారు. శ్మశానవాటికల నిర్మాణ అధికారాలు జిల్లా కలెక్టర్లకు ఇచ్చామని, వీటిని ఏర్పాటు చేసే ప్రాంతాల్లో టాయిలెట్ల నిర్మాణం ఉపాధిహామీ ద్వారానే జరుగుతున్నదని పేర్కొన్నారు. 'శ్మశానవాటికల నిర్మాణాలకు ప్రధాన సమస్య భూసేకరణ. సంబంధిత మంత్రులతో సమావేశం ఏర్పాటుచేసి సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటాం. శిఖం భూముల్లో శ్మశానవాటికల నిర్మాణానికి సంబంధించి పరిశీలన చేస్తున్నాం' అని జూపల్లి వివరించారు.

భూసేకరణ సమస్యను పరిష్కరిస్తున్నాం: తుమ్మల



రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నదని రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఇందుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను వివాదరహితంగా పూర్తిచేస్తున్నామని చెప్పారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 1,333 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను గుర్తించామని తెలిపారు. హైవేల కోసం రెండునెలల కిందట కేంద్రం రూ.8 వేలకోట్లు కేటాయించిందని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై కేంద్రం స్పందించాలి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు పెంచాలి. దీనిపై కేంద్రం స్పందించాలి. ఈ పార్లమెంటు సమావేశాల్లో రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడితేవాలి. బీసీలకు రాజ్యాధికారం కల్పించకపోతే దేశంలో తిరుగుబాటు మొదలవుతుంది. బీసీ జనాభాకు సరిపడా రాజకీయంగా రిజర్వేషన్లు అమలు కావడంలేదు. దేశంలోని 29రాష్ట్రాల్లో బీసీ ఎంపీల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది.

వరంగల్‌లో కొరియా పెట్టుబడులు

మూడేండ్లలో రూ.1,500 కోట్లు
- ఫలిస్తున్న మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనలు
- పరిశ్రమలశాఖ అధికారులతో టీకే కెమికల్స్ కార్పొరేషన్ బృందం భేటీ
- నేడు వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించనున్న బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు విదేశీ పర్యటనల్లో.. వివిధ కంపెనీలతో జరిపిన సంప్రదింపుల ఫలితంగా.. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వరంగల్‌లో నెలకొల్పుతున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టడానికి దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ కంపెనీ ముందుకొచ్చింది. మంగళవారం టీఎస్‌ఐఐసీ కార్యాలయంలో దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ వస్త్ర తయారీ సంస్థ టీకే కెమికల్స్ కార్పొరేషన్ ప్రతినిధి బృందం పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్‌ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డితో సమావేశమైంది. రాష్ట్ర మంత్రి కేటీఆర్ గతంలో కొరియాలో పర్యటించినప్పుడు టీకే కెమికల్స్ కార్పొరేషన్ టెక్స్‌టైల్ కంపెనీని సందర్శించారు. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. దీంతో ఆ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు టీకే కిమ్, జనరల్ మేనేజర్ ఎస్బీ కిమ్, అసిస్టెంట్ మేనేజర్ కేఎస్ క్వాన్, జియోన్ ఇంటర్నేషనల్ ఎండీ కార్తికేయ రాష్ట్రానికొచ్చారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో 50 ఎకరాల్లో పరిశ్రమను స్థాపించి మూడేండ్లలో రెండుదశల్లో రాష్ట్రంలో రూ.1,500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యారు. సంస్థ ప్రతినిధి బృందం బుధవారం వరంగల్ రూరల్ జిల్లాలో పార్కు ప్రతిపాదిత ప్రాంతాన్ని సందర్శించనున్నది. రాష్ట్ర ప్రభుత్వం వస్త్ర పరిశ్రామిభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నదని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ ఈ బృందానికి వివరించారు. పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. వస్త్ర పరిశ్రమకు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు, మానవ వనరులు, ముడిసరుకు, ఇతర అంశాలను జయేశ్‌రంజన్ వివరించారు. రాష్ట్రం సులభ వాణిజ్య విధానంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. టీఎస్‌ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. కంపెనీల పెట్టుబడులకు ఎలాంటి ఢోకా లేదని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అత్యద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జహీరాబాద్ నిమ్జ్ సీఈవో మధుసూదన్, కన్సల్టెంట్ ప్రతినిధులు అక్షయ్‌పటేల్, జ్ఞానేశ్వరన్, టీఎస్‌ఐఐసీ సీజీఎం శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌బీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్‌ఆర్‌బీ) (గ్రూప్-డీ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు మైనారిటీ సంక్షేమ శాఖ, తెలంగాణ స్టేట్ మైనారిటీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌ఏ షుకూర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే డివిజన్‌లోని 6523 గ్రూప్-డీ పోస్టులకు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసినట్టు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 9 నుంచి హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ మైనారిటీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 040-23236113 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టీఎస్‌ఆర్టీసీలో ఖాళీల భర్తీకి సానుకూలం

టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం, టీఎంయూతో మంత్రుల భేటీ



అసెంబ్లీ కమిటీహాల్‌లో మాట్లాడుతున్న నీటిపారుదలశాఖ మంత్రి, టీఎంయూ గౌరవ అధ్యక్షుడు టీ హరీశ్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, పట్నం మహేందర్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ జీవీ రమణారావు, టీఎంయూ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ)లో ఖాళీల భర్తీకి మంత్రులు సానుకూలంగా స్పందించినట్టు సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) తెలిపింది. నీటిపారుదలశాఖ మంత్రి, టీఎంయూ గౌరవ అధ్యక్షుడు టీ హరీశ్‌రావు, ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, రవాణాశాఖ మంత్రి పీ మహేందర్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీ కమిటీహాల్‌లో టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావు, ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ అశ్వత్థామరెడ్డి, అధ్యక్షుడు వీ తిరుపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడు థామస్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఆర్టీసీ యాజమాన్యం, టీఎంయూ నేతలు ఈ సందర్భంగా సంస్థ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. సంస్థలోని కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లతోపాటు మిగతా అన్ని క్యాటగిరీల్లో సిబ్బంది పదవీ విరమణ చేస్తుండటంతో ఏర్పడిన ఖాళీల భర్తీకి మంత్రులు సానుకూలంగా స్పందించినట్టు టీఎంయూ నేతలు సమావేశం అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదలచేశారు. సంబంధించిన నోటిఫికేషన్లను జారీ చేసుకోవాలని టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యానికి మంత్రులు సూచించినట్టు చెప్పారు. ఉద్యోగభద్రతకు యూనియన్ ప్రతినిధులు, యాజమాన్యంతో కూడిన కమిటీలతో మార్గదర్శకాల రూపకల్పనకు అంగీకరించారని, అక్రమ రవాణా అరికట్టడానికి జిల్లా, రాష్ట్రంలోని యూనియన్ ప్రతినిధులు, రవాణాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీని వేసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. టీఎస్‌ఆర్టీసీ కార్మికులకు 2017 ఏప్రిల్ 1 నుంచి రావాల్సిన జీతభత్యాల విషయంలో వారంలోగా మళ్లీ భేటీ నిర్వహించి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని నిర్ణయించినట్టు నేతలు తెలియజేశారు.

కేసీఆర్ పాలన స్వర్ణయుగం

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తున్నదని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్ కొనియాడారు. మంగళవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి పేదింటి ఆడబిడ్డ పెండ్లికి అందించే కల్యాణలక్ష్మి సాయాన్ని పెంచడం హర్షణీయమన్నారు. గతంలో పెండ్లిళ్లు చేయాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చేదని.. కానీ సీఎం కేసీఆర్ నిర్ణయంతో ఆ పరిస్థితి పోయిందన్నారు. పథకం ప్రారంభంలో రూ.51,000 ఆర్థికసాయం అందించేవారని.. ఆ తరువాత దాన్ని రూ.75,116 పెంచారని, తాజాగా రూ.1,00,116 పెంచడం గొప్ప విషయమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ఆడబిడ్డలకు సాయమందిస్తుండటంతో బాల్యవివాహాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో సిద్ది రాములు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బంగారు తెలంగాణలో మేము సైతం అంటున్న ఖైదీలు

- క్షమాభిక్ష పెట్టాలని సీఎంకు లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బంగారు తెలంగాణ సాధించడానికి సీఎం కే చంద్రశేఖర్‌రావు ఎంతో కృషి చేస్తున్నారని హైదరాబాద్, కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న పలువురు జీవితఖైదీలు పేర్కొన్నారు. ఈ మేరకు కొంత మంది జీవిత ఖైదీలు మంగళవారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. రాష్ట్రంలో ఉన్న కారాగారాల్లో ఏడేండ్లుగా జీవిత ఖైదీలుగా శిక్షను అనుభవిస్తున్నామని, బంగారు తెలంగాణలో భాగస్వాములయ్యేందుకు తమను విడుదల చేయాలని కోరారు. తెలంగాణ ఆవిర్భావ దినం జూన్ రెండున విడుదలకు అవకాశం కల్పిస్తూ జీవోను విడుదలచేయాలని ప్రాధేయపడ్డారు.

మంచిర్యాల కలెక్టర్ వ్యక్తిగత హాజరుకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మంచిర్యాల జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణతోపాటు నకిలీ పట్టాదార్ పాస్‌పుస్తకాలతో ఆక్రమణదారులు బ్యాంకుల నుంచి రుణాలు పొందిన వ్యవహారంపై నివేదిక సమర్పించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు జిల్లా కలెక్టర్ కర్ణన్‌పై ఉమ్మడి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నివేదిక సమర్పించడంలో జాప్యం చేయడమే కాకుండా గడువు కావాలని కోర్టుకు అఫిడవిట్ సమర్పించకపోవడాన్ని తప్పుబట్టింది. ఏప్రిల్ 3న వ్యక్తిగతంగా హాజరై వివరణ సమర్పించాలని జిల్లా కలెక్టర్‌కు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ విజయలక్ష్మి నేతృత్వంలోని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. జిల్లాలోని నెన్నల మండల పరిధిలో ప్రభుత్వ భూములకు దొంగ పాస్‌పుస్తకాలు సృష్టించిన ఆక్రమణదారులు గ్రామీణ బ్యాంకుల నుంచి రూ.కోట్ల మేర రుణాలు పొందిన ఘటనపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది.

నాసిరకం పురుగుమందులపై నిషేధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెసర్స్ స్టన్‌డర్ట్ పెస్టిసైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఎస్పీఎల్ 7 జీ 575 బ్యాచ్ నంబర్‌గల డైఫెన్‌తురన్ 50 శాతం డబ్ల్యూపీ (ట్రేడ్ నేమ్ పోలో) క్రిమిసంహారక పురుగుమందు నాసిరకమని కాన్పూర్ పురుగు మందుల పరీక్షా కేంద్రం గుర్తించింది. మెసర్స్ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి ఆర్161230101 బ్యాచ్ నంబర్ గల ప్రొఫినోఫాస్ 50 శాతం ఈసీ (ట్రేడ్‌నేమ్ అజంతా) క్రిమిసంహారక పురుగుమందును, మెసర్స్ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఎన్-318/122 బ్యాచ్ నంబర్ గల ఇకుమెక్టిన్ బెంజోట్ 1.50 శాతం, ఫిప్రొనిల్ 3.50 శాతం ఎస్సీ (ట్రేడ్‌నేమ్ అపెక్స్50) క్రిమిసంహారక పురుగుమందులను వరంగల్ పురుగుమందుల పరీక్షాకేంద్రం నాసిరకంగా గుర్తించింది. వీటిపై నిషేధం విధించినట్టు వ్యవసాయ సస్యరక్షణ అదనపు సంచాలకులు ప్రకటించారు.

ఏప్రిల్ 1 నుంచి జర్నలిస్టులకు ఆన్‌లైన్ బస్‌పాస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అక్రెడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఏప్రిల్ 1 నుంచి టీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్ ద్వారా బస్‌పాసు సౌకర్యం కల్పిస్తున్నట్లు సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ అరవింద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2018 డిసెంబర్ 31వరకు అక్రెడిటేషన్ కలిగి ఉన్న రాష్ట్రవ్యాప్త జర్నలిస్టులు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి మూడో విడుత కౌన్సెలింగ్!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల సీట్ల భర్తీ కోసం ఇప్పటివరకు రెండుదశల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. 2018-19 విద్యాసంవత్సరం నుంచి మూడో విడుత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యామండలి భావిస్తున్నది. దీనివల్ల జేఎన్టీయూహెచ్, ఓయూకు సంబంధించిన ఇంజినీరింగ్ కాలేజీల్లో మిగులుతున్న సీట్ల భర్తీకి అవకాశం ఉంటుంది. ఖాళీ అయిన సీట్లు మిగిలిపోకుండా మూడోవిడుత కౌన్సెలింగ్ నిర్వహించే అంశంపై కసరత్తు చేస్తున్నామని ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. త్వరలోనే తుది నిర్ణయం వెల్లడిస్తామన్నారు.

వర్సిటీ నూతన అధ్యాపకులకు 22నుంచి శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నూతనంగా నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సైంటిస్టులు, సబ్జెక్ట్‌మ్యాటర్ స్పెషలిస్టులకు ఈ నెల 22 నుంచి మూడు రోజులపాటు ఓరియంటేషన్ నిర్వహించనున్నారు. రాజేంద్రనగర్‌లోని ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సెల్ ఆధ్వర్యంలో వర్సిటీలోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం కొనసాగనున్నది.



ఎస్సీ ఉపకులాల సమరభేరి సభలో అభివాదం చేస్తున్న గద్దర్, వంగపల్లి శ్రీనివాస్, యాతాకుల భాస్కర్ తదితరులు

ఎస్సీ ఉపకులాలకు తహసీల్దార్ ద్వారా సర్టిఫికెట్లు ఇవ్వాలి

చిక్కడపల్లి: సంచార జీవితాలు గడుపుతూ అభివృద్ధికి నోచుకోని ఎస్సీ ఉపకులాలకు ఆర్డీవో ద్వారా కాకుండా తహసీల్దార్ ద్వారా కులధ్రువీకరణ పత్రాలను జారీచేయాలని ప్రజాగాయకుడు గద్దర్, టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఎస్సీ ఉపకులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ సాధనకు మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమరభేరి సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో ఎస్సీ ఉపకులాలు తీవ్ర అన్యాయానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. స్వరాష్ట్రంలోనైనా వారికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఎస్సీలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు మొదట ఎస్సీ ఉపకులాలకు అందిస్తేనే సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. వారికోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరారు. మాల, మాదిగలకు ఇస్తున్న విధంగానే ఉపకులాలకు కూడా తహసీల్దార్ల ద్వారా ధ్రువీకరణ పత్రాలు జారీచేయాలన్నారు. బైండ్ల వారిని గ్రామదేవతల ఆలయాల్లో పూజారులుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య మాదిగ, ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల భాస్కర్ బైండ్ల తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీఐ అవినీతి లీలలు

- రూ. 1.28 కోట్లు దండుకున్నట్టు నిర్ధారణ
- ఆరుగురు సీపీవోలు, 15 మంది ట్రేడర్లపై కేసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాలుగేండ్ల క్రితం పాత ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడిన సీసీఐ అధికారులు, ట్రేడర్లపై సీబీఐ కేసులు నమోదు చేసింది. ఆరు కొనుగోలు కేంద్రాల్లో ఒకే రైతు పేరిట అడ్డగోలుగా పత్తిని కొనుగోలు చేసి రూ. 1.28 కోట్లను దండుకున్నట్టు నిర్ధారణ కావడంతో సీబీఐ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఎన్ రాఘవేంద్రకుమార్ సోమవారం రాత్రి ఆదిలాబాద్ బ్రాంచ్‌లోని ఆరు సీసీఐ కేంద్రాల అధికారులు, 15మంది ట్రేడర్లపై కేసునమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పాత ఆదిలాబాద్ జిల్లాలోని జైనూర్, నార్నూర్, చెన్నూర్ కేంద్రాల్లో అప్పట్లో పనిచేసిన సీసీఐ పర్చేజ్ ఆఫీసర్లు (సీపీవోలు) మహేశ్ రమేశ్‌రావు కిటుకాలే, బీ రూపేశ్‌సింగ్, కేవీ కృష్ణారెడ్డి.. రైతుల పేరుతో వేల క్వింటాళ్ల పత్తిని అమ్మిన మదాద్ అలీ తేజానీ, షేక్ జమీర్, పీ రామేశ్వర్, జీ రంగారావులతోపాటు పొచ్చెర, నేరడిగొండ కేంద్రాల్లో పనిచేస్తున్న సీపీవోలు సీకే భట్టి, ఆర్ భగ్‌వాన్ షహరేతోపాటు రైతుల ముసుగులో ఉన్న ట్రేడర్లు రాకేశ్, రూపేశ్, శ్రీదేవి, సుజాత, స్వప్న, హరిచంద్‌తోపాటు ఆసిఫాబాద్ సెంటర్‌లో సీపీవోగా పనిచేస్తున్న ఎస్ సుభాశ్‌రావు దేశ్‌ముఖ్, ట్రేడర్లు.. ముబిన్ విరానీ, జివానీ రిజ్వాన్, బీ మల్లికార్జున్, జీ ప్రేమ్‌చంద్, టీ జగన్, పలువురిపై కేసులు చేశారు.

ఈ వృద్ధిరేటు చాలదు

ఏటా యువతకు సరిపడా ఉద్యోగాలు రావాలంటే రెండంకెల జీడీపీ అవసరం

ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



హాంకాంగ్, మార్చి 20: ఏటా 1.2 కోట్ల మందికి ఉపాధి లభించాలంటే 7.5 శాతం వృద్ధిరేటు భారత్‌కు చాలదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ఇక్కడ జరిగిన క్రెడిట్ సూసీ ఆసియన్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాజన్.. మంగళవారం సీఎన్‌బీసీకి ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగానే భారత్ తప్పక రెండంకెల వృద్ధిరేటును సాధించాలన్నారు. దేశంలో పెద్ద ఎత్తున యువత ఉన్నదని, లేబర్ మార్కెట్‌లోకి కొత్తగా 1.2 కోట్ల మంది ఉద్యోగాల కోసం వస్తున్నారని, వారికి కావాల్సిన ఉద్యోగావకాశాలు దొరకాలంటే ఇప్పుడున్న ఆర్థిక వృద్ధి సరిపోదన్నారు. కాగా, అధిక జీడీపీని అందుకునే సత్తా భారత్‌కు ఉందన్న రాజన్.. ఎన్నికలు పూర్తయితే రెండు, మూడేండ్లలో 10 శాతం వృద్ధిరేటును సొంతం చేసుకోగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వచ్చే సాధారణ ఎన్నికల వరకు సంస్కరణలు ఉండకపోవచ్చన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చిన రాజన్.. ఆ తర్వాత తిరిగి సంస్కరణలు పుంజుకోగలవన్నారు. దేశంలో ఇప్పుడు సంస్కరణలున్నప్పటికీ అవి ఆశించిన స్థాయిలో వేగవంతంగా లేవన్నారు. ఇక వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), పాత పెద్ద నోట్ల రద్దు, ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన సాయంపై మాట్లాడుతూ నిర్మాణాత్మక సంస్కరణల అమలు తదనంతర పరిణామాలు కొన్ని ప్రతికూల పరిస్థితులకు దారితీస్తాయని, ప్రభుత్వం వాటిని అధిగమించి ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. 2013 సెప్టెంబర్ నుంచి 2016 సెప్టెంబర్ వరకు ఆర్బీఐ గవర్నర్‌గా సేవలందించిన రాజన్.. ప్రస్తుతం చికాగో యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

డీజిల్ @ హోం డెలివరీ

సరికొత్త సేవల్ని అందుబాటులోకి తెచ్చిన ఐవోసీ ■ తొలుత పుణెలో సర్వీసులు ప్రారంభం ■ పెట్రోల్ అమ్మకాలకూ ప్రయత్నాలు



న్యూఢిల్లీ, మార్చి 20: ప్రస్తుత స్మార్ట్ ప్రపంచంలో కిరాణా సరుకుల నుంచి గృహోపకరణాల వరకు అన్నీ.. ఒక్క కాల్ లేదా ఎస్‌ఎంఎస్‌తో ఇంటికి వచ్చిపడుతున్నాయి. సంప్రదాయ మార్కెట్ నుంచి టెలీ షాపింగ్ వైపు వేగంగా అడుగులు పడుతున్న తరుణంలో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) కూడా నూతనంగా ఆలోచిస్తున్నది. ఇందులో భాగంగానే వాహనదారులకు డీజిల్‌ను ఇంటి వద్దనే అందిస్తామంటూ ఓ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. తొలుత పుణె వాసులకు ఈ సేవల్ని అందుబాటులోకి తెచ్చిన ఐవోసీ.. త్వరలో దేశవ్యాప్తంగా అమల్లోకి తెస్తామంటున్నది. కాగా, తమ అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఇంటి వద్దకే వచ్చి డీజిల్ పోసే ట్యాంకర్ ఫొటోనూ పోస్ట్ చేసింది. ఈ హోం డెలివరీ సర్వీసును పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పీఈఎస్‌వో) కూడా ఆమోదించినట్లు ఈ సందర్భంగా ఐవోసీ స్పష్టం చేసింది. అవసరమున్నవారు ముందుగానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారులకు పెట్రోల్, డీజిల్‌ను హోం డెలివరీ చేసేందుకున్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు గతేడాది ఏప్రిల్‌లోనే చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపిన విషయం తెలిసిందే. దేశంలోని ప్రధాన నగరాల్లో గంటల తరబడి పెట్రోల్, డీజిల్ కోసం బంకుల వద్ద వాహనదారులు పడిగాపులు కాయాల్సి వస్తుండటంతోనే హోం డెలివరీ యోచనలో ప్రభుత్వం పడింది. ఈ క్రమంలోనే ఇప్పుడు ఐవోసీ ఇంటి వద్దకే డీజిల్ సదుపాయంతో ముందుకొచ్చింది. డీజిల్‌తో పోల్చితే ఈ తరహా పెట్రోల్ అమ్మకాలు కొంత ప్రమాదకరంగా ఉండటంతోనే ముందుగా డీజిల్ అమ్మకాల్ని ప్రారంభించామని ఐవోసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ సింగ్ తెలిపారు. పెట్రోల్ అమ్మకాల్నీ ప్రారంభించేందుకు పీఈఎస్‌వోతో చమురు మార్కెటింగ్ సంస్థలు పనిచేస్తున్నట్లు చెప్పారు. నిజానికి గతేడాది జూన్‌లోనే బెంగళూరుకు చెందిన ఏఎన్‌బీ అనే స్టార్టప్ ఈ తరహా సర్వీసుల్ని మొదలు పెట్టింది. అయితే పీఈఎస్‌వో ఆదేశాలతో నిలిపివేసింది. రవాణాలో సరైన భద్రతా ప్రమాణాలను పాటించలేకపోతుండటమే అసలు కారణం. ఇదిలావుంటే కస్టమర్ల నుంచి ఎలాంటి స్పందన వస్తున్నది? ఎన్ని లీటర్ల వరకు ఆర్డర్ చేసుకోవచ్చు? చార్జీలు ఎలా ఉంటున్నాయి? అన్నదానిపై ఇంకా స్పష్టమైన సమాచారం లేదు.

జీఈకి రూ.309 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ, మార్చి 20: ఎన్టీపీసీ నుంచి రూ.309 కోట్ల ఆర్డర్ లభించినట్లు జీఈ పవర్ ఇండియా ప్రకటించింది. తెలంగాణలో ఎన్టీపీసీ నిర్మించతలపెట్టిన సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా ఎఫ్‌జీడీ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. కేంద్ర పర్యావరణ, అటవి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నూతన మార్గదర్శకాల తర్వాత వచ్చిన తొలి ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ) ఆర్డర్ ఇదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

నేను రాలేను


మరోసారి సీబీఐకి చోక్సీ లేఖ

న్యూఢిల్లీ, మార్చి 20: గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ.. సీబీఐ దర్యాప్తులో పాల్గొనలేనంటూ మరోసారి స్పష్టం చేశాడు. నీరవ్ మోదీతో కలిసి పీఎన్‌బీకి రూ.13,600 కోట్ల నష్టాన్ని తెచ్చిన చోక్సీ.. ఇటీవలి సీబీఐ సమన్లకు స్పందిస్తూ రాసిన తాజా లేఖలో భద్రతా కారణాల దృష్ట్యా భారత్‌కు రాలేనంటూ పేర్కొన్నాడు. గతంలో చెప్పినట్లుగానే తన ఆరోగ్యం బాగోలేదని, తన పాస్‌పోర్టును రద్దు చేశారన్నాడు. మీడియా వార్తలపైనా ఆందోళన వ్యక్తం చేశాడు.

సీబీఐ వల్లే రాలేకపోతున్నా..

మరోవైపు సీబీఐ వల్లే తాను భారత్‌కు రాలేకపోతున్నానని నీరవ్ మోదీ అంటున్నాడు. తన ఆఫీసు సర్వర్లను సీబీఐ స్వాధీనం చేసుకున్నదని, ఈ నేపథ్యంలో భారత్‌కు వస్తే తనను తాను కాపాడుకోలేనన్న నీరవ్.. విదేశాల్లో ఉన్న తన వ్యాపారాలను చూసుకోవాల్సి ఉన్నదని, తీరిక లేదంటూ తాజా మెయిల్‌లో పేర్కొన్నాడు. ఇదిలావుంటే సూరత్‌లోగల సెజ్‌లోని యూనిట్ల ద్వారా దేశీయ మార్కెట్‌కు రూ.890 కోట్ల విలువైన వజ్రాలు, ముత్యాలను నీరవ్, అతని సంస్థలు మళ్లించాయన్న ఆరోపణలపై డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ మంగళవారం ఓ కేసు నమోదు చేసింది.

జూకర్‌బర్గ్‌కు సమన్లు



లండన్, మార్చి 20: ఫేస్‌బుక్ అధినేత మార్క్ జూకర్‌బర్గ్‌కు మంగళవారం బ్రిటన్ పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేసింది. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేయడానికి 50 మిలియన్ల ఫేస్‌బుక్ ఖాతాదారుల డేటాను బ్రిటన్‌కు చెందిన రాజకీయ కన్సల్టింగ్ సంస్థ వాడుకున్నదన్న దానిపై జూకర్‌బర్గ్‌కు ఈ సమన్లు జారీ అయ్యాయి. మరోవైపు స్టాక్‌మార్కెట్‌లో ఫేస్‌బుక్ షేర్ల విలువ నాలుగేండ్లలో ఎన్నడూ లేనంతగా సోమవారం ఒక్క రోజే 10.8 శాతం మేర పతనమైంది.

ఎన్‌ఎండీసీ గనులకు ఫైవ్‌స్టార్ రేటింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎన్‌ఎండీసీకి చెందిన ఐదు ఇనుప ఖనిజ గనులకు ఫైవ్‌స్టార్ రేటింగ్ లభించింది. గనుల తవ్వకాల్లో వాడుతున్న టెక్నాలజీ, ఇతర విషయాల ఆధారంగా ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ సర్వేలో.. ఛత్తీస్‌గఢ్ బచేలిలోని రెండు మైన్లు, కిరణ్‌దూల్ కాంప్లెక్స్‌లోని రెండు మైన్లు, కర్ణాటకలోని డోనిమాలై గనులకు ఫైవ్‌స్టార్ రేటింగ్ దక్కింది.

'డ్రాగన్'కు షాక్ ట్రీట్‌మెంట్!



- మేధో సంపత్తి చౌర్యంపై 'పెద్దన్న' ఆగ్రహం
- 60 బిలియన్ డాలర్ల సుంకాలు విధించేందుకు రెడీ
- కొద్ది రోజుల్లో 'ప్యాకేజీ'ని ప్రకటించనున్న డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, మార్చి 20: ప్రపంచ దేశాల నుంచి మేధో సంపత్తిని తస్కరించి సొమ్ము చేసుకుంటున్న చైనాను శిక్షించి తీరుతామని పదేపదే హెచ్చరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు 'డ్రాగన్'కు షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సాలీనా 60 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.90 లక్షల కోట్ల) సుంకాల ప్యాకేజీతో చైనాను చావుదెబ్బ కొట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్యాకేజీని ట్రంప్ శుక్రవారం ప్రకటించాలని యోచిస్తున్నట్లు ఆయన సర్కారులోని నలుగురు సీనియర్ అధికారులు ధృవీకరించారని 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక వెల్లడించింది. చైనా ఉత్పత్తులపై ఏటా 30 బిలియన్ డాలర్ల సుంకాలను విధించేందుకు ఉద్దేశించిన ప్యాకేజీని సీనియర్ అధికారులు ఇటీవల ట్రంప్ ముందుంచారని, అయితే ఈ ప్యాకేజీని రెట్టింపు చేయాల్సిందిగా వారిని ఆయన ఆదేశించారని తెలుస్తున్నది. అమెరికా సంస్థల వ్యాపార రహస్యాలను దొంగిలించి లేదా వాటిని బలవంతంగా స్వాధీనం చేసుకుని చైనా అనేక రకాల వస్తువులను తయారు చేస్తున్నదని ఎప్పటి నుంచో వాదిస్తున్న ట్రంప్.. అటువంటి వందకుపైగా ఉత్పత్తులకు ఈ సుంకాల ప్యాకేజీని వర్తింపజేసే అవకాశమున్నది.


దిగుమతి సుంకాలు దారుణం

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా విధించిన భారీ సుంకాలు దారుణమని మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన డబ్ల్యూటీవో మంత్రివర్గ సమావేశ సభ్యులు ఖండించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ సమావేశం మంగళవారం ముగిసింది.

టాటా ప్యాసింజర్ వాహనాలు ప్రియం

ధరలను రూ.60 వేల వరకు పెంచిన సంస్థ

న్యూఢిల్లీ, మార్చి 20: ప్రముఖ ఆటోమొబైల్ ఉత్పత్తి సంస్థ టాటా మోటార్స్ తన ప్యాసింజర్ వాహన ధరలను రూ.60 వేల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. తయారీకోసం పెట్టే ఖర్చు అధికమవడం వల్లనే ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. పెంచిన ధరలు వచ్చే నెల 1 నుంచి అమలులోకి రానున్నాయి. ప్రస్తుతం సంస్థ రూ.2.28 లక్షలు మొదలుకొని రూ.17.42 లక్షల లోపు ధర కలిగిన పలు రకాల ప్యాసింజర్ వాహనాలను ఢిల్లీ మార్కెట్లో విక్రయిస్తున్నది. నిర్వహణ ఖర్చులు అంతకంతకు పెరుగడం, మార్కెట్ పరిస్థితులు మారిపోవడం, ఇతర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ధరలను పెంచాల్సి వచ్చిందని టాటా మోటార్స్ ప్రెసిడెంట్(ప్యాసింజర్ వాహన బిజినెస్) మయాంక్ పరేఖ్ తెలిపారు. గడిచిన వారంలో జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ ఆడీ రూ.9 లక్షల వరకు పెంచిన విషయం తెలిసిందే.



నిస్సాన్ కూడా..

జపాన్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ నిస్సాన్ కూడా తన వాహన ధరలను పెంచింది. వచ్చే నెల 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల కార్ల ధరలను 2 శాతం వరకు పెంచినట్లు మంగళవారం ప్రకటించింది. ప్రస్తుతం సంస్థ రూ.2.49 లక్షల నుంచి రూ.14.46 లక్షల లోపు కలిగిన పలు రకాల మోడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

టాప్-10 ప్యాసింజర్ వాహనాల్లో తొలిసారిగా మహీంద్రా బొలెరో



న్యూఢిల్లీ, మార్చి 20: గడిచిన నెలలో దేశవ్యాప్తంగా అమ్ముడైన పది ప్యాసింజర్ వాహన విక్రయాల్లో తొలిసారిగా మహీంద్రా అండ్ మహీంద్రాకు చెందిన యుటిలిటీ వాహనమైన బొలెరో చోటు దక్కించుకున్నది. ఈ జాబితాలో కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఫిబ్రవరిలో అమ్ముడైన పీవీల్లో మారుతికి చెందిన ఆరింటికి చోటు లభించింది. వివరాల్లోకి వెళ్లితే..రెండేండ్ల తర్వాత మహీంద్రా బొలెరో 8,001 యూనిట్లు అమ్ముడై చివరి స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మారుతికి చెందిన ఎంట్రీలెవల్ కారైన ఆల్టో 19,760 యూనిట్లతో తన తొలిస్థానాన్ని పదిలం చేసుకున్నది. అలాగే కంపెనీకి చెందిన సెడాన్ డిజైర్‌కు రెండోస్థానం (17,784), నూతన స్విఫ్ట్‌కు మూడో స్థానం (17,291) లభించాయి. మారుతికి చెందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో నాలుగో స్థానానికి ఎగబాకింది. 15,807 యూనిట్ల విక్రయాలతో ఈ స్థానానికి చేరుకున్నది. గతేడాది మూడో స్థానంలో ఉన్న వ్యాగన్ ఆర్..ఈసారి ఐదో స్థానంతో సరిపెట్టుకున్నది. హ్యుందాయ్‌కు చెందిన ఎలైట్ ఐ20కి ఆరో స్థానం లభించింది. ఆ తర్వాతి స్థానంలో మారుతికి చెందిన విటారా బ్రెజా ఉండగా, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10, ఎస్‌యూవీ క్రెటాలు వరుస స్థానాలు లభించాయి. కానీ మారుతి సెలేరియో, రెనో క్విడ్‌లు ఈసారి తమ స్థానాన్ని కోల్పోయాయి.

చక్కెరపై ఎగుమతి సుంకం రద్దు




న్యూఢిల్లీ, మార్చి 20: చక్కెరపై ఎగుమతి సుంకాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం నాడు ప్రకటించింది. ప్రస్తుత మార్కెటింగ్ సీజన్‌లో దేశీయంగా రికార్డు స్థాయిలో 29.5 మిలియన్ టన్నుల చక్కెర ఉత్పత్తికి రంగం సిద్ధమవడంతో ఎగుమతులకు ఊతమిచ్చేందుకు ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. ఇందుకు సంబంధించి కేంద్ర ఎక్సైజ్, కస్టమ్స్ బోర్డు (సీబీఈసీ) ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ముడి చక్కెరతో పాటు రిఫైన్డ్ (తెల్ల) చక్కెరపై ప్రస్తుతం 20 శాతంగా ఉన్న ఎగుమతి సుంకాన్ని పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయించామని సీబీఈసీ ఆ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. గతంలో ప్రభుత్వం దిగుమతులను నియంత్రించేందుకు చక్కెరపై దిగుమతి సుంకాన్ని రెట్టింపు చేసి 100 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. అయితే ప్రపంచంలో అత్యధికంగా చక్కెరను ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో రెండవదిగా ఉన్న మన దేశంలో గత ఏడాది 20.3 మిలియన్ టన్నులుగా ఉన్న చక్కెర ఉత్పత్తి ప్రస్తుత 2017-18 మార్కెటింగ్ సంవత్సరం (అక్టోబర్-సెప్టెంబర్)లో గణనీయంగా పెరిగి 29.5 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. దేశీయ అవసరాల కోసం సాలీనా 24-25 మిలియన్ టన్నుల చక్కెర సరిపోతుండగా, ప్రస్తుత మార్కెటింగ్ సంవత్సరంలో ఈ నెల 15వ తేదీ నాటికే 25.80 మిలియన్ టన్నుల చక్కెర ఉత్పత్తి జరిగింది. మరోవైపు దేశంలో చక్కెర ధరలు ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ స్థాయికి పడిపోవడంతో మిగులు నిల్వలను వదిలించుకునేందుకు వీలుగా ఎగుమతి సుంకాన్ని రద్దుచేయాలని ఇస్మా (ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్), ఎన్‌ఎఫ్‌సీఎస్‌ఎఫ్ (సహకార చక్కెర కర్మాగారాల జాతీయ సమాఖ్య) చాలా రోజుల నుంచి డిమాండ్ చేస్తుండటంతో ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది.

వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో కొత్త టెలికం పాలసీ

న్యూఢిల్లీ, మార్చి 20: నూతన టెలికం విధానం దాదాపుగా సిద్ధమైందని, మంత్రివర్గం ఆమోదించిన తర్వాత దీనిని తదుపరి సమావేశాల సందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెడుతామని కేంద్ర మంత్రి మనోజ్ సిన్హా వెల్లడించారు. 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన' అవార్డు ప్రదానోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. 'కొత్త టెలికం విధానం దాదాపుగా సిద్ధమైంది. ఈ నెలలో దీనిని టెలికం వెబ్‌సైట్‌లో పెట్టి ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తాం. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ పాలసీని వచ్చే సమావేశాల సందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెడుతాం' అని స్పష్టం చేశారు.

సుప్రీం కోర్టుకు ఆర్‌కామ్ రుణదాతలు



ముంబై, మార్చి 20: రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) ఆస్తుల విక్రయం కోసం ఎస్‌బీఐ నేతృత్వంలోని రుణదాతలు సుప్రీం కోర్టుకు వెళ్లారు. అనిల్ అంబానీకి చెందిన ఈ ప్రైవేట్ రంగ టెలికం సంస్థ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన విషయం తెలిసిందే. రూ.45,000 కోట్ల రుణ భారాన్ని ఆర్‌కామ్ మోస్తుండగా, సంస్థ ఆస్తుల్ని అనుమతి లేకుండా అమ్మడంగానీ.. ఇతరులకు బదలాయించడంగానీ చేయరాదంటూ ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ బాంబే హైకోర్టును ఆశ్రయించిన ఆర్‌కామ్‌కు నిరాశే మిగలగా, హై కోర్టు తీర్పునూ సవాల్ చేస్తూ గత వారం సుప్రీం కోర్టుకు వెళ్లింది. ఈ క్రమంలోనే ఆర్‌కామ్‌కు రుణాలిచ్చిన ఎస్‌బీఐ సారథ్యంలోని బ్యాంకుల కూటమీ అత్యున్నత న్యాయస్థానం గడప తొక్కాయి. ఈ కేసు గురువారం విచారణకు రానున్నది. ఆర్‌కామ్ ఆస్తుల్ని అమ్ముకునే హక్కు.. దానికి రుణాలిచ్చిన బ్యాంకులకే తొలుత ఉంటుందని ఎస్‌బీఐకి చెందిన సీనియర్ ఉద్యోగి ఒకరు అంటున్నారు. కాగా, అన్న ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు తమ స్పెక్ట్రమ్, ఫైబర్ నెట్‌వర్క్, టవర్లు ఇతరత్రా ఆస్తుల్ని అమ్మేసేందుకు గతేడాది డిసెంబర్‌లోనే అనిల్ అంబానీ ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. అయితే మా బకాయిల మాటేమిటి? అంటూ టెలికం ఎక్విప్‌మెంట్ సరఫరాదారు ఎరిక్సన్ వేసిన ఆర్బిట్రేషన్‌పై ట్రిబ్యునల్ స్పందిస్తూ ఆర్‌కామ్ ఆలోచనలకు బ్రేకులు వేసింది. ఇప్పుడు బ్యాంకర్లు కూడా సుప్రీంకు వెళ్లడంతో ఆర్‌కామ్-జియో ఒప్పందంపై నీలినీడలు కమ్ముంటున్నాయి. ఒప్పందం ప్రకారం ఈ నెలాఖర్లోగా జియోకు ఆర్‌కామ్ ఆస్తుల్ని అప్పగించాల్సి ఉన్నది. ఈ డీల్ విలువ దాదాపు రూ.25,000 కోట్లు.

బీమా వ్యాపారానికి వీడియోకాన్ గుడ్‌బై

లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలోని పూర్తి వాటా అమ్మకం

Liberty Videocon Insurance

ముంబై, మార్చి 20: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)లో దివాలా కేసును ఎదుర్కొంటున్న వీడియోకాన్ గ్రూపు సాధారణ బీమా వ్యాపారం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. అమెరికా సంస్థ లిబర్టీ మ్యూచువల్ ఇన్సూరెన్స్ గ్రూపు భాగస్వామిగా ఉన్న న్యూ లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో తమకు గల మొత్తం వాటాను డీపీ జిందాల్ గ్రూపుతో పాటు ఇనామ్ సెక్యూరిటీస్ సంస్థకు అమ్మేసినట్లు వీడియోకాన్ గ్రూపు మంగళవారం స్పష్టం చేసింది. దీంతో న్యూ లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో డీపీ జిందాల్ 26 శాతం, ఇనామ్ సెక్యూరిటీస్ 25 శాతం వాటాను కలిగి ఉంటాయి. అయితే ఈ వాటాలను ఎంత మొత్తానికి అమ్మినదీ వీడియోకాన్ వెల్లడించలేదు. న్యూ లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఇంతకుముందు 26 శాతం వాటాను కలిగివున్న లిబర్టీ మ్యూచువల్ ఇన్సూరెన్స్ గ్రూపు గత డిసెంబర్‌లో దానిని 49 శాతానికి పెంచుకున్నది. ప్రస్తుతం దేశంలో న్యూ లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి 23 రాష్ట్రాల్లోని 58 నగరాల్లో 60 కార్యాలయాలు ఉన్నాయి.

ఎన్డీపీ లిక్కర్‌తో ఖజానాకు భారీ గండి

ఏడాదికి రూ. 20 కోట్ల నష్టం

6 నెలల్లో రూ.10 కోట్ల విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్‌శాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అక్రమంగా రవాణా అవుతున్న నాన్ డ్యూటీ పెయిడ్(ఎన్డీపీ) విదేశీ మద్యంతో రాష్ట్ర ఆదాయానికి భారీగా గండిపడుతున్నది. ఎన్డీపీ మద్యం ఇటీవల వరుసగా పట్టుబడుతున్న ఉదంతాలనే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. రాష్ట్రంలో గుట్టుచప్పుడు కాకుండా విదేశీ మద్యం విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో ఖజానాకు ఏడాదికి రూ. 20 కోట్ల వరకు నష్టం వాటిల్లుతున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఎక్సైజ్, పోలీస్‌శాఖలు వేర్వేరుగా చేస్తున్న దాడుల్లో విదేశీ మద్యంతోపాటు ప్రమాదకరమైన మాదక ద్రవ్యాలు కూడా పట్టుపడుతున్నాయి. ఎక్సైజ్‌శాఖ 6 నెలల్లో సుమారుగా 2,600 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. వీటి విలువ దాదాపు రూ. 10 కోట్ల వరకు ఉంటుందని అధికారుల అంచనా. అయితే పట్టుపడుతున్నది 50 శాతమేనని అధికారులు భావిస్తున్నారు.

నెలకు 70 లక్షల ఆదాయం పెరుగుదల

విదేశీ మద్యం అక్రమ సరఫరాను నియంత్రించడం వల్ల రాష్ట్ర ఆదాయం నెలకు రూ. 70 లక్షల వరకు పెరిగింది. 8 నెలల క్రితం హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో విదేశీ మద్యం అక్రమ అమ్మకాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేసిన దాడుల నేపథ్యంలో ఈ ఆదాయం మరింతగా పెరిగినట్టు తెలుస్తున్నది. ఎయిర్‌పోర్టులోఉన్న డ్యూటీ పెయిడ్ ఫ్రీ షాప్ (అవుట్‌లెట్) ద్వారా విదేశాలకు వెళ్లివచ్చే ప్రయాణికులకు విదేశీ మద్యం బాటిళ్లు ఒక్కొక్కరికి 2 బాటిళ్ల చొప్పున విక్రయిస్తారు. ఇక్కడ దొరికే విదేశీ మద్యం నాన్‌డ్యూటీ పెయిడ్ కాబట్టి 60 శాతం తక్కువకు మద్యం బాటిళ్లు దొరుకుతాయి. అయితే అప్పట్లో విదేశీ మద్యం అక్రమాల బాట పట్టినట్టు వచ్చిన సమాచారం మేరకు రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక దాడులు చేసింది. పలువురు సెంట్రల్ కస్టమ్స్ అధికారులపై, షాపులో ఉన్న పలువురు ఉద్యోగులపై కేసులు నమోదు చేసింది. అప్పటి నుంచి అక్రమంగా విదేశీ మద్యం బయటి మార్కెట్లోకి రాకుండా నియంత్రించబడింది.

దాడిచేసినవారిపై చర్యలు

రెవెన్యూ ఉద్యోగులకు డిప్యూటీ సీఎం మహమూద్ అలీ హామీ



సచివాలయంలో రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరుపుతున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై దాడిచేసినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ రెవెన్యూ ఉద్యోగులకు హామీఇచ్చారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందిపై దుండగులు దాడిచేశారు. ఉద్యోగులపై జరిగిన దాడిని ఖండిస్తూ హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఆందోళనల నేపథ్యంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ మంగళవారం సచివాలయంలో రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల సమస్యలపై సానుకూల దృక్పథంతో ఉన్నామని వాటిని పరిశీలిస్తామని హామీఇచ్చారు. హైదరాబాద్ ఉద్యోగ సంఘాల నాయకులు, జిల్లా కలెక్టర్‌తో త్వరలో సమావేశం ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఆయన హామీతో ఉద్యోగులు ఆందోళనను విరమించి విధులకు హాజరయ్యేందుకు అంగీకరించారు. సమావేశంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివశంకర్, తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి, విలేజ్ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు గోల్కొండ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నాసా-స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో శ్రీచైతన్య స్కూల్స్ ప్రతిభ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాసా- నేషనల్ స్పేస్ సొసైటీ, అమెరికా వారి నాసా ఏమ్స్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ 2018లో శ్రీచైతన్య స్కూల్స్ సత్తాచాటాయని శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా 334 మంది శ్రీచైతన్య విద్యార్థులు వారి ప్రాజెక్టులకు అవార్డులు సాధించారని పేర్కొన్నారు. విద్యాసంస్థను వరుసగా ఐదోసారి కూడా వరల్డ్ ఛాంపియన్‌గా నిలిపారని చెప్పారు. శ్రీచైతన్య విద్యార్థులు వరల్డ్ మొదటి ప్రైజ్‌లు రెండు, రెండో ప్రైజ్‌లు 6, మూడోప్రైజ్‌లు 7, హానరేబుల్ బహుమతులు 20, విన్నింగ్ ప్రాజెక్టులు 35 సాధించారని ఆమె తెలిపారు. సత్తాచాటిన విద్యార్థులను, అధ్యాపకులను శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు అభినందించారు.



మంగళవారం అసెంబ్లీలో మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు జువ్వాడి శ్రీనివాసరావు. చిత్రంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు

ఎన్నారై సంక్షేమ నిధిని గల్ఫ్ కార్మికులకు కేటాయించాలి

మంత్రులు కేటీఆర్, ఈటలను కలిసిన గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ అసోసియేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రవాస భారతీయుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రూ.100 కోట్లను గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి వెచ్చించాలని గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు జువ్వాడి శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి పొట్టూరి బసంత్‌రెడ్డి కోరారు. ఎన్నారై సంక్షేమానికి బడ్జెట్‌లో అధికమొత్తంలో నిధులు కేటాయించినందుకు మంగళవారం గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్ కల్చరల్ అసోసియేషన్ బృందం.. ఎమ్మెల్యే సీహెచ్ రమేశ్‌బాబుతో కలిసి మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపింది. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని బృందం సభ్యులు కొనియాడారు. మిషన్ కాకతీయ, మిషన్‌భగీరథ పథకాలు అంతర్జాతీయంగా ఖ్యాతి పొందుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికుల సమస్యలను మంత్రులకు వివరించారు. గల్ఫ్ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలుచేసేందుకు ప్రత్యేక విధివిధానాలను రూపొందించాలని కోరారు. రాష్ట్రం నుంచి గల్ఫ్‌కు వచ్చినవారిలో 60 మంది చనిపోయారని, వారికి పరిహారం ఇవ్వాలని, కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గల్ఫ్‌లో చదివిన విద్యార్థులను తెలంగాణ విద్యార్థులుగానే గుర్తించాలని, విదేశీ జైళ్లలో మగ్గుతున్న వారికి న్యాయ సాయం చేయాలని కోరారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి కేటీఆర్ వారికి హామీఇచ్చారు.

ఊరపిచ్చుకల మనుగడపై చిత్రప్రదర్శన



మంగళవారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ప్రపంచ ఊరపిచ్చుకల దినోత్సవం సందర్భంగా చిత్రప్రదర్శనను తిలకిస్తున్న డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయకళాశాలలో మంగళవారం ప్రపంచ ఊరపిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆడిటోరియం సమీపంలో చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. సరైన ఆవాసాలు, ఆహారం, బ్రీడింగ్ కోసం సౌకర్యాలు లేకపోవడంతో ఊరపిచ్చుకల సంఖ్య తగ్గిపోతుండటాన్ని, పెరిగిపోతున్న పట్టణీకరణ వల్ల పక్షులు ఆవాసాలు కోల్పోయి ప్రమాదాలబారిన పడుతున్నతీరును విద్యార్థులు సందేశాత్మకంగా చిత్రీకరించారు. ఊరపిచ్చుకల సంఖ్య తగ్గిపోవడానికి గల కారణాలను విశ్వవిద్యాలయ ఆర్నిథాలజీ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వాసుదేవరావు వివరించారు. ఆర్టిస్ట్, ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్యామ్యూల్, డాక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా..

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మొత్తం పెంపుపై హర్షాతిరేకాలు
- ఊరూరా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద పేదింటి ఆడబిడ్డల పెండ్లికి సీఎం కేసీఆర్ మేనమామలా అండగా నిలుస్తున్నారని అన్నివర్గాల ప్రజలు, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఇతర సంఘాల వారు కీర్తిస్తున్నారు. ఇప్పటివరకు రూ.75,116 అందిస్తున్న మొత్తాన్ని రూ.1,00,116కు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా సంబురాలు కొనసాగాయి. సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. పటాకులు కాలుస్తూ, స్వీట్లు పంచి పెట్టారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, జైనూర్ మండలాలతోపాటు కాగజ్‌నగర్ పట్టణం, చింతల మానేపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, కౌటాల మండలాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్, నెన్నెల, సీసీసీ నస్పూర్ మండలాలు, కరీంనగర్ జిల్లా కేంద్రంతోపాటు హుజూరాబాద్, సైదాపూర్, గంగాధర, రామడుగు, మండల కేంద్రాలు, తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీకాలనీలో టీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలోని పాల్గొని సంబురాలు జరిపారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో, గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్‌లో, ఎల్కతుర్తి మండలం సూరారంలో, నాల్గో డివిజన్ పరిధిలో, జనగామ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో, బచ్చన్నపేట, రఘునాథపల్లి, దేవరుప్పులలో, భూపాలపల్లి జిల్లా ములుగు మండలం జీవంతరావుపల్లి, మంగపేటలో, ములుగులో, మహబూబాబాద్ జిల్లా మరిపెడ, చిన్నగూడూరు మండలాల్లో, డోర్నకల్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరులో సీఎం కేసీఆర్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నెక్కొండ, గీసుకొండ మండలం శాయంపేటలో, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని షేరెల్లి వీధిలో, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో, బజార్ హత్నూర్‌లో, ఉట్నూర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఆర్‌ఎస్ నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో, హన్మాజీపేట్, నస్రుల్లాబాద్‌లోని చెక్‌పోస్టు ఆవరణలో, బాన్సువాడలోని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద, పిట్లంలో, పెద్దకొడప్‌గల్‌లో, జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో, సదాశివనగర్ మండలం ఉత్తునూరులో క్షీరాభిషేకాలు నిర్వహించారు. నిజామాబాద్ నగరంలో టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, మేయర్ ఆకుల సుజాత ఆధ్వర్యంలో, కమ్మర్‌పల్లి, డిచ్‌పల్లి, బోధన్, వర్ని, కోటగిరి మండలాల్లో, నిర్మల్‌తోపాటు భైంసాలో క్షీరాభిషేకాలు నిర్వహించి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా సంబురాలు నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో టీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అమ్రాబాద్ మండలాల్లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నల్లగొండ జిల్లాలోని 31మండలాల్లో క్షీరాభిషేకం నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో సూర్యాపేట, నల్లగొండ జిల్లాల మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్గనైజర్ మాలె శరణ్యారెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు







నిజామాబాద్‌లో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ ఆకుల సుజాత, కార్పొరేటర్లు, టీఆర్‌ఎస్ నాయకులు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో.. మహబూబ్‌నగర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మంత్రి ఈటల పుట్టిన రోజు సందర్భంగా కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ

ఘనంగా మంత్రి ఈటల జన్మదిన వేడుకలు

ముకరంపుర: ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను మంగళవారం కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. టీఆర్‌ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ పొన్నం అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ కేక్ కట్ చేసి స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కరీంనగర్ అసెంబ్లీ టీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు ఫహాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లోనూ ఘనంగా ఈటల జన్మదిన వేడుకలు నిర్వహించారు.



భద్రాచల రామాలయ అర్చకులకు సంఘీభావం తెలుపుతున్న తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం అర్చకులు

భద్రాద్రిపై ఆంధ్రుల కుట్ర

తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం అర్చకుల వెల్లడి

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాద్రి రామాలయ వైభవానికి భంగం కలిగించేందుకు ఆంధ్రులు కుట్ర పన్నుతున్నారని తెలంగాణ శ్రీవైష్ణవ సేవాసంఘం బడంగిపేట అర్చకులు చక్రవర్తుల జగన్మోహనాచార్యులు, తిరుమలాచార్యులు వంశీకృష్ణామాచార్యులు, రామమోహనాచార్యులు, సముద్రాల నర్సింహాచార్యులు ఆరోపించారు. మంగళవారం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం అర్చకులను కలిసి రామాలయంలో ఇటీవల జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి ప్రభాకర శ్రీనివాస్‌ను కలిసి అర్చకులపై దాడులు జరుగడం సమంజసం కాదని దీనిపై విచారణ నిర్వహించాలని విన్నవించారు. ఆలయ అర్చకులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. సీఎం కేసీఆర్ యాదాద్రి, భద్రాద్రిని తన రెండు కండ్లుగా భావించి ఆలయాల ప్రగతికి ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఇటీవల భద్రాచలం రామాలయంలో కావాలనే కొందరు అద్వైతులు సంప్రదాయ దాడికి పూనుకున్నారని, భౌతికదాడులకు కూడా వెనుకాడటం లేదని ఆరోపించారు. స్వామీజీల పేరుతో శాస్త్ర వంచన చేసి ధర్మ నిష్టను, ఆలయ కైంకర్యాలను భగ్నపరిచే వారిని సహించబోమని వెల్లడించారు. అనంతరం తెలంగాణ శ్రీవైష్ణవ ఆలయ సంప్రదాయ పరిరక్షణ సభ ఏర్పాటు చేశారు.

టెన్త్ ప్రశ్నపత్రం లీకేజీలో 15 మందిపై కేసు

13 మంది ఇన్విజిలేటర్ల సస్పెన్షన్

మరికల్: మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పదోతరగతి ఇంగ్లిష్ మొదటి పేపర్ లీకేజీకి సంబంధించిన వ్యవహారంలో 15 మందిపై కేసు నమోదు చేసినట్టు నారాయణపేట డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన మరికల్‌లో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. నవీన్ అనే యువకుడి సోదరి పరీక్ష రాస్తుండగా ఆమె నుంచి పేపర్‌ను ఫోన్‌లో ఫొటో తీసి బయటకొచ్చి ప్రవీణ్, మోహన్‌లకు షేరిట్ ద్వారా పంపించగా వారు మణికంఠకు.. ఇంగ్లిష్ టీచర్ జోసెఫ్‌కు వాట్సప్‌లో పంపించినట్టు చెప్పారు. టీచర్ జవాబులు ఇచ్చినట్టు చెప్పారు. ఇలా ఒకరి నుంచి మరొకరికి వాట్సప్ ద్వారా ప్రశ్నపత్రాన్ని పంపించినట్టు విచారణలో తేలిందన్నారు. లీకేజీకి కారణమైన 15 మందిని కోర్టులో హాజరుపర్చగా 11 మందిని రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. పరీక్ష పేపర్ లీక్ కేంద్రంలో విధులు నిర్వహించిన 13 మంది ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేస్తూ డీఈవో సోమిరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

భగ్గుమంటున్న భానుడు

రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భానుడి తాపం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ఎండలు మళ్లీ విజృంభిస్తున్నాయి. బుధ, గురువారాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉన్నట్టు టీఎస్‌డీపీఎస్ అధికారులు తెలిపారు. అల్పపీడన ప్రభావం లేకపోవడంతోపాటు వాయవ్యం నుంచి వీస్తున్న వేడి గాలులతో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయన్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. ఆదిలాబాద్ జిల్లాలో 39.7 డిగ్రీలు, కరీంనగర్, కామారెడ్డి, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో 39.3 డిగ్రీలు, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 39 డిగ్రీలు, జగిత్యాలలో 38.9 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లిలో 38.8 డిగ్రీలు, సూర్యాపేటలో 38.7 డిగ్రీలు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల నుంచి 20 డిగ్రీల మధ్య నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు.

లక్ష ఎకరాలకు సాగునీరందించడమే ధ్యేయం

ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి

అలంపూర్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో పర్యటించారు. గత ప్రభుత్వాల వైఫల్యాల కారణంగా నడిగడ్డ ప్రాంతం వివక్షతకు గురైందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను వాడుకునే హక్కు నిర్వాసితులైన మనకే ఉందన్నారు.నియోజకవర్గంలోని అన్ని స్కీంలు రన్ చేసినట్లైతే సుమారు 16 వేల ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉందన్నారు. తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా 87,600 ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. ఆగస్టులో 2018లో తుమ్మిళ్ల లిఫ్ట్ ప్రారంభిస్తామన్నారు.

ఉయ్యాల ఉచ్చుగా మారి బాలుడు మృతి



తరుణ్ (ఫైల్)

కేసముద్రంటౌన్: ఉయ్యాల కోసం కట్టిన చీర ప్రమాదవశాత్తు బాలుడి మెడకు చుట్టుకోవడంతో ఊపిరాడక ప్రాణాలు వదిలాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం ధన్నసరి శివారు రేకుల తండాకు చెందిన కేలోత్ సుధాకర్-సరోజ దంపతుల చిన్నకుమారుడు తరుణ్(9) మండల కేంద్రంలోని బ్రహ్మంగారితండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాల్గోతరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన తరుణ్ మధ్యాహ్నం అదేతండాలోని తన అమ్మమ్మ అచ్చి ఇంటికి వెళ్లాడు. అమ్మమ్మ కూలి పనులకు వెళ్లడంతో అక్కడే రేకుల షెడ్డులో చీరను ఉయ్యాలగా కట్టి అందులో కూర్చుని ఊగుతున్నాడు. ఈ క్రమంలో తరుణ్ గుండ్రంగా తిరగ్గా చీర మేడకు బిగుసుకోవడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. ఆ దారిలో వెళ్లేవారు గమనించి బాలుడిని పరిశీలించే సరికి అప్పటికే మృతి చెందాడు.

కొడుకు చేతిలో తండ్రి హతం

పెద్దపల్లి, నమస్తే తెలంగాణ: తల్లితో తరుచూ గొడవ పడుతుండటాన్ని తట్టుకోలేక ఓ కొడుకు తండ్రిని హతమార్చాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగినేడు గ్రామానికి చెందిన మాటేటి శ్రీనివాస్(45), సునీత దంపతులు. కొడుకు, కూతురు ఉన్నారు. భవన నిర్మాణ పనులు చేసే శ్రీనివాస్ మద్యానికి బానిసై.. భార్యపై అనుమానం పెంచుకుని రోజూ గొడవ పడుతున్నాడు. ప్రవర్తన మార్చుకోవాలని పలుమార్లు తండ్రిని కొడుకు హెచ్చరించినా మార్పు రాలేదు. సోమవారం రాత్రి మద్యం తాగివచ్చిన శ్రీనివాస్ భార్య సునీతతో గొడవకు దిగాడు. దీంతో కొడుకు రాజశేఖర్ క్షణికావేశంతో బైక్ రాడ్ తీసుకుని తండ్రిని చితకబాదడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దపల్లి ప్రభుత్వ ప్రధాన దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

'మిషన్ భగీరథ'లో జాప్యాన్ని సహించం

మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్న

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పనుల పురోగతిపై సమీక్ష



హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మిషన్ భగీరథ పనులపై సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు జోగురామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ భగీరథ పనుల్లో జాప్యాన్ని సహించేదిలేదని అటవీ, పర్యావరణశాఖ మంత్రి జోగురామన్న, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్పష్టంచేశారు. నిర్దేశిత గడువులోగా పైప్‌లైన్ పనులను పూర్తిచేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని అటవీశాఖ కేంద్ర కార్యాలయంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నియోజకవర్గాలవారీగా భగీరథ పనుల పురోగతిపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి మున్సిపాలిటీలతోపాటు నియోజకవర్గాల్లో నెలకొన్న మంచినీటి కొరతపై అధికారులతో చర్చించారు. సమస్యను పరిష్కరించడానికి మిషన్ భగీరథ కింద పైప్‌లైన్లను వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలో 26 వేల ఇండ్లకు మిషన్ భగీరథ కింద మంచినీటి కనెక్షన్లు ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లుచేయాలని జోగు రామన్న పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైతే ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని ఇంద్రకరణ్‌రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, దివాకర్‌రావు, బాపూరావు రాథోడ్, దుర్గం చిన్నయ్య, గడ్డం విఠల్‌రెడ్డి, కోవా లక్ష్మి, రేఖానాయక్, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ సురేందర్‌రెడ్డి, పబ్లిక్‌వర్క్స్ ఈఎన్సీ ధన్‌సింగ్, రెండు జిల్లాల మున్సిపల్ కమిషనర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ పత్రాలతో రూ.3.50 కోట్ల రుణాలు

సిండికేట్ గండివేట్ బ్రాంచిలో బహిర్గతం

రెవెన్యూ రికార్డుల పరిశీలనతో వెలుగులోకి

గాంధారి: తప్పుడు పాసుపుస్తకాలతో వ్యవసాయ రుణాలు తీసుకున్న ఉదంతం కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గండివేట్ సిండికేట్ బ్యాంకులో వెలుగుచూసింది. దాదాపు 745 మంది బోగస్ పత్రాలు సమర్పించి దాదాపు రూ.3.50 కోట్ల మేర రుణాలు పొందిన విషయం బహిర్గతమైంది. వివరాలు ఇలా.. 2008 నుంచి 2012 మధ్య కాలంలో బ్యాంకు నుంచి పంట రుణాలు పొందిన దాదాపు 900 మందికి 2014లో రుణమాఫీ కాలేదు. అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు రుణమాఫీ కాని రైతుల పట్టాపాస్ పుస్తకాలతోపాటు, బ్యాంకు ఖాతా నంబర్లు, తీసుకున్న రుణం వివరాలతో గ్రామాల వారీగా జాబితా తయారు చేశారు. గండివేట్ బ్యాంకులో పంట రుణాలు పొందిన ఆయా గ్రామాల్లో 900 మంది వివరాలను బ్యాంకు సిబ్బంది, రెవెన్యూ సిబ్బందితో కలిసి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించిన అధికారులకు దాదాపు 745 మందికి రెవెన్యూ రికార్డుల్లో ఎలాంటి భూములు లేవని, తప్పుడు పట్టాపాస్ పుస్తకాలను, పహాణీలను సృష్టించి దాదాపు రూ.3.50 కోట్ల మేర రుణాలు పొందినట్టు గుర్తించారు. ఇదే విషయాన్ని గాంధారి తహసీల్దార్ లక్ష్మణ్ ధ్రువీకరించారు. అక్రమంగా రుణాలు పొందిన వారిలో సీతాయిపల్లి గ్రామంలో 179 మంది, గండివేట్‌లో 97 మంది, గౌరారం, ముదెల్లి, చెన్నాపూర్, వెంకటాపూర్, మేడిపల్లి, నర్సపూర్, గౌరారం గ్రామాలకు చెందిన 469 మంది ఉన్నారు. బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని గండివేట్ సిండికేట్ బ్యాంకు మేనేజర్ నరేశ్ చెప్పారు.

ఈ-పాస్.. సక్సెస్

- ఆదర్శంగా పౌరసరఫరాలశాఖ విధానం
- 17 వేల రేషన్‌షాపుల్లో యంత్రాలు
- సమయం ఆదా.. ఆటంకాల్లేకుండా పంపిణీ
- ప్రతినెలా 12-15 శాతం బియ్యం మిగులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాలశాఖలో ఈ-పాస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) అమలు సక్సెస్ అయింది. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ, దళారుల ఆటకట్టిస్తూ, లబ్ధిదారులకు సమయం ఆదాచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-పాస్ విధానంపై సర్వత్రా సంతోషం వ్యక్తమవుతున్నది. పేదల కడుపునింపాలన్న సర్కారు ఆశయం నెరవేరుతున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేకదృష్టి.. మంత్రి ఈటల రాజేందర్ సారథ్యంలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశంలోని ఇతర రాష్ర్టాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయి. 2016 మార్చిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 1,545 రేషన్‌షాపుల్లో ప్రయోగాత్మకంగా ఈ-పాస్ విధానాన్ని తొలుత అమలుచేశారు. రెండేండ్లపాటు ప్రయోగాత్మకంగా పరీక్షించారు. అమలు తీరు, ఎదురవుతున్న అడ్డంకులను పర్యవేక్షిస్తూ మార్పులు చేర్పులతో రాష్ట్రవ్యాప్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీ నుంచి 17వేల దుకాణాల్లో ఈ విధానాన్ని అమలుచేస్తున్నారు. వేలిముద్రలు, ఐరిస్ స్కానర్, వాయిస్ ప్లేయర్ వంటి సదుపాయాలతో వచ్చిన ఈ-పాస్ రేషన్ లబ్ధిదారులకు అండగా నిలుస్తున్నది. గతంలో లబ్ధిదారులు షాపుల ముందు సరుకుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. కొందరు డీలర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మరొకరికి పంపిణీ బాధ్యతలు అప్పగించేవారు. నెలలో రెండు, మూడురోజులే సరుకులిచ్చి దుకాణం మూసివేసేవారు. పలువురు రేషన్ డీలర్లు, అధికారులు, వ్యాపారులు కుమ్మక్కవడంతో రేషన్ బియ్యం పక్కదారి పట్టేది. వీటన్నింటికీ ఈ-పాస్‌తో తెరపడింది.

అక్రమాలను అడ్డుకున్న ఈ-పాస్

ఈ-పాస్ విధానంలో సరుకులు తీసుకోవాలంటే లబ్ధిదారుడి వేలిముద్ర తప్పనిసరి. మిషన్ ప్రారంభించాలంటే డీలర్ వేలిముద్ర కూడా ఉండాలి. డీలర్ సమక్షంలో అసలైన లబ్ధిదారుడు బియ్యంతోపాటు రశీదు సైతం పొందుతున్నాడు. ఈ లావాదేవీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదవుతుంటాయి. ఆయా దుకాణం పరిధిలో ఎన్ని కార్డులు ఉన్నాయి? ఎంతమంది సరుకులు తీసుకున్నారు? ఎంత బియ్యం నిల్వ ఉంది? తదితర వివరాలు ఉన్నతాధికారులు చూసే వీలుంటుంది. డీలర్‌కు గోదాం నుంచి సరుకులు అందగానే రేషన్ సరుకులు వచ్చాయని లబ్ధిదారుడి మొబైల్‌కు ఎస్‌ఎంఎస్ చేరుతుంది. ప్రతినెలా 1 నుంచి 15 తేదీ వరకు సరుకుల పంపిణీ జరుపాలని నిబంధనలను తీసుకురావటం, జిల్లాల్లో ఎక్కడైనా సరుకులు తీసుకొనేలా రేషన్ పోర్టబులిటీ అమలవుతుండటం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయి. దీనిపై అటు అధికారులు, ఇటు లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. అక్రమాలకు తెరపడటంతో ప్రతినెలా జిల్లాలో రేషన్ బియ్యం 12 నుంచి 15శాతం దాకా మిగులుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. ఏడాదికి రూ.800 కోట్ల వరకు ఆదాఅయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

చౌక బియ్యం కాదు.. రూ. 27 కిలో బియ్యం



ఒక కిలో బియ్యం పేదలకు ఇచ్చేందుకు ప్రభుత్వం రూ. 27 ఖర్చు చేస్తున్నది.రూ.26 రాయితీని భరిస్తున్నది. పేదలకు ఆకలి బాధలు ఉండకూడదనే గొప్ప ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ పథకాన్ని అందరూ గౌరవించాలి. ఈ-పాస్‌తో చౌకధరల దుకాణం కేంద్రంగా జరిగే అక్రమాలకు చెక్ పడింది. చిన్నచిన్న సమస్యలు ఎదురవుతున్నట్టు ఫిర్యాదులు అందగానే అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటున్నారు. - సీవీ ఆనంద్, పౌరసరఫరాలశాఖ కమిషనర్

సమయం ఆదా అవుతున్నది



దుకాణానికి సరుకులు వచ్చినట్టు మొబైల్‌కి మెసేజ్ వస్తున్నది. సమయానికి వెళ్లి తీసుకుంటున్నాం. గతంలో చిన్న పిల్లలతో గంటలపాటు బియ్యం కోసం ఎదురుచూసేవాళ్లం. ఎలక్ట్రానిక్ కాంటల ఏర్పాటుతో మోసాలు జరుగడం లేదు. సమయం ఆదా అవుతున్నది. - ఎం వజ్రమ్మ, ఎల్కతుర్తి, వరంగల్ జిల్లా

ఈ-పాస్‌తో ప్రయోజనం



కొత్త విధానం వల్ల పారదర్శకత వచ్చింది. ఎన్ని బియ్యం తీసుకుంటున్నామో, ఎంత చెల్లించాలో బిల్ వస్తున్నది. జిల్లాలో ఎక్కడైనా రేషన్ తీసుకొనే వెసులుబాటు వల్ల వివిధ పనులపై వేరే ఊళ్లకు వెళ్లేవారికి ప్రయోజనం కలుగుతున్నది. - మేడి భూదేవి, సోమగూడెం, మంచిర్యాల జిల్లా



న్యూఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా మంగళవారం పద్మశ్రీ పురస్కారం స్వీకరిస్తున్న టెన్నిస్ ఆటగాడు సోమ్‌దేవ్, భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్

టీ20 చాంపియన్స్ ట్రోఫీకి బీసీసీఐ నో!

ముంబై: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) శశాంక్ మనోహర్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటీ నుంచి ఐసీసీ, బీసీసీఐ వివాదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. తాజాగా చాంపియన్స్ ట్రోఫీ విషయంలోనూ ఐసీసీతో బీసీసీఐ విభేదించినట్లు వార్తలు వస్తున్నాయి. టోర్నీకి మరింత మార్కెట్ కల్పించే ఉద్దేశంలో భాగంగా చాంపియన్స్ ట్రోఫీని 50 ఓవర్ల ఫార్మాట్‌కు బదులు టీ20కి మార్చాలని ఐసీసీ ప్రయత్నిస్తున్నది. 2021లో చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమివ్వాల్సిన బీసీసీఐ..ఐసీసీ ప్రతిపాదిత టీ20 చాంపియన్స్ టోర్నీకి ఒప్పుకునే ప్రసక్తే లేదని కుండబద్దలు కొడుతున్నది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం గనుక పన్ను మినహాయింపు ఇవ్వని పక్షంలో టోర్నీ వేదికను భారత్ నుంచి తప్పించాలని ఐసీసీ యోచిస్తున్నది. ఆతిథ్యం నుంచి బీసీసీఐ తప్పుకుంటే అదే సమయంలో జరిగే వేరే వేదికల గురించి ఆలోచించాలని ఇప్పటికే మేనేజ్‌మెంట్‌కు ఐసీసీ సూచించినట్లు తెలిసింది. గత నెలలో జరిగిన బోర్డు సమావేశంలో ఐసీసీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు మీడియా కథనంగా పేర్కొంది.

రబాడకు ఊరట

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ కగిసో రబాడకు ఊరట లభించింది. ఇతనిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్టు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. కేసును విచారించిన ఐసీసీ జ్యుడీషియల్ కమిషనర్ మైకెల్ హెరాన్ రబాడపై వచ్చిన ఆరోపణలు రుజువు కాలేదని, క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించి సాటి ఆటగాడికి గౌరవం ఇవ్వనందుకు అతని మ్యాచ్ ఫీజులో 25శాతం కోత విధిస్తున్నట్టు తెలిపాడు. దీంతో అంతకు ముందు విధించిన 50శాతం కోత సగానికి తగ్గింది. ఇక మూడు డీమెరిట్ పాయింట్లను ఐసీసీ ఒక పాయింట్‌కు కుదించగా రబాడకు డీమెరిట్ పాయింట్ల సంఖ్య 9 నుంచి 7కు తగ్గింది. దీంతో ఐసీసీ రబాడపై నిషేధం ఎత్తివేయడంతో ఆస్ట్రేలియాతో జరిగే చివరి రెండు టెస్టుల్లోనూ ఆడనున్నాడు.

కల నెరవేరేనా..?



కామన్వెల్త్‌పై సుశీల్ గురి

ఒలింపిక్స్‌లో మూడో పతకమే లక్ష్యం

విశ్వక్రీడల్లో రెండు పతకాలు.. కామన్వెల్త్ గేమ్స్‌లో మరో రెండు స్వర్ణాలు.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి.. ఆసియా గేమ్స్‌లో కాంస్యం.. ఆసియా చాంపియన్‌షిప్.. కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లలో.. మనోడి ప్రతిభకు పతకాలు వెల్లువలా వచ్చిపడ్డాయి.. ఇక అంతర్జాతీయ యవనికపై తనకు తాను నిరూపించుకునే అవసరం లేకపోయినా.. భారత స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్ ఇప్పుడు గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్‌పై మరింత దృష్టిపెట్టాడు. కెరీర్‌ను కొనసాగించాలంటే ఇందులో రాణించాలన్నది అతని ఏకైక లక్ష్యం. దీనికి తోడు తనకు కలగా మిగిలిపోయిన 'మూడో ఒలింపిక్ పతకం' దక్కించుకోవాలంటే ఈ గేమ్స్‌ను మొదటి మెట్టుగా ఉపయోగించుకోవాలని భావిస్తున్నాడు. అలాగే కామన్వెల్త్‌లోనూ మూడో పతకం కలను నెరవేర్చుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాడు.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

సుశీల్ కుమార్.. భారత రెజ్లింగ్‌లో ఒకప్పుడు తిరుగులేని మొనగాడు. బీజింగ్, లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య, రజత పతకాలు గెలిచి ఒక్కసారిగా దేశానికి హీరోగా మారిపోయాడు. అలాంటి సుశీల్ ఇప్పుడు టోక్యో ఒలింపిక్స్ కోసం సన్నాహకాలు మొదలుపెట్టాడు. ఇందులోభాగంగా వచ్చే నెలలో జరిగే గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్‌పై అతను భారీ ఆశలు పెట్టుకున్నాడు. గట్టిపోటీ ఉండే 66 కేజీల విభాగంలో ఈసారి ఎలాగైనా పతకం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాడు. 'నేను రెజ్లింగ్ మొదలుపెట్టినప్పుడు నా లక్ష్యం దేశానికి ప్రాతినిధ్యం వహించడం మాత్రమే. పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో ఉన్నప్పుడు వంద శాతం సత్తా చాటేందుకు ప్రయత్నించా. ఇప్పుడు కూడా అదే ఉద్దేశ్యంతో ఉన్నా. నా పై వస్తున్న విమర్శల గురించి పెద్దగా పట్టించుకోను. విమర్శకుల దృక్పథాన్ని మార్చలేను. ఇప్పటికైతే నేను నిరూపించుకోవాల్సింది ఏమీ లేదు' అని సుశీల్ పేర్కొన్నాడు.

సెలెక్షన్ వివాదం..

2016 రియో ఒలింపిక్స్‌కు ముందు ఏ టోర్నీ అయినా సుశీల్ హాట్ ఫేవరెట్. ఎందుకంటే అప్పటికే వరుసగా రెండు ఒలింపిక్స్ పతకాలు నెగ్గి మంచి ఫామ్‌లో ఉన్నాడు. కానీ నర్సింగ్ యాదవ్ రాకతో ఒక్కసారిగా సుశీల్ ప్రతిష్ఠ కాస్త మసకబారింది. అధికారిక ట్రయల్స్ లేకుండానే నర్సింగ్‌ను రియోకు ఎంపిక చేయడంతో ఒక్కసారిగా వివాదం మొదలైంది. అయితే నర్సింగ్ డోపింగ్‌లో పట్టుబడటం, రెజ్లింగ్‌లో భారత్ పతక అవకాశాలకు గండిపడటంతో అప్పట్లో ఓ రకమైన సందిగ్ధత నెలకొంది. రియోలో బరిలోకి దిగే అవకాశం లేకపోవడంతో మూడో ఒలింపిక్ పతకం గెలువాలన్న సుశీల్ కల నెరవేరలేదు. దీంతో టోక్యోలో ఎలాగైనా ఈ కలను సాకారం చేసుకోవాలని ఈ ఢిల్లీ రెజ్లర్ పట్టుదలతో ఉన్నాడు. ఇక కామన్వెల్త్ గేమ్స్‌కు రెజ్లర్లను ఎంపిక చేయడంలోనూ పెద్ద వివాదమే చోటు చేసుకుంది. పర్వీన్ రానా కూడా రేసులో ఉండటంతో ఇద్దరి మధ్య ట్రయల్స్‌ను నిర్వహించారు. కానీ ఇందులో పర్వీన్ మద్దతుదారులు చేసిన గొడవతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. 'లండన్‌లో స్వర్ణం తృటిలో చేజారింది. దేశానికి పసిడిని సంపాదించిపెట్టాలన్న నా కల ఇంకా నెరవేరలేదు. దాన్ని నెరవేర్చుకుంటా' అని సుశీల్ ధీమాతో ఉన్నాడు.

'టాప్ 'నుంచి ఔట్

మోకాలి గాయం కారణంగా ఇటీవల ఆసియా చాంపియన్‌షిప్‌నకు దూరమైన సుశీల్.. గాయాల బారిన పడిన ప్రతిసారి ఎంతో ధైర్యంతో పునరాగమనం చేశాడు. కానీ అతని ప్రదర్శనను గుర్తించని కొంత మంది 'టార్గెట్ ఒలింపిక్ పోడియం (టాప్)' నుంచి తొలగించడం విమర్శలకు దారితీసింది. దీనిపై వెటరన్ రెజ్లర్ ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు. 'నా గురించి ఎవరేమనుకున్నా నేను పట్టించుకోను. వంద శాతం కష్టపడటం నా వృత్తి. నా జీవితంలో ప్రతి ఒక్కటి సాధించా. మళ్లీ నేషనల్స్ ఆడి పోటీల్లోకి పునరాగమనం చేయాల్సిన అవసరం నాకు లేదు. మ్యాట్ మీద మన సత్తా ఏంటో చూపాలి. కానీ పతకాల కోసమే పోటీపడకూడదు. అలా చేస్తే ఒత్తిడి పెరుగుతుంది. ప్రత్యర్థులు ఎంత పెద్దవారైనా మనపై నమ్మకం ఉన్నప్పుడు విజయం మనల్నే వరిస్తుంది' అని సుశీల్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

జార్జియాలో శిక్షణ

కామన్వెల్త్‌ను దృష్టిలో ఉంచుకుని సుశీల్.. జార్జియాలో 10 రోజుల పాటు శిక్షణ తీసుకుంటున్నాడు. ఇందుకోసం ఈ వారం చివర్లో అక్కడికి బయలుదేరి వెళ్తున్నాడు. సహచరుడు హర్‌ఫూల్, కోచ్ వ్లాదిమిర్ మెర్స్టవిషిల్ కూడా అతనితోపాటు ఉండనున్నారు. ఈ పది రోజుల శిక్షణకు అవసరమైన డబ్బును సుశీల్ సొంతంగా భరిస్తుండగా, హర్‌ఫూల్‌కు ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ ఆర్థిక సాయం అందజేస్తున్నది. 'టాప్‌లో లేనందుకు నేను పశ్చాత్తపం చెందడం లేదు. దేశం తరఫున నన్ను ఎంపిక చేసినందుకు మంచి ప్రదర్శన ఇవ్వడం నా బాధ్యత. శరీరం సహకరిస్తే రెజ్లర్లు 40 ఏండ్లు వచ్చేవరకు అంతర్జాతీయ కెరీర్‌లో కొనసాగొచ్చు. నేను కూడా కొనసాగుతాననే భావిస్తున్నా. గత నాలుగేండ్లుగా చాలా కష్టపడుతున్నా. నా వ్యూహాలు, నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నా. ఏదేమైనా మంచి ప్రదర్శన చూపుతాననే నమ్మకం ఉంది' అని సుశీల్ చెప్పుకొచ్చాడు.



'ఆసియా'లో అద్వానీ జోరు

యాంగొన్ (మయన్మార్): ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్ల హవా కొనసాగుతున్నది. వరల్డ్ చాంపియన్ పంకజ్ అద్వానీ తన జోరును చూపిస్తూ రెండో రౌండ్‌లోనూ విజయం సాధించాడు. పంకజ్ 4-1తో పౌక్ సా (మయన్మార్)పై గెలిచాడు. ఇక మహిళా విభాగంలో ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో విద్యాపిళ్లై 2-1తో అక్రమ్ మహమ్మదీ (ఇరాన్)పై గెలువగా, అమీ కమానీ 2-0తో పరిసా దర్విశ్వంద్ (ఇరాన్)ను ఓడించింది. అండర్-21 విభాగంలో భారత ఆటగాడు షోయబ్ ఖాన్ 4-2తో చింగ్ చియు (హాంకాంగ్)పై విజయం నమోదు చేశాడు.

భారత మహిళల ఏ జట్టు ఓటమి

ముంబై: భారత మహిళల క్రికెట్ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతూనే ఉన్నది. ఆస్ట్రేలియా చేతిలో మిథాలీ సేన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడగా...తాజాగా భారత మహిళల ఏ జట్టు కూడా ఇంగ్లండ్ చేతిలో రెండోసారి ఓటమి చవిచూసింది. మంగళవారం ఇక్కడ జరిగిన వార్మప్ మ్యాచ్‌లో భారత్-ఏ జట్టుపై ఇంగ్లండ్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. అనంతరం నిర్ణీత 20 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు స్కోరు సాధించింది.



దినేశ్ కార్తీక్ | మురళీ విజయ్

విజయ్.. నీ తీరు బాగాలేదు

న్యూఢిల్లీ: ఆఖరి బంతికి సిక్సర్ కొట్టి హీరోగా మారిన దినేశ్‌కార్తీక్‌పై క్రికెట్ ప్రపంచమంతా ప్రశంసలు కురిపిస్తుంటే..అతని సహచరుడు భారత టెస్ట్ ఓపెనర్ మురళీ విజయ్ మాత్రం అందుకు విరుద్ధంగా స్పందించాడు. 'ఇదొక అద్భుతమైన విజయం. భారత క్రికెట్ బ్రాండ్ విలువ పెంచేందుకు బీసీసీఐ చేస్తున్న కృషికి ఇది నిదర్శనం' అని ట్వీట్ చేశాడు. దీనిపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

విజయ్.. నీకు ఇది కొత్తేమీ కాదులే. తమిళనాడు విజయ్‌హజారే ట్రోఫీ విజయంలో కీలకపాత్ర పోషించిన దినేశ్‌ను నువ్వు విస్మరించావు. అంటూ నెటిజన్లు మురళీ విజయ్ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దినేశ్ కార్తీక్ మొదటి భార్య నికిత, మురళీ విజయ్‌ను పెండ్లి చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ప్రాణ స్నేహితులైన ఈ ఇద్దరు క్రికెటర్లు ఆ పెండ్లితో విడిపోయారు.

ఈత నేర్పండి.. పిల్లలు జాగ్రత్త!

అశ్రద్ధ, ఏమరుపాటుతో అనర్థాలు ■ అవగాహనారాహిత్యం ప్రమాదాలకు కారణం

పెద్దల పర్యవేక్షణా లోపం చిన్నారులకు శాపం ■ పండుగలు, సెలవు రోజుల్లో ఎక్కువ మరణాలు ■ శిక్షణతోనే ప్రాణాలకు రక్ష

ప్రమాదాల్లో మరణిస్తున్న వారి శాతం

చెరువులు: **43%**
తవ్విన గుంతలు: **26%**
సంపులు: **13%**
సరస్సులు: **7%**
నదులు:**5%**

మూడు రోజుల్లో 15మంది జలసమాధి

ప్రధాన కారణాలు

- ఈత రాకుండానే నీళ్లలోకి దిగడం.
- నీటి వనరుల సమీపంలో నివసించే వారు.. పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకుండా వదిలివేయడం.
- ఈత కొట్టేందుకు నీటిలో దిగి అలసిపోవడం, నీటి ఉధృతి తట్టుకోలేక మునిగి పోవడం.
- చెరువులు, కుంటల పూడికతీత సమయంలో సరైన ప్రమాణాలు పాటించకుండా, ఇష్టానుసారంగా మట్టిని తరలించడంతో కొన్నిచోట్ల గోతులు ఏర్పడుతున్నాయి. నీటితో నిండిన తర్వాత వాటిని గుర్తించడం కష్టం కావడంతో నీట మునిగినవారు ప్రమాదాలబారినపడి మరణిస్తున్నారు.



ఈత నేర్పడం ఉత్తమం

ఈత ఒకప్పుడు దినచర్యలో భాగంగా ఉండేది. పాఠశాల స్థాయిలోనే పిల్లలు ఈతపై పట్టుసాధించేవాళ్లు. కొత్తగా ఎవరికైనా ఈత నేర్పించాలంటే ఆముదం లొట్టలు కట్టి బావుల్లో శిక్షణ ఇచ్చేవాళ్లు. కాలం మారింది. బావులు, చెరువులు తగ్గాయి. పట్టణ జీవితాలకు అలవాటుపడి సహజంగా ఈత నేర్చుకొనే అవకాశాలు తగ్గిపోయాయి. ఎప్పుడన్నా నీటిని చూసి సరదా కోసం అందులోకి దిగితే ప్రాణాలకే ముప్పు వస్తున్నది. జాగ్రత్తలు తీసుకోవడం సరే. ఏదైనా ఆపదొస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండేలా పిల్లలకు తర్ఫీదు ఇవ్వడం ప్రతి తల్లితండ్రి బాధ్యత. పిల్లలకు ఈత నేర్పడంపై తప్పక దృష్టి పెట్టాలి.

ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలు:

- ఈ నెల 19న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లిలో ఒంటిపూట బడి ముగిసిన తర్వాత ఈతకు వెళ్లిన నలుగురు చిన్నారులు మృతిచెందారు. లావుడ్యా రత్న కుమారుడు సౌజన్, భూక్య నగేశ్ కుమారుడు సిద్ధు, బానోత్ శంకర్ కుమారుడు సంతోష్, బానోతు రత్న కుమారుడు దిలీప్ చనిపోయారు. వీరంతా పది నుంచి పదమూడు ఏండ్ల వయస్సున్న పిల్లలు. ఈత రాకుండానే చెరువులోకి దిగడంతో మృత్యుకబలించింది.
- ఈ నెల 18న మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కన్నారం గ్రామానికి చెందిన ఖాజా ఇంతియాజ్ అలీ, అతని బావమరిది మహ్మద్ ఆసీన్, ఇంతియాజ్ కుమారుడు ఇసాక్‌అలీ, అహ్మద్‌అలీ, మరదలి కుమార్తె హుదాకరీన కన్నారం పెద్ద చెరువులో మునిగి చనిపోయారు. సరాదాగా స్నానం చేసేందుకు నీటిలో దిగి మునిగిపోతున్న చిన్నారులను కాపాడే ప్రయత్నంలో ఇంతియాజ్ అలీ, అతని బావమరిది ఆసీన్ సైతం చనిపోయారు.
- ఈ నెల 18న నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల పంచాయతీ పరిధి గుడితండా పెండ్లిపాకల రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు నీట మునిగి మృతిచెందారు. వీరంతా గుడితండాకు చెందిన అన్నదమ్ములు. నేనావత్ సర్దార్, నేనావత్ హన్మ, నేనావత్ ఓంకార్ కుమారులు. అంతా ఐదు నుంచి ఆరేండ్ల చిన్నారులు.
- ఈ నెల 17న హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నలగండ్లలో నివస్తిన్న శ్రీనివాస్, స్వాతి దంపతుల కుమారుడు దినేశ్(5) వట్టినాగులపల్లి శ్రీదేవి ఇంజినీరింగ్ కళాశాలకు తల్లితోపాటు వెళ్లి.. పక్కనే ఉన్న గెస్ట్ హౌస్‌లో స్విమ్మింగ్‌పూల్‌లో ప్రమాదవశాత్తుపడి మృతి చెందాడు.


భయపడొద్దు



సాధారణంగా నీళ్లలో పడగానే ఆందోళన, భయంతోనే ఎక్కువమంది మరణిస్తుంటారు. భయంతో నీళ్లు మింగేస్తారు. అలాకాకుండా ధైర్యంగా ఉండి, కాళ్లు చేతులు ఆడిస్తూ ఉండాలి. అలా కాసేపు ప్రాణాలు నిలుపుకోవచ్చు. జీవితంలో ప్రతి ఒక్కరు ఈత నేర్చుకోవడం ఉత్తమం. పాఠశాల స్థాయిలోనే ఈత నేర్పించాలి. నేను ఇప్పుడు కోచ్‌గా పనిచేస్తున్న పాఠశాలలో ప్రతి విద్యార్థికి ఈత తప్పక నేర్పుతున్నాం.

-ఎమ్డీ బాసిత్‌అలీ, సీనియర్ స్విమ్మింగ్ కోచ్, కర్మన్‌ఘాట్

విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నాం



సెలవు రోజుల్లో ఇలాంటి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నీటి దగ్గరికి వెళ్లినప్పుడు ప్రమాదాల బారినపడకుండా ఎలా ఉండాలన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. అయితే వేసవి సెలవుల్లో పట్టణప్రాంతాల్లోని విద్యార్థులు కూడా ఊర్లకు వెళ్లడం, అక్కడ సరదా కోసం చెరువుల్లోకి, కుంటల్లోకి దిగి చనిపోతున్నారు. ఈ విషయంలో తల్లి తండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి.

-ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బొమ్మనపల్లి.. కన్నారం.. గుడితండా.. వట్టినాగులపల్లి.. అన్ని ఊర్లదీ ఒకటే గుండెకోత. అందరిదీ ఒకటే బాధ. ఈతకు వెళ్లిన పిల్లలు విగతజీవులయ్యారు. అది చూసి తట్టుకోలేక అమ్మానాన్నలు గుండెలు బాదుకున్నారు. ఊరుఊరంతా కన్నీరయ్యింది. ఆ వార్తలను చదివిన వారి హృదయాలు బరువెక్కాయి. కేవలం మూడు రోజుల్లో 15మంది చిన్నారులు జలసమాధయ్యారు. వీరిలో ఎక్కువమంది పది పన్నేండ్ల వయస్సు పిల్లలే. అంతలోనే ఆయుష్షు తీరిపోయింది. నూరేండ్ల జీవితం బాల్యం గడువకముందే ముగిసిపోయింది. ఎందుకీ అనర్థం? ఎందుకీ కడుపుకోత? ఇలాంటి విషాదాలను నివారించే మార్గం లేదా? పిల్లలను కాపాడుకొనే ఉపాయమే లేదా? చెరువులోకి దిగి, ఈత కొట్టాలని బడి ఈడు పిల్లలు ముచ్చటపడడంలో తప్పులేదు. అదేమీ ప్రమాదమూ కాదు. ఈత సరదా మాత్రమే కాదు మంచి వ్యాయామం. కాకపోతే, సరైన శిక్షణ, పెద్దల పర్యవేక్షణలేకుండా.. తాము దిగుతున్న జలాశయాల లోతులు, ఎత్తు పల్లాలు తెలియకుండా.. వాటి మీద అవగాహనలేకుండా ఈత కొట్టడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నారుల ప్రాణాలు పోతున్నాయి. నిజానికి ఈతంటే భయపడాల్సిన పనిలేదు. ఈత నేర్చుకోవాలన్న ఉత్సాహం ఉన్న పిల్లలకు నేర్పించాలి. పెద్దలే దగ్గరుండి పర్యవేక్షించాలి. చెరువులు, కుంటలు, కాల్వల్లో పొంచివుండే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలి. ఎక్కడ ఈత కొట్టవచ్చో, ఎక్కడ సాహసాలకు పూనుకోకూడదో విడమరిచి చెప్పాలి. అప్పుడు అనర్థాలకు తావుండదు.

అవగాహన లేకే ప్రమాదాలు:

పండుగలు, వరుస సెలవుల రోజుల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా చెరువులు, కాల్వల్లో ఎంత లోతు ఉంటుందో అవగాహన లేకుండానే చిన్నారులు ఈతకు వెళ్లడం, కొందరు స్నేహితుల సహాయంతో ఈత నేర్చుకొనేందుకు ప్రయత్నించడంతో ప్రాణాలమీదికి తెచ్చుకొంటున్నారు. కొన్ని ఘటనల్లో చెరువు పూడిక సమయాల్లో తీసిన గుంతల్లో బురద పేరుకొని వాటిల్లో ఇరుక్కుని చనిపోయిన ఘటనలున్నాయి. చిన్నారుల మధ్య సరదా పందేలు సైతం వారి తల్లితండ్రులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నాయి. నదీ పరివాహక ప్రాంతంలో పెద్దపెద్ద బండరాళ్లతోపాటు బండల చాటున ఒర్రెలు ఉండి బయటకు కనిపించక పోవడం వల్ల ప్రమాదాలు భారీగా చోటు చేసుకుంటున్నాయి.

చైతన్య పర్చేందుకు ప్రయత్నిస్తున్నాం



చెరువుల్లో ఈతకు వెళ్లి చిన్నారులు మృతి చెందుతుండడం చాలా బాధాకరం. వీటిని అరికట్టేందుకు అంతా బాధ్యత తీసుకోవాలి. ముఖ్యంగా తల్లితండ్రులు ఎక్కువ దృష్టి పెట్టాలి. ప్రభుత్వం తరఫున కూడా దీనిపై చైతన్యపర్చేందుకు ప్రయత్నిస్తున్నాం. మిషన్‌కాకతీయలో చెరువుల పూడికతీతలోనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచనలిస్తున్నాం.

-హరీశ్‌రావు, నీటిపారుదలశాఖ మంత్రి

మృత్యు కుహరాలు..క్వారీ గుంతలు:

మట్టి మాఫియా ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండాపోవడంతో హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లోని క్వారీ గుంతలు మృత్యుకుహరాలుగా మారుతున్నాయి. చిన్నపాటి చెరువులను తలపించే ఈ క్వారీ గుంతలు ఎంత లోతు ఉంటున్నాయన్న దానిపై సరైన అంచనా లేకుండానే పిల్లలు వాటిల్లో ఈత నేర్చుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. చూడ్డానికి చిన్న కుంటల మాదిరిగా కనిపించడంతో చిన్నారులు ఎలాంటి భయం లేకుండా నీళ్లలోకి దిగుతున్నారు. చివరకు ప్రమాదాల్లో జలసమాధవుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్ పరిసరాల్లోని శంషాబాద్ ఆర్జీఐ ఠాణా పరిధిలో, మైలార్‌దేవ్‌పల్లి ఠాణాల పరిధిలోని పల్లె చెరువు, కొత్త చెరువుల్లో ఈ తరహా ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్‌లోని క్వారీల్లో ఈత సరదాకోసం వస్తున్న విద్యార్థులు, చిన్నారులు జల సమాధవుతున్నారు. గాజులరామారంలోని కైసర్‌నగర్, బాలయ్యనగర్, దేవేందర్ నగర్‌ల్లో క్వారీ గుంతల్లో ఈతకు వెళ్లి చిన్నారులు, యువకులు మృత్యువాతపడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో గడిచిన ఐదేండ్లలో 30 మందికిపైగా మృత్యువాతపడినట్టు పోలీసుల రికార్డులు చెప్తున్నాయి.

గంటకు 40మంది..

ప్రపంచవ్యాప్తంగా గంటకు సగటున 40 మంది నీట మునిగి మరణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఈ మరణాల్లో ఒకటి నుంచి తొమ్మిది ఏండ్ల మధ్య వయస్సు పిల్లలే ఎక్కువ ఉంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా సగటున 1.40 లక్షల మంది పదిహేనేళ్లలోపు వారు ఈ కారణంతోనే మరణిస్తున్నారు. ప్రమాదవశాత్తు సంభవిస్తున్న మరణాల్లో జలసమాధి అవుతున్న వారిది మూడో స్థానం అంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. అత్యుత్సాహం, నిర్లక్ష్యం కూడా ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



విద్యుత్‌సౌధలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ శివాజీ ఉన్నారు.

ఉమ్మడి హైకోర్టుతో తెలంగాణకు అన్యాయం

- కేసులు, కుట్రలతో విధుల్లోకి ఏపీ ఉద్యోగులు
- విద్యుత్‌సౌధ ధర్నాలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/సుల్తాన్‌బజార్: : ఉమ్మడి హైకోర్టుతో తెలంగాణ సమాజానికి న్యాయం జరుగదని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి స్పష్టంచేశారు. విద్యుత్‌శాఖలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాని కోరారు. ఏపీ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ మంగళవారం విద్యుత్‌సౌధలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఏపీ ఉద్యోగులు ఆప్షన్ల పేరుతో దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. 25న సరూర్‌నగర్‌లో నిర్వహించే తెలంగాణ ఉద్యోగుల ఆత్మగౌరవ సభలో విద్యుత్ ఉద్యోగుల సమస్యను ప్రత్యేక అంశంగా పరిగణిస్తామన్నారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం సానుకూలంగా ఉన్నదని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ శివాజీ తెలిపారు. ఆంధ్రా ఉద్యోగులు ఆర్థిక బలం, కేసులు, కుట్రలతో తెలంగాణ ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు అనుకూలంగా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసేందుకు విద్యుత్ యాజమాన్యం ముందడుగు వేయడం శుభ పరిణామమని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ పీ అంజయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గణేశ్, వినోద్, నాజర్ షరీఫ్, జానయ్య, మధుసూదన్‌రెడ్డి, ప్రకాశ్, శంకరయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమం పట్టని కేంద్రం

ఉద్యోగుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాంపల్లిలోని టీఎన్జీవో కార్యాలయంలో ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సకల ఉద్యోగుల మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

మహబూబ్‌నగర్ రూరల్: కేంద్రప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ రామకృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఉద్యోగ సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

వైసీపీ, జనసేన బీజేపీ కోవర్టులు: చంద్రబాబు

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: టీడీపీపై బురదజల్లడమే బీజేపీ, వైసీపీ, జనసేన పార్టీల సింగిల్ పాయింట్ అజెండా అని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఢిల్లీలోని ఎంపీలు, అసెంబ్లీ వ్యూహ కమిటీ సభ్యులతో మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వైసీపీ, జనసేనలు బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. పోలవరం విషయంలో చేతులు పెడితే కాలుతాయని పరోక్షంగా పవన్‌ను హెచ్చరించారు.

పవన్ దుమ్మెత్తిపోస్తే దులుపుకోవాలా?: ఏపీ మంత్రి లోకేశ్

తనపై అవినీతి ఆరోపణలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం అమరావతిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు ఆరోపణలతో దుమ్మెత్తి పోస్తే, దులుపుకొని పోవాలా అని ప్రశ్నించారు. పవన్ నిరాధారమైన ఆరోపణలపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు.

తమిళనాడులో పెరియార్ విగ్రహం ధ్వంసం

■ ఖండించిన రాహుల్, డీఎంకే, రజినీకాంత్



పుదుకొట్టాయ్ (తమిళనాడు), మార్చి 20: తమిళనాడులోని ఒక గ్రామంలో పెరియార్ విగ్రహాన్ని దుండగులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. పెరియార్‌గా పేరు పొందిన ప్రముఖ సంఘ సంస్కర్త, ద్రవిడ ఉద్యమ నేత ఈవీ రామస్వామి విగ్రహం తలను ఎవరో తొలిగించి రోడ్డుపై పడేశారు. అయితే జిల్లా అధికారులు వెంటనే స్పందించి కొన్ని గంటల్లోనే ఆ విగ్రహాన్ని పునరుద్ధరించారు. మరిన్ని అవాంఛనీయ ఘటనలు జరుగకుండా గ్రామంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మొహరించారు. విగ్రహ ధ్వంసంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో సహా డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, సూపర్‌స్టార్ రజినీకాంత్ తదితరులు విగ్రహ ధ్వంసాన్ని తీవ్రంగా ఖండించారు. పెరియార్ విగ్రహ ధ్వంసానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కారణమని రాహుల్‌గాంధీ ట్విట్టర్లో ఆరోపించారు. బీజేపీ నేత హెచ్ రాజా రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే పెరియార్ విగ్రహ ధ్వంసం జరిగిందని స్టాలిన్ పేర్కొన్నారు. విగ్రహ ధ్వంసం అనాగరిక చర్య అని రజినీకాంత్ అన్నారు. ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నారని పేర్కొన్నారు. పదిరోజుల క్రితం తమిళనాడులోకి వెల్లూరులో పెరియార్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.

ప్రతిపక్షాల భేటీకి హాజరుకానున్న మమత

■ సోనియా, రాహుల్‌తో సమావేశానికి అవకాశం



కోల్‌కత, మార్చి 20: బీజేపీకి వ్యతిరేకంగా ఎన్సీపీ అధినేత శరద పవార్ వచ్చేవారం ఏర్పాటు చేసిన ప్రతిపక్ష నేతల సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు, పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ పాల్గొననున్నారు. మమత ఈనెల 26 నుంచి నాలుగు రోజులపాటు ఢిల్లీలో పర్యటిస్తారని, పవార్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కూడా హాజరవుతారని తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ సందర్భంగా ఆమె యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో భేటీ అయ్యేందుకు అవకాశాలున్నాయని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు సర్కోజీ అరెస్ట్



పారిస్: ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీని మంగళవారం పారిస్ పోలీసులు అరెస్ట్ చేశారు. 2017లో అధ్యక్ష ఎన్నికల ప్రచారం కోసం అప్పటి లిబియా నియంత గఢాఫీ వద్ద నుంచి సూట్‌కేసుల్లో నిధులు స్వీకరించారన్న అభియోగంపై సర్కోజీపై కేసు నమోదైంది. 2012లో దేశాధ్యక్షుడిగా వైదొలిగిన తర్వాత ఈ కేసులో విచారణకు హాజరు కావాలని పోలీసులు జారీ చేసిన సమన్లను స్వీకరించేందుకు ఆయన నిరాకరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం పారిస్ సబర్బన్ నాంటెర్రేలో ఆయనను పోలీసులు అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్నారు. 2012లో దేశాధ్యక్షుడిగా వైదొలిగిన తర్వాత సర్కోజీ పలు కేసుల్లో విచారణను ఎదుర్కొంటున్నారు.

లైంగిక వేధింపుల కేసులో జేఎన్‌యూ ప్రొఫెసర్ అరెస్ట్

న్యూఢిల్లీ: విద్యార్థినులను లైంగికంగా వేధించారన్న ఆరోపణలపై జేఎన్‌యూ ప్రొఫెసర్ అతుల్ జోహ్రీని మంగళవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ తరువాత జోహ్రీని కోర్టులో హాజరుపరిచారు. ప్రొఫెసర్ జోహ్రీని అరెస్ట్ చేసి శిక్షించాలని విద్యార్థులు, అధ్యాపకులతోపాటు, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నాయి. ఎనిమిది మంది విద్యార్థినులు జోహ్రీపై ఫిర్యాదు చేయగా వాటిలో ఒక దాని ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.

ఎస్సీ/ఎస్టీ కేసుల్లో అరెస్టుల నుంచి అధికారులకు ఊరట

న్యూఢిల్లీ: నిజాయితీగా విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారులపై ఎస్సీ/ఎస్టీ చట్టం కింద తప్పుడుకేసులు బనాయించి బెదిరించకుండా ఉండేందుకు సుప్రీం కోర్టు కొన్ని నిబంధనలను సడలించింది. ఎస్సీ/ఎస్టీ చట్టం కింద తక్షణం అరెస్టు చేసే నిబంధనను అధికారుల విషయంలో సడలించింది. అనేక సందర్భాల్లో అమాయకులను నిందితులుగా చూపుతున్నారని, ప్రభుత్వ అధికారులను విధులు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని, ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టాన్ని ఇందుకోసం రూపొందించలేదని కోర్టు వ్యాఖ్యానించింది. ముందస్తు బెయిల్ మినహాయింపును నిజమైన కేసులకు పరిమితం చేసి, ప్రాథమిక సాక్ష్యాధారాలు లేని కేసులకు వర్తించకుండా చేసినప్పుడే అమాయకులకు రక్షణ లభిస్తుందని న్యాయమూర్తులు ఆదర్శ్‌గోయల్, యూయూ లలిత్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇకపై ప్రభుత్వ అధికారుల అరెస్టుకు వారిని నియమించిన అధికారి అనుమతి, పోలీసు సూపరింటెండెంట్ అనుమతితో ఓ ప్రభుత్వేతర అధికారి ఇచ్చే ఆమోదం ఉండాల్సిందేనని స్పష్టం చేసింది.

తెహ్రీక్-ఎ-హురియత్ చైర్మన్‌గా అష్రఫ్ సెహ్రాయి

■ జిలానీ స్థానంలో బాధ్యతలు

శ్రీనగర్: తెహ్రీక్-ఎ-హురియత్ పార్టీ చైర్మన్‌గా మహమ్మద్ అష్రఫ్ సెహ్రాయి ఎన్నికయ్యారు. సయ్యద్‌అలీ షా జిలానీ స్థానంలో శుక్రవారం అష్రఫ్ బాధ్యతలు చేపట్టారు. 2003లో హురియత్ కాన్ఫరెన్స్ నుంచి చీలిపోయిన తర్వాత పార్టీ ఆవిర్భావం నుంచి 15 ఏండ్లపాటు జిలానీ ఈ పదవిలో కొనసాగారు. జిలానీ చైర్మన్ పదవినుంచి దిగిపోవాలని నిర్ణయించుకున్న తర్వాత.. జరిగిన పార్టీ కార్యనిర్వాహకవర్గ సమావేశంలో ఈ పదవికి అష్రఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అమెరికా స్కూల్‌లో మళ్లీ కాల్పులు

ఇద్దరు విద్యార్థులకు గాయాలు.. దుండగుడు హతం

గ్రేట్‌మిల్స్: నెల రోజుల క్రితం అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓ పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటనను మరువకముందే మరో రాష్ట్రంలోని మరో స్కూల్‌లో మంగళవారం తుపాకుల మోత వినిపించింది. తూర్పు అమెరికన్ రాష్ట్రమైన మేరీల్యాండ్‌లో గ్రేట్‌మిల్స్ హైస్కూల్‌లో ఆస్టిన్ రోలిన్ (17) అనే విద్యార్థి తుపాకీతో ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు గాయాలపాలయ్యారు. రోలిన్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో రోలిన్ గాయాలపాలై ప్రాణాలు కోల్పోయాడు.

ఏఏఐలో 542 జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

విద్య, ఉద్యోగ సమాచారం

- ఇంజినీరింగ్ అభ్యర్థులకు అవకాశం
- గేట్ స్కోర్ ఆధారంగా ఎంపిక
- విమానయాన శాఖలో ఉద్యోగం
- మంచి జీతభత్యాలు, ఉద్యోగభద్రత

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ ఎగ్జిక్యూటివ్ (గేట్ స్కోర్-2018 ఆధారంగా) పోస్టుల భర్తీకి అర్హులైన ఇంజినీరింగ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

మినీరత్న గుర్తింపు పొందిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వంలోని పౌర విమానయాన శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థ.

- **పోస్టు పేరు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్
- **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, సివిల్, ఎలక్ట్రికల్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 542

విభాగాలవారీగా ఖాళీలు:

- సివిల్-100 పోస్టులు (జనరల్-50, ఓబీసీ-27, ఎస్సీ-15, ఎస్టీ-8)
- ఎలక్ట్రికల్-100 పోస్టులు (జనరల్-50, ఓబీసీ-27, ఎస్సీ-15, ఎస్టీ-8)
- ఎలక్ట్రానిక్స్-330 పోస్టులు (జనరల్-189, ఓబీసీ-80, ఎస్సీ-39, ఎస్టీ-22)
- ఆర్కిటెక్చర్-12 పోస్టులు (జనరల్-9, ఓబీసీ-2, ఎస్టీ-1)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/డీమ్డ్ యూనివర్సిటీ లేదా ఐఐటీ నుంచి ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్/టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ (బీఈ/బీటెక్), ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ/ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సంబంధిత బ్రాంచి/ఇంజినీరింగ్‌లో గేట్-2018 స్కోర్‌ను కలిగిఉండాలి.



- **వయస్సు:** 2018 ఏప్రిల్ 30 నాటికి గరిష్ఠంగా 27 ఏండ్లకు మించరాదు. ఏఏఐ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** రూ. 40,000-3%-1,40,000 /-, ప్రాథమిక చెల్లింపుతోపాటు, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, మెడికల్ బెనిఫిట్స్ తదితర సౌకర్యాలతోపాటు ఏడాదికి రూ. 9.1 లక్షలు జీతం చెల్లిస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** రూ. 300/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు. దరఖాస్తు ఫీజును కేవలం ఇంటర్నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ ద్వారా మాత్రమే చెల్లించాలి.

- **ఎంపిక విధానం:** గేట్ 2018 స్కోర్ ఆధారంగా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. వినియోగంలో ఉన్న ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఎంటర్ చేయాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 28
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేదీ :** ఏప్రిల్ 27
- **ఫీజు చెల్లించడానికి చివరితేదీ:** మే 2
- **వెబ్‌సైట్:** www.aai.aero

పీహెచ్‌డీ ప్రవేశాలు

న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) 2018-19 విద్యాసంవత్సరానికి వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

ఐఏఆర్ఐ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ.



- **కోర్సు పేరు:** పీహెచ్‌డీ (అగ్రికల్చరల్ సైన్సెస్)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ/ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ (అగ్రికల్చర్), ఎంటెక్/ఎంఈలో ఉత్తీర్ణత. 2018లో పీజీ పూర్తిచేయనున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీని 10+2+4 లేదా 10+2+3 విధానంలో పూర్తిచేయాలి.

గమనిక: న్యూఢిల్లీతోపాటు, ఐసీఏఆర్-సీఐఏఈ భోపాల్‌లో ఈ సీట్లను భర్తీచేస్తారు.

- **ఎంపిక:** రాత పరీక్ష ద్వారా
- **అప్లికేషన్ ఫీజు:** రూ.1000/- (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 500/-)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా

చిరునామా: Registrar, PG School, IARI, New Delhi-110012

- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 16
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీలకు చివరితేదీ:** ఏప్రిల్ 23
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడ్:** మే 26 నుంచి జూన్ 3 వరకు
- **రాతపరీక్ష:** జూన్ 3
- **ఇంటర్వ్యూతేదీ:** జూలై 2
- **వెబ్‌సైట్:** www.iari.res.in

ప్రాజెక్టు కోఆర్డినేటర్లు

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏఎస్ఆర్‌బీ)లో ప్రాజెక్టు కోఆర్డినేటర్లు, హెడ్ డివిజన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:



ఏఎస్ఆర్‌బీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ పరిధిలో పనిచేసే సంస్థ. ప్రస్తుత ఖాళీలను ఐదేండ్ల కాలపరిమితికి భర్తీ చేయనున్నారు.


- ప్రాజెక్టు కోఆర్డినేటర్లు - 9
- హెడ్ డివిజన్ (హెచ్‌వోడీ) - 11
- **పేస్కేల్:** పై రెండు పోస్టులకు రూ. 37,400 - 67,000 + గ్రేడ్ పే రూ. 10,000/-
- **వయస్సు:** 2018, ఏప్రిల్ 16 నాటికి 21- 60 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఫీజు:** రూ. 500/- , ఎస్సీ, ఎస్టీ, మహిళ, దివ్యాంగులకు ఎటువంటి ఫీజు లేదు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మే 1
- **వెబ్‌సైట్:** http://asrb.org.in

డీపీఎస్‌లో స్టెనోగ్రాఫర్లు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ పర్చేజ్ & స్టోర్స్ (డీపీఎస్) నాన్ గెజిటెడ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
- **విభాగాలవారీగా ఖాళీలు:** స్టెనోగ్రాఫర్ (గ్రూప్ బీ)-1, స్టెనోగ్రాఫర్ (గ్రూప్ సీ)-5, జూనియర్ పర్చేజ్ అసిస్టెంట్ లేదా జూనియర్ స్టోర్ కీపర్-5 పోస్టులు ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/బోర్డు నుంచి పదోతరగతి/మెట్రిక్యులేషన్, బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత. ఇంగ్లిష్ స్టెనోగ్రఫీ టెస్ట్, ఇంగ్లిష్ టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి. జూనియర్ స్టోర్ కీపర్ పోస్టులకు మెటీరియల్స్ మేనేజ్‌మెంట్‌లో ఇంజినీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు.
- **వయస్సు:** 18 నుంచి 27 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.



- **పే స్కేల్:** రూ. 25,500/-
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 16
- **వెబ్‌సైట్:** https://recruit.barc.gov.in

విజ్ఞాన్ ప్రసార్‌లో

న్యూఢిల్లీలోని విజ్ఞాన్ ప్రసార్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల (తాత్కాలిక ప్రాతిపదికన) భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

విజ్ఞాన్ ప్రసార్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ పరిధిలో పనిచేస్తున్న సంస్థ.

- **పోస్టు పేరు:** సీనియర్ కాపీ ఎడిటర్ (ఇంగ్లిష్), ట్రెయినింగ్ కో ఆర్డినేటర్ (ప్రొడ్యూసర్), సీనియర్ రిపోర్టర్.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీతోపాటు సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి. జర్నలిజం/ మాస్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్ మీడియాలో డిప్లొమా/డిగ్రీ సర్టిఫికెట్, సీనియర్ రిపోర్టర్‌కు సైన్స్‌లో పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.



- **పే స్కేల్ :** సీనియర్ రిపోర్టర్ రూ. 30,000- 40,000/- ఇతర పోస్టులకు రూ. 60,000/-
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఏప్రిల్ 6
- **వెబ్‌సైట్:** http://vigyanprasar.gov.in


వైల్డ్‌లైఫ్‌లో ప్రాజెక్టు ఫెలోస్

వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ)లో ప్రాజెక్టు ఫెలోస్, బయాలజిస్టు, ప్రాజెక్టు ఇంటర్న్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ పరిధిలో వైల్డ్‌లైఫ్ సంస్థ పనిచేస్తుంది. ప్రస్తుత ఖాళీలు పలు కన్జర్వేషన్స్, ఆర్ అండ్ డీ ప్రాజెక్టుల కింద భర్తీ చేస్తున్నారు. ఈ పోస్టుల కాంట్రాక్టు వ్యవధి ఏడాది.

- ప్రాజెక్టు ఫెలోస్ - 8 పోస్టులు
- **జీతం:** నెలకు రూ. 25,000/-
- **అర్హత:** పీజీలో వైల్డ్‌లైఫ్ సైన్స్/బాటనీ లేదా జువాలజీ లేదా ఫారెస్ట్రీ లేదా లైఫ్ సైన్సెస్ / తత్సమాన సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత.



- ప్రాజెక్టు బయాలజిస్టులు - 1
- ప్రాజెక్టు ఇంటర్న్స్ - 2
- **వయస్సు:** 28 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక:** మార్చి 28న నిర్వహించే రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** మార్చి 27లోగా మెయిల్ చేయాలి.
- **వెబ్‌సైట్:** www.wii.gov.in

పుణె ఐఐఎస్ఈఆర్‌లో

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఐఐఎస్ఈఆర్ కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేసే సంస్థ.

- లైబ్రేరియన్ - 1, డిప్యూటీ రిజిస్ట్రార్ - 1, ప్రిన్స్‌పల్ టెక్నికల్ ఆఫీసర్ (వెటర్నరీ సైన్స్) - 1, ప్రిన్స్‌పల్ టెక్నికల్ ఆఫీసర్ (నేచురల్ సైన్స్) - 1, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ - 3, అసిస్టెంట్ లైబ్రేరియన్ - 1, టెక్నికల్ ఆఫీసర్లు - 5, నర్స్ (పురుష) - 1, టెక్నికల్ అసిస్టెంట్ -11, ల్యాబొరేటరీ టెక్నీషియన్ - 1, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీస్కిల్) - 1 ఖాళీ ఉన్నాయి.



- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 6
- **వెబ్‌సైట్:** http://www.iiserpune.ac.in